బుధవారం
21•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 57
• పేజీలు: 14 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

సాహో ఇస్రో

చంద్రుడి కక్ష్యలో చంద్రయాన్-2 వ్యోమనౌక (ఊహాచిత్రం)

జాబిలి చెంతకు

దిగ్విజయంగా చంద్రుడి కక్ష్యలోకి..
చంద్రయాన్-2 మిషన్‌లో కీలక ఘట్టం విజయవంతం
వచ్చే నెల 7న చంద్రుడిపై దిగనున్న ల్యాండర్

మంగళవారం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో చంద్రయాన్-2 వ్యోమనౌక నమూనాను మీడియాకు చూపుతున్న చైర్మన్ కే శివన్

చంద్రయాన్-2 మిషన్‌లో మరో కీలక ఘట్టం దిగ్విజయంగా పూర్తయింది. చంద్రయాన్-2 వ్యోమనౌక మంగళవారం విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది. 1,738 సెకండ్ల పాటు కొనసాగిన ఈ ప్రక్రియ.. ముందుగా నిర్ణయించిన మేరకు మంగళవారం ఉదయం 9.02 గంటలకు పూర్తయిందని ఇస్రో వెల్లడించింది. దీని తర్వాత 100 కి.మీ.x100 కి.మీ.ల చంద్రుడి కక్ష్యలోకి వ్యోమనౌకను ప్రవేశపెట్టేందుకు వివిధ దశలను చేపట్టనున్నట్లు వివరించింది. వ్యోమనౌకను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టే సమయంలో తమ గుండె దాదాపు ఆగిపోయిందని ఇస్రో చైర్మన్ కే శివన్ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 7న వేకువజామున 1.55 గంటలకు చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్‌ను సాఫ్ట్ ల్యాండింగ్ చేసే ప్రక్రియ అత్యంత ఉత్కంఠతో కూడుకున్నదని చెప్పారు.

5

మంగళవారం ప్రగతిభవన్‌లో కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి కూడా ఉన్నారు.

అభినందన్‌ను హింసించిన
అహ్మద్‌ఖాన్ హతం

5

చికెన్ ధరలు (వెన్‌కాబ్)	(రూ.)		
ఫారం ధర	79.00	రిటైల్ లైవ్	101.00
డ్రెస్‌డ్	146.00	స్కిన్‌లెస్	167.00

గుడ్ల ధరలు (వందకు)	(రూ.)		
హైదరాబాద్	341.00	రంగారెడ్డి	341.00
మెదక్	341.00	కరీంనగర్	344.00
వరంగల్	344.00	చిల్లర ధర	4.00

ఆరోగ్యశ్రీ మస్తు

ప్రైవేటు దవాఖాన యాజమాన్యాల సమ్మె విరమణ ■ మంత్రి ఈటలతో చర్చలు సఫలం

పెండింగ్ బకాయిలు చెల్లింపునకు ప్రభుత్వం సమ్మతి ■ ప్రతినెలా బిల్లులు చెల్లించేందుకు అంగీకారం

ఆయుష్మాన్‌భారత్ కంటే ఆరోగ్యశ్రీ వందరెట్లు ఉత్తమం ■ చర్చల అనంతరం మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

మంత్రి ఈటలను గౌరవ అధ్యక్షుడిగా ప్రకటించాం ■ తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రకటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలు సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించాయి. ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించేందుకు మంగళవారం సచివాలయంలో నెట్‌వర్క్ దవాఖానల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. సమస్యలు పరిష్కరిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల వారికి హామీఇచ్చారు. ఇప్పటి వరకు ఉన్న పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు అంగీకరించారు. ప్రతినెలా ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. మంత్రి హామీపై సంతృప్తిచెందిన దవాఖానల యాజమాన్యాలు సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించాయి. చర్చల అనంతరం మంత్రి ఈటల మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ గొప్పగా అమలవుతున్నదని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ వర్తిస్తున్నదని చెప్పారు. దేశానికే ఆరోగ్యశ్రీ పథకం రోల్‌మోడల్ అని పేర్కొన్నారు. ఆయుష్మాన్‌భారత్ కన్నా ఆరోగ్యశ్రీ పథకం వందరెట్లు గొప్పదని తెలిపారు. ఆయుష్మాన్‌భారత్ కేవలం 25 లక్షల

మిగతా 2వ పేజీలో

ప్రజాసేవకు అంకితమవ్వండి

కలెక్టర్లతో ముఖ్యమంత్రి కేసీఆర్ ■ 9.30 గంటలపాటు సుదీర్ఘ సమావేశం

నేడు కోమటిబండకు ముఖ్యమంత్రి ■ హరితహారంపై కలెక్టర్లతో అక్కడే భేటీ

1200 ఎకరాల్లో పునరుద్ధరించిన అడవిని కలెక్టర్లతో కలిసి పరిశీలించనున్న సీఎం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రజాసేవకు అంకితమవ్వాలని, ప్రజలతో మమేకమవ్వాలని జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సూచించారు. కొత్త పురపాలక, పంచాయతీరాజ్ చట్టాలను సమర్థంగా అమలుచేయడం ద్వారా పట్టణాలు, పల్లెప్రాంతాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం తొమ్మిదిన్నర గంటలపాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఈ సమావేశానికి 33 జిల్లాల కలెక్టర్లతోపాటు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, వివిధ శాఖల కార్యదర్శులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పురపాలక, పంచాయతీరాజ్‌చట్టాల అమలుపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. అలాగే గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై 60 రోజులపాటు చేపట్టాల్సిన ప్రత్యేక కార్యక్రమాలపైనా చర్చించినట్లు తెలిసింది. కొత్త రెవెన్యూ చట్టం తీసుకురానున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రైతులు భూ యాజమాన్య హక్కుల విషయంలో

మిగతా 2వ పేజీలో

మిడ్‌మానేరు ఇక శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ 3

మంగళవారం ప్రగతిభవన్‌లో కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి, మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ ఉన్నారు.

ప్రజాసేవకు అంకితమవ్వండి

మొదటిపేజీ తరువాయి...

ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? వాటిని ఎలా పరిష్కరించాలి? కొత్తగా రూపొందించే చట్టంలో ఏ అంశాలను ప్రధానంగా తీసుకోవాలి? అనే అంశాలపై కలెక్టర్లతో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఈ విషయాల్లో కలెక్టర్ల నుంచి విస్తృతస్థాయిలో అభిప్రాయాలను సీఎం తీసుకున్నారని తెలిసింది. జిల్లాలవారీగా పట్టణాలు, గ్రామాల్లో సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపైనా కలెక్టర్లతో సీఎం చర్చించినట్లు సమాచారం.

నేడు కోమటిబండకు సీఎం కేసీఆర్

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బుధవారం కలెక్టర్లందరినీ తీసుకుని సిద్దిపేట జిల్లా కోమటిబండకు వెళ్లనున్నారు. అక్కడే వారితో సమావేశం నిర్వహించనున్నారు. కోమటిబండలోని 1200 ఎకరాల భూమిలో అడవిని ప్రత్యేకంగా పునరుద్ధరించారు. అటవీ అధికారులు తీసుకున్న ప్రత్యేక చర్యలతో కోమటిబండలో ఇప్పుడు అడవి పచ్చగా కనిపిస్తున్నది. ఇదే తరహాలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అడవుల పునరుద్ధరణ జరుగాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. కోమటిబండలో పునరుద్ధరించిన అడవిని కేస్‌స్టడీగా తీసుకొని కలెక్టర్లు అంతా ముందుకువెళ్లాలని కేసీఆర్ దిశానిర్దేశనం చేయనున్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్లను కోమటిబండకు తీసుకువెళుతున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. కోమటిబండలో మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను సీఎం పరిశీలించడంతోపాటు మిషన్ భగీరథ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలుస్తున్నది. ఇక్కడే జిల్లా కలెక్టర్లతో హరితహారం తదితర కార్యక్రమాలపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు.

కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గుత్తా వెంట మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తేర చిన్నపరెడ్డి, కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, గొంగిడి సునీత, రవీంద్రకుమార్, భాస్కర్‌రావు, పార్టీ నేతలు వేనేపల్లి చందర్‌రావు, వేమిరెడ్డి నర్సింహారెడ్డి, జితేందర్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

ప్రైవేటు వర్సిటీలకు ఆహ్వానం

దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ జారీ

రాష్ట్ర యువతకు 25% సీట్లు ఇవ్వాల్సిందే

ప్రభుత్వానికి 10 కోట్ల కార్పస్‌ఫండ్ చెల్లించాలి

- 30 కోట్ల విలువైన ఆస్తులు చూపించాలి
- జీవో జారీచేసిన విద్యాశాఖ కార్యదర్శి
- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు..ధర రూ.50 వేలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీలు త్వరలో కొలువుతీరనున్నాయి. ప్రైవేటువర్సిటీల ఏర్పాటుకు అనుమతి ఇస్తూ గత ఏడాది ప్రభుత్వం చట్టంచేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రైవేటువర్సిటీల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి మంగళవారం జీవోతోపాటు నోటిఫికేషన్ జారీచేశారు. ప్రైవేటువర్సిటీల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలు, విధివిధానాలను విడుదల చేశారు. ఈ నిబంధనలు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయని, గెజిట్ కూడా ప్రచురితమైందని జీవోలో పేర్కొన్నారు. ప్రైవేటువర్సిటీ ఏర్పాటు కోసం www.tsche.ac.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తు ధర రూ.50 వేలుగా నిర్ణయించారు. దరఖాస్తుదారులు యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి సమగ్ర సమాచారంతో పాటు ప్రాజెక్టు నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలి. దరఖాస్తులతో పాటు నాన్‌రిఫండబుల్ కింద రూ.10 లక్షలు చెల్లించాలి.

ప్రైవేటు వర్సిటీల ఏర్పాటులో ముఖ్యమైన నిబంధనలు..

- అడ్మిషన్లలో 25 శాతం సీట్లను తప్పనిసరిగా తెలంగాణ యువతకు కేటాయించాలి. వరుసగా రెండేండ్లు తెలంగాణలో నివాసమున్న వారంతా అర్హులే. ఖాళీ సీట్లను జనరల్ క్యాటగిరీతో భర్తీచేయాలి.
- యూనివర్సిటీ ఏర్పాటుకు హెచ్ఎండీఏ పరిధిలో 20 ఎకరాలు, ఇతరప్రాంతంలో 30 ఎకరాల భూమి తప్పనిసరిగా కలిగి ఉండాలి.
- యూనివర్సిటీ పరిపాలన భవనం 1,000 చదరపు మీటర్లకు తక్కువకాని విస్తీర్ణంలో ఉండాలి. అకడమిక్ భవనాలైన గ్రంథాలయాలు, ఉపన్యాస గది, పరిశోధనాలయాలు కలిపి పదివేల చదరపు మీటర్లలో నిర్మించాలి.
- యూనివర్సిటీ ఏర్పాటుకు అతిముఖ్యమైన నిబంధన కార్పస్‌ఫండ్. వర్సిటీ ఏర్పాటుసమయంలో ప్రభుత్వానికి రూ.10 కోట్ల కార్పస్‌ఫండ్‌ను చెల్లించాలి. రూ.30 కోట్ల విలువైన భవనం, నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, యూనివర్సిటీ క్యాంపస్‌తోపాటు స్థిరాస్తులను చూపాలి.
- యూనివర్సిటీ చాన్సలర్ల నియామకం కోసం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రకటనలు ఇవ్వాలి. దరఖాస్తులకు కనీసం ఒక నెల గడువు ఇవ్వాలి.
- ఎండోమెంట్ ఫండ్ కింద యూనివర్సిటీ ప్రాజెక్ట్ వ్యయంలో 1 శాతం లేదా రూ.10 కోట్లు చూపించాలి.
- యూనివర్సిటీ వార్షిక నివేదికలను చట్టప్రకారం తయారుచేసి ఏటా ప్రభుత్వానికి సమర్పించాలి. ఆర్థిక సంవత్సరం ముగిసిన ఆరునెలల్లో నివేదికలను ప్రభుత్వానికి అందించాలి.
- ప్రతి యూనివర్సిటీ ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను నిపుణుల కమిటీ తనిఖీ చేసి ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. కమిటీ సంతృప్తి చెందితే సానుకూలత వ్యక్తం చేస్తుంది. లేదంటే అభ్యంతరాలు చూపెడుతూ నిబంధనలు తప్పనిసరిగా అమలుచేయాలని సిఫారసు చేస్తుంది.
- నిపుణుల కమిటీలో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ, లేదా స్పెషల్ చీఫ్‌సెక్రటరీ కొనసాగుతారు. సభ్యులుగా ఉన్నత విద్యామండలి చైర్మన్, జేఎన్టీటీయూహెచ్ వీసీ, ఓయూ వీసీ, ఇద్దరు నిపుణులు లేదా ప్రముఖులు కొనసాగుతారు. సభ్యకార్యదర్శిగా కళాశాలల విద్యా కమిషనర్ కొనసాగుతారు.

త్వరలోనే దరఖాస్తుల స్వీకరణకు షెడ్యూల్

ప్రైవేటు వర్సిటీలు వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది. యూనివర్సిటీల ఏర్పాటుపై ప్రైవేటు సంస్థల నుంచి దరఖాస్తుల స్వీకరణకు షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉన్నది. దీనిపై త్వరలోనే ప్రభుత్వం ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంటుంది.

-తుమ్మల పాపిరెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

జీహెచ్ఎంసీ మరోసారి బాండ్ల జారీ

- రూ.100 కోట్లు సమీకరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బాండ్లజారీ ద్వారా రూ.100 కోట్లు సేకరించింది. ఇదివరకే రెండు దఫాలు మున్సిపల్ బాండ్లను జారీచేయడం ద్వారా రూ.395 కోట్లు సేకరించిన జీహెచ్ఎంసీ.. తాజాగా మంగళవారం మరోసారి 10.23 వడ్డీ రేటుపై బాండ్లను జారీచేసి రూ.100 కోట్లు సమీకరించింది. మూడుసార్లు బాండ్లను జారీచేసి నిధులు సేకరించిన ప్రథమ మున్సిపల్ కార్పొరేషన్‌గా జీహెచ్ఎంసీ రికార్డులకెక్కింది. ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని రోడ్లను సిగ్నల్‌ఫ్రీ మార్చేందుకు జీహెచ్ఎంసీ వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి పథకం (ఎస్సార్డీపీ)ను చేపట్టిన విషయం విదితమే. ఇందులోభాగంగా నిర్మించే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల కోసం మున్సిపల్ బాండ్ల ద్వారా నిధులు సేకరిస్తున్నది. బాండ్ల జారీద్వారా రూ.1000 కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ క్రమంలోనే మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ బొంతు రామ్మోహన్ సమక్షంలో ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించారు. 10.23 శాతం వడ్డీ రేటుకు ఆరుసంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొని రూ.100 కోట్లు పెట్టుబడులు పెట్టాయి. నెల రోజుల్లో బాండ్లజారీ ద్వారా మరో రూ.200 కోట్లు సేకరించనున్నట్టు మేయర్ బొంతు రామ్మోహన్ తెలిపారు.

జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్

1. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించి మంగళవారం తన నివాసంలో మొక్క నాటుతున్న జీఎమ్మార్ సంస్థల అధినేత గ్రంథి మల్లికార్జునరావు
2. ఏపీలోని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించి తన నివాసంలో మొక్క నాటుతున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి
3. ఎంపీ సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా తన నివాసంలో మొక్క నాటిన సినీనటుడు అక్కినేని అఖిల్

మొక్కలునాటిన జీఎమ్మార్, రంజిత్‌రెడ్డి, అఖిల్

- గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించి పలువురి నామినేట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్‌చాలెంజ్‌ను సినీనటుడు అక్కినేని అఖిల్, జీఎమ్మార్ అధినేత గ్రంథి మల్లికార్జునరావు స్వీకరించారు. తమ నివాసాల్లో మంగళవారం మొక్కలను నాటారు. అఖిల్ తన సోదరుడు అక్కినేని నాగచైతన్య, సినీనటుడు వరుణ్‌తేజ్‌ను నామినేట్‌చేశారు. పచ్చదనం పెంచే గొప్ప కార్యక్రమంలో తనను భాగస్వామిని చేసినందుకు అఖిల్.. ఎంపీ సంతోష్‌కుమార్‌కు ట్విట్టర్‌లో ధన్యవాదాలు తెలిపారు. మొక్క నాటిన ఫొటోను షేర్‌చేశారు.

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా..

నర్సరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విసిరిన గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తన నివాసంలో మొక్క నాటారు. ఆయన మరో ముగ్గురిని నామినేట్‌చేశారు.

రాష్ట్రానికి భారీగా కంపా నిధులు

- రూ. 500 కోట్ల విడుదలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- నిధుల వినియోగంలో తెలంగాణ అగ్రస్థానం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కంపా (కాంపెన్సెటరీ ఎఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ)కింద రాష్ట్రానికి ఈ ఏడాది రూ.500 కోట్లు విడుదల చేసేందుకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ సమ్మతించింది. దీంతో రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పెద్దమొత్తంలో నిధులు విడుదల కాబోతున్నాయి. కంపా కింద ప్రస్తుత ఏడాదికి కనీసం రూ.500 కోట్లు అవసరమని అటవీశాఖ పంపిన 'యాన్యువల్ ప్లాన్ ఆఫ్ ఆపరేషన్‌కు' కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రత్యామ్నాయ అడవుల పెంపకానికి కంపా నిధులను సమర్థంగా ఉపయోగించడం వల్లే కేంద్రం సమ్మతించింది. వివిధ ప్రాజెక్టుల కింద తీసుకున్న అటవీభూమికి ప్రత్యామ్నాయంగా అడవుల పెంపకానికి రాష్ట్రం కంపా కింద భారీమొత్తంలో జమచేసింది. రాష్ట్రం నుంచి ఇప్పటికే 'కంపా' అడ్‌హాక్‌ఖాతాలో రూ.3000 కోట్లు జమయ్యాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆయా రాష్ట్రాలు జమచేసిన డిపాజిట్ మొత్తంలో ఏటా పదిశాతమే కేంద్రం చెల్లిస్తున్నది. కానీ కంపా నిధుల వినియోగంలో తెలంగాణ రికార్డు సాధించినందున వెసులుబాటు కల్పించాలని, పదిశాతం కంటే ఎక్కువ నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆది నుంచి కోరుతున్నది. కనీసం 20 శాతం నిధులు ఇవ్వాలని కేంద్రానికి పలుసార్లు విజ్ఞప్తి చేసింది. కంపా కింద లక్ష్యానికి మించి పనులు చేపడుతున్నామని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద పెద్దఎత్తున ప్లాంటేషన్, అర్బన్‌పార్క్‌ల ఏర్పాటు, అడవుల పునర్జీవం వంటి కార్యక్రమాలకు అదనంగా నిధులు ఇవ్వాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. వాస్తవానికి దేశంలో ఎక్కడాలేని విధంగా కంపా నిధులను సకాలంలో వినియోగిస్తున్న దృష్ట్యా అదనపు నిధులు అవసరమని అటవీశాఖ నివేదిక సమర్పించింది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత ప్రత్యామ్నాయ అడవుల సృష్టికి తమ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తున్నదని, ఫలితాలు వందశాతంగా ఉన్నాయని అటవీశాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

దేశంలోనే తెలంగాణ రికార్డు

2009 నుంచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017-18 వరకు కంపా కింద రాష్ట్రానికి రూ.662.37 కోట్లు విడుదలయ్యాయి. అందులో ఇప్పటివరకు 645.36 కోట్లు ఖర్చయ్యాయి. ఉమ్మడి ఏపీలో 60 శాతం దాటని నిధుల వినియోగం, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక 98 శాతాన్ని దాటాయి. 2014-15లో రూ.80.92 కోట్లు విడుదలవగా రూ.77.90 కోట్లు ఖర్చుచేశారు. 2015-16లో రూ.76 కోట్లురాగా రూ.73 కోట్లు వెచ్చించారు. 2016-17లో రూ. రూ.108 కోట్లు వస్తే రూ.110 కోట్లు వెచ్చించారు. వ్యయం రికార్డుస్థాయిలో 111 శాతం దాటింది. ముందు సంవత్సరాల్లో మిగిలిన నిధులను అడవుల అభివృద్ధి కోసం వెచ్చించడంతో ఇది సాధ్యమైంది. మరోవైపు 2017-18లో ప్రత్యామ్నాయ అడవుల పెంపకానికి రూ.137.60 కోట్లను (98 శాతం) ఖర్చుచేశారు. 2018-19 ఏడాదికి వ్యయం రూ.213 కోట్లను దాటింది. దేశంలోనే ఎక్కువగా కంపా నిధులను వినియోగించిన రాష్ట్రంగా తెలంగాణ తొలివరుసలో నిలిచింది. క్షేత్రస్థాయిలో నిధుల వినియోగాన్ని పరిశీలించిన కేంద్రబృందం సంతృప్తి వ్యక్తంచేసింది. రూ.500 కోట్లు విడుదలచేయడానికి కేంద్రం అంగీకరించిందని అధికారులు తెలిపారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.04 గంటలకు

సూర్యాస్తమయం: 6.35 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, షష్ఠి, నక్షత్రం: అశ్విని, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 12.19 నుంచి 1.53 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.54 నుంచి మధ్యాహ్నం 12.44 వరకు, వర్జ్యం: లేదు.

ఆరోగ్యశ్రీ మస్తు

మొదటిపేజీ తరువాయి...

కుటుంబాలకే వర్తించే అవకాశం ఉన్నదని, ఆరోగ్యశ్రీతో 85 లక్షల కుటుంబాలకు సేవలు అందుతున్నాయని వివరించారు. ప్రతినెలా విడుదల కావాల్సిన చెల్లింపులు ఆలస్యమవడంతో చిన్న దవాఖానలకు ఇబ్బంది కలుగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఇప్పటివరకు రూ.520 కోట్లు విడుతలవారీగా విడుదల చేసినట్టు తెలిపారు. రాబోయేకాలంలో ప్రతినెలా కొంత మొత్తం చెల్లించాలని దవాఖానల యాజమాన్యాలు కోరాయని, తప్పకుండా అమలుచేస్తామని భరోసా ఇచ్చారు. 2007-12 మధ్యకాలంలోని ఎంవోయూలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదని, తప్పకుండా పరిశీలిస్తామని స్పష్టంచేశారు. ఎంవోయూలను సులభతరం చేసేందుకు కమిటీని నియమిస్తున్నట్టు ప్రకటించారు.

మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో సమావేశమైన తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆయుష్మాన్‌భారత్ వద్దు.. ఆరోగ్యశ్రీ ముద్దు

మమ్మల్ని కడుపులో పెట్టుకొని చూసుకుంటామని మంత్రి ఈటల భరోసా ఇవ్వడం సంతోషంగా ఉన్నది. సమస్యలను ఓపికగా విని, పరిష్కరించేందుకు ముందుకొచ్చినందుకు కృతజ్ఞతలు. చిన్న దవాఖానలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నది. ఆరోగ్యశ్రీతో రాష్ట్రంలో మూడున్నరకోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. మాకు ఆయుష్మాన్‌భారత్ వద్దు ఆరోగ్యశ్రీనే కావాలని చెప్పాం. ఆయుష్మాన్‌భారత్ కంటే ఆరోగ్యశ్రీ మంచి పథకం. మాకోసం ఆలోచిస్తున్న మంత్రి ఈటలను తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ప్రకటించాం. తక్షణమే సమ్మె విరమిస్తున్నాం. ఆరోగ్య తెలంగాణలో పాలుపంచుకుంటాం.

-రాకేశ్‌రెడ్డి, తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

గణేశ్ మండపాల విద్యుత్‌కు టారిఫ్

నిర్ణయించిన టీఎస్ఎస్పీడీసీఎల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గణేశ్ నవరాత్రి ఉత్సవాల మండపాలకు విద్యుత్ టారిఫ్‌ను టీఎస్ఎస్పీడీసీఎల్ నిర్ణయించింది. సెప్టెంబర్ రెండు నుంచి 12 వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో నెలకొల్పే మండపాలకు తాత్కాలిక ప్రాతిపదికన విద్యుత్ కనెక్షన్లను మంజూరుచేయడానికి సంస్థ సీఎండీ రఘుమారెడ్డి సూపరింటెండెంట్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీచేశారు. 2018-19 నిబంధనల ప్రకారం తాత్కాలిక సరఫరా క్యాటగిరీ కింద యూనిట్‌కు రూ.11, కిలోవాట్‌కు నెల చొప్పున ఫిక్స్‌డ్ చార్జీలు వసూలుచేస్తామన్నారు. విద్యుత్ తీగలకు కొండీలు తగిలించి అనుమతి లేకుండా కరంట్ తీసుకోవద్దని తెలిపారు. గణేశ్ మండపాల నిర్వాహకులను సంప్రదించి విద్యుత్ కనెక్షన్లకు అనుమతి తీసుకొనేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. 250 వాట్ల వినియోగానికి రూ.500, 250 నుంచి 500వాట్ల వరకు రూ.1000, 500 వాట్ల నుంచి 1000 వాట్ల వరకు రూ.1500, ఆపైన వినియోగించే ప్రతి 500 వాట్లకు అదనంగా రూ.750 చెల్లించాల్సి ఉంటుంది.

సీపీజీఈటీలో సీట్లు పొందినవారి జాబితా 29న విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని యూనివర్సిటీల పరిధిలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్ట్- 2019లో సీట్లు పొందిన విద్యార్థుల తొలి జాబితాను ఈ నెల 29న విడుదల చేయనున్నట్టు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ కిషన్ మంగళవారం తెలిపారు. ఇప్పటికే సీపీజీఈటీలో అర్హత సాధించినవారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా కళాశాలలు, కోర్సులను ఎంపికచేసుకున్నారని, తమ ఆప్షన్లను మార్చుకొనేందుకు ఈ నెల 27న అవకాశం కల్పించామని వెల్లడించారు.

లోకం పోకడ



మిడ్ మానేరు ఇక శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లకు దేవతామూర్తుల పేర్లను ఖరారుచేసిన ప్రభుత్వం.. మధ్య మానేరు జలాశయానికి కూడా పేరును ఖరారుచేసింది. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయరుగా నామకరణం చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బరాజ్‌కు లక్ష్మి, అన్నారం బరాజ్‌కు సరస్వతి, సుందిల్ల బరాజ్‌కు పార్వతి, లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌కు గాయత్రి, నంది మేడారం పంప్‌హౌస్‌కు నంది, అనంతగిరి జలాశయానికి అన్నపూర్ణ పేర్లను గతంలోనే ఖరారుచేసిన సంగతి తెలిసిందే. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌కు అవే పేర్లు ఉంటాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న పేరిట మిడ్‌మానేరుకు శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌గా నామకరణం చేయటంపై ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్-హైటెక్‌సిటీ మధ్య రివర్సల్ సౌకర్యం

- ఇక ప్రతి 4 నిమిషాలకు ఓ మెట్రోరైలు
- ఎల్బీనగర్-మియాపూర్ మధ్య కూడా పెరుగనున్న రైళ్ల ఫ్రీక్వెన్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెట్రోరైల్ ద్వారా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్-హైటెక్‌సిటీ మార్గంలో ప్రయాణించేవారికి శుభవార్త. ఆ మార్గంలో ఇప్పుడు ప్రతి 4 నిమిషాలకు ఒక మెట్రోరైలు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు ఎక్కువసేపు వేచిచూడాల్సిన అగత్యం తప్పింది. ఇప్పటివరకు ఆ మార్గంలో ట్విన్ సింగిల్‌లైన్ మెథడ్ కారణంగా ప్రతి 15 నిమిషాలకు ఓ రైలు అందుబాటులో ఉండేది. మంగళవారం నుంచి ఆ మార్గంలో రివర్సల్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచేందుకు మార్గం సుగమమైందని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మరోవైపు ఎల్బీనగర్-మియాపూర్ మార్గంలో కూడా ఫ్రీక్వెన్సీని పెంచి ప్రతి 5 నిమిషాలకొక మెట్రోరైలును నడిపించనున్నామని, అవసరమైతే ప్రతి 3 నిమిషాలకొక రైలు నడిపిస్తామని చెప్పారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు మెట్రోరైళ్లలో ఏసీ ఉష్ణోగ్రతను 23 సెల్సియస్ డిగ్రీలకు తగ్గించినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

మెట్రో రైలులో ఎక్కేందుకు సిద్ధమవుతున్న ప్రయాణికులు

ఎముకల గుట్టువిప్పిన సీసీఎంబీ!

- 'అస్థిపంజరాల సరస్సు' ఎముకలపై ఫలించిన పదేండ్ల పరిశోధన
- భారత్, మధ్యప్రాచ్య, ఆగ్నేయాసియాకు చెందినవారి అస్థిపంజరాలుగా గుర్తింపు
- క్రీ.శ.700-800, 1700-1900 కాలాలవని నిర్ధారణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హిమాలయ పర్వతశ్రేణుల్లోని రూప్‌ఖండ్ సరస్సు వద్ద ఉండిపోయిన అస్థిపంజరాలు ఎవరివో తెలిసింది. సముద్రమట్టానికి దాదాపు 5 వేల అడుగుల ఎత్తున ఉన్న రూప్‌ఖండ్ సరస్సు వద్ద ఉన్న అస్థిపంజరాలు భారత్, మధ్యప్రాచ్య, ఆగ్నేయాసియా ప్రాంతాలకు చెందినవారివిగా సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సీసీఎంబీ) నిర్ధారించింది. అస్థి పంజరాలు ఏ కాలానివి? ఏ ప్రాంతానికి చెందినవారివి? ఎలా చనిపోయారు? అనేవి ప్రశ్నలుగా మిగిలిపోయాయి. దీనిని సవాలుగా తీసుకున్న సీసీఎంబీ శాస్త్రవేత్తలు.. అంతర్జాతీయ పరిశోధకుల సహకారంతో దాదాపు పదేండ్లపాటు పరిశోధన సాగించారు. 'అస్థిపంజరాల సరస్సు' అనే ప్రాంతం నుంచి తీసుకొచ్చిన 72 ఎముకల్లో.. అతి ముఖ్యమైన మైటోకాండ్రియా డీఎన్ఏ సీక్వెన్స్, న్యూక్లియర్ జీనోమ్‌పై పరిశోధనలు జరిగిపారు. ప్రపంచవ్యాప్తంగా అనేక మానవ జాతుల్లోఉన్న శాంపిల్స్‌ను తీసుకొని పోల్చిచూశారు. ఈ ఎముకలు మూడు ప్రాంతాలకు చెందినవారివని గుర్తించారు. భారత్, మధ్యప్రాచ్య, ఆగ్నేయాసియా ప్రాంతానికి చెందినవిగా నిర్ధారణకు వచ్చారు. దీంతోపాటు ఈ అస్థిపంజరాలు. ఇక కార్బన్‌డేటింగ్ పద్ధతిని ఉపయోగించి విభిన్న కాలాలకు చెందినవారివని గుర్తించారు. కొన్ని అస్థిపంజరాలు క్రీ.శ 700, 800 శతాబ్దానికి చెందినవారివని, మరికొన్ని క్రీ.శ 1700, 1900 మధ్యకాలానికి చెందినవారివని తేల్చారు. ఈ ఫలితాలు ఇటీవల నేచర్ కమ్యూనికేషన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా పరిశోధకుల్లో ఒకరైన డాక్టర్ కుమారస్వామి తంగరాజ్ మంగళవారం సీసీఎంబీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'భారత్‌లోనే అతి ప్రాచీన డీఎన్ఏను రూప్‌ఖండ్ సరస్సు వద్దనుంచి సేకరించాం. దానిని పరిశోధించగా మూడు విభిన్న జన్యువర్గాలకు చెందినవిగా గుర్తించాం. 72 అస్థిపంజరాల నుంచి తీసుకున్న మైటోక్రాండియల్ డీఎన్ఏను మూడువర్గాలుగా గుర్తించాం. అనంతరం సీసీఎంబీలో ఉన్న ప్రాచీన డీఎన్ఏ ల్యాబోరేటరీలో దాదాపు పదేండ్లపాటు పరిశోధించాం. ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల సహకారం తీసుకున్నాం' అని తెలిపారు. ఈ అస్థిపంజరాలపై అనేక ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయని.. సమీపంలో ఉన్న నందాదేవి దేవాలయం దర్శనానికి వచ్చిన భక్తులే ప్రకృతి విపత్తుకు గురై మృత్యువాత పడిఉంటారని నమ్మేందుకు ఎక్కువగా అవకాశం ఉన్నదన్నారు. ఈ పరిశోధనా ఫలితాలు జన్యుపరిశోధనల గొప్పతనాన్ని, ఆవశ్యకతను తెలుపుతున్నాయని, దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రశ్నార్థకంగా ఉన్న అస్థిపంజరాలను విశ్లేషించడానికి, తద్వారా ప్రాచీన చరిత్ర గమనాన్ని తెలుసుకునేందుకు దోహదం చేస్తుందని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్‌మిశ్రా తెలిపారు.

హిమాలయాల్లోని రూప్‌ఖండ్ సరస్సు


రూప్‌ఖండ్ సరస్సు వద్ద సేకరించిన శాంపిళ్లు

రూప్‌ఖండ్ సరస్సులో మానవ కపాలాలు

మీడియాతో మాట్లాడుతున్న సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా, డాక్టర్ కుమారస్వామి తంగరాజ్

- మనీ సర్క్యులేషన్ స్కీమ్‌తో రూ.5,000 కోట్ల మోసం
- రూ.389 కోట్లు ఫ్రీజ్ చేసిన సైబరాబాద్ పోలీసులు
- కుమారుడు హితిక్‌మల్హాన్ కూడా అరెస్ట్

ఈబిజ్ సంస్థ ఎండీ పవన్‌మల్హాన్, ఆయన కుమారుడు హితిక్‌మల్హాన్ (ఫైల్)

ఈబిజ్ సంస్థ డైరెక్టర్ అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: చట్టవిరుద్ధమైన మనీ సర్క్యులేషన్ స్కీమ్‌తో దేశవ్యాప్తంగా సుమారు 17 లక్షల మందిని రూ.5,000 కోట్ల వరకు మోసంచేసిన ఈబిజ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పవన్‌మల్హాన్ అతని కొడుకు హితిక్‌మల్హాన్‌లను మంగళవారం అరెస్ట్ చేసినట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. ఈబిజ్.కామ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మనీ సర్క్యులేషన్ కంపెనీని నోయిడా కేంద్రంగా నిర్వహిస్తున్నారు. ఇందులో పిరమిడ్ ఆకారంలో సభ్యుల చైన్ పెరుగుతూ వెళ్తుంది. ఒకరు సభ్యుడిగా చేరి.. మరో ముగ్గురిని చేర్పించాలి. ఇలా ముందుగా చేర్పించిన వారికి 9 శాతం కమీషన్, ఆ తర్వాత స్కీమ్‌లోకి వచ్చేవారికి ప్రతి సభ్యుడి చేరికతో 4 శాతం కమీషన్ వచ్చేలా మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లను నిర్వహించారు. ఈ స్కీమ్‌లో చేరే సభ్యుడు రూ.16,821 కంపెనీకి చెల్లించాలి, ఆ తర్వాత ముగ్గురు సభ్యులను చేర్పించాలి, అలా ఎక్కువ మందిని చేర్పించేవారికి బోనస్‌లు, సిల్వర్, గోల్డ్, డైమండ్ పేర్లతో భారీ నజరానాలు ప్రకటించారు. నిరుద్యోగ యువత, విద్యార్థులను లక్ష్యంచేసుకొని సదస్సులు ఏర్పాటుచేసి వారిని ప్రేరేపించేలా ప్రసంగాలు చేయడం, సోషల్‌మీడియాలో ప్రకటనలు ఇస్తూ ఆకర్షించారు. దేశవ్యాప్తంగా తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, జమ్ముకశ్మీర్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, గోవా తదితర రాష్ట్రాల నుంచి అర్హులై పెద్ద సంఖ్యలో సభ్యులుగా చేరారు. స్కీమ్‌లో ఎక్కడో ఒక దగ్గర చైన్ తెగిందంటే మొదట చేరినవారికే డబ్బు వస్తుంది, తర్వాత చేరినవారంతా నష్టపోవాల్సిందే. ఇలా చేరిన కేపీహెచ్‌బీకి చెందిన మహ్మద్ షారూఖ్‌తోపాటు పలువురు సైబరాబాద్ పరిధిలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బ్యాంకు ఖాతాల్లోని రూ. 389 కోట్లు ఫ్రీజ్

దర్యాప్తులో భాగంగా సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న ఈబిజ్ కంపెనీకి సంబంధించిన పలు బ్యాంకు ఖాతాల్లోని రూ.389 కోట్లు ఫ్రీజ్‌చేశారు. సంస్థ ఎండీ పవన్‌మల్హాన్, సంస్థ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అతని కొడుకు హితిక్‌మల్హాన్‌లను అరెస్ట్‌చేసి, మరికొందరి కోసం గాలిస్తున్నారు. నోయిడాలోని ఈబిజ్ సంస్థను సీల్‌చేశారు. మల్టీలెవల్ మార్కెటింగ్, నెట్‌వర్క్ మార్కెటింగ్, రెఫరల్ మార్కెటింగ్, చైన్ మార్కెటింగ్, డైరెక్ట్ సెల్లింగ్ పేర్లను పెట్టి మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లను నిర్వహిస్తుంటారని, మోసంతో కూడుకున్న వీటిని ప్రజలు గుర్తించాలని సీపీ సజ్జనార్ సూచించారు.

- గాయత్రి పంప్‌హౌస్ వెట్ ట్రయల్‌రన్ సక్సెస్
- నిరంతరం పనిచేస్తున్న మూడు మోటర్లు
- నంది పంప్‌హౌస్‌లో మూడు మోటర్లతో ఎత్తిపోతలు
- రాజరాజేశ్వరి రిజర్వాయర్‌లో 6.5 టీఎంసీల నీటినిల్వ
- కృష్ణా, గోదావరి బేసిన్లలో తగ్గిన వరద
- దిగువ గోదావరికి మళ్లీ వరద హెచ్చరిక
- ఉప్పొంగనున్న శబరి, ఇంద్రావతి!

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయంత్రి పంపు హౌస్ వద్ద బాహుబలి మూడు మోటర్ల డెలవరీ సిస్టర్న్‌వద్ద ఉప్పొంగుతున్న జలాలు

జలాభిషేకం

మూడో బాహుబలి మొదలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంపుహౌస్ వద్ద మరో బాహుబలి మోటర్‌ను ప్రారంభించారు. ఇప్పటికే నాలుగు, ఐదు నంబరు మోటర్లు నిరంతరంగా నడుస్తుండగా, ఒకటో మోటర్‌ను దిగ్విజయంగా వెట్ ట్రయల్‌రన్ చేశారు. తొలుత సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.40 గంటల సమయంలో కొద్దిసేపు ఒకటో నంబర్ మోటర్‌ను నడిపిన ఇంజినీర్లు.. తిరిగి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలనుంచి నిరంతరాయంగా నడిపిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ రెండు మోటర్లు నీటిని ఎత్తిపోస్తుండగా.. తాజాగా మరో మోటర్ జతకావడంతో గాయత్రి పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్‌నుంచి జలాలు ఎగిసిపడుతున్నాయి. ఈ జలాలను చూసేందుకు పెద్దసంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. ప్రస్తుతం మూడు మోటర్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మధ్య మానేరు)కు వరదకాల్వ ద్వారా పంపిస్తున్నారు. దీంతో మంగళవారం సాయంత్రం వరకు శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌లో నీటి నిల్వ 6.5 టీఎంసీలకు చేరింది. బాహుబలి మోటర్ల వేగాన్ని చూస్తే బుధవారం నుంచి మూడు మోటర్ల ద్వారా రోజుకు సుమారు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసే అవకాశమున్నదని అధికారులు చెప్తున్నారు. మరోవైపు పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది పంపుహౌస్ వద్ద మంగళవారం ఉదయం మూడో మోటర్ ఆన్‌చేశారు. ఇప్పటికే 2, 4 నంబర్ మోటార్లను నిరంతరం నడిపిస్తున్నారు. మూడో మోటర్ కూడా తోడవటంతో 9,450 క్యూసెక్కుల నీటిని నంది పంపుహౌస్ నుంచి నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. నంది రిజర్వాయర్ వద్ద ఉన్న హెడ్‌రెగ్యులరేటర్ వద్ద ఆరు గేట్లు ఎత్తి గాయత్రి పంపుహౌస్‌కు పంపిస్తున్నారు.

దిగువ గోదావరికి వరద హెచ్చరిక

కృష్ణా, గోదావరి బేసిన్లలో వరదలు దాదాపు ఆగిపోయాయి. దీంతో వివిధ ప్రాజెక్టుల్లో అవుట్‌ఫ్లోలు గణనీయంగా తగ్గించడం లేదా గేట్లు పూర్తిగా మూసివేయడంద్వారా నీటిని ల్వపై కేంద్రీకరించారు. ఇప్పటికే నాగార్జునసాగర్, పులిచింతల గేట్లు మూసుకుపోగా.. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టులో మిగిలిన రెండు గేట్లు కూడా మూసివేశారు. జూరాలలో 9 గేట్ల ద్వారానే నీరు విడుదలవుతున్నది. ఎగువన ఆల్మట్టి గేట్లు మూసివేశారు. దాదాపు అన్ని ప్రాజెక్టుల్లోనూ కేవలం విద్యుత్ ఉత్పత్తి ద్వారానే నీటిని విడుదలచేస్తున్నారు. గోదావరిలోనూ ఎగువన వరద ఉధృతి తగ్గినా.. దిగువ గోదావరికి మాత్రం వరద హెచ్చరిక జారీ అయింది. మరో మూడురోజులపాటు వర్షాలు కురవనుండటంతో శబరి, ఇంద్రావతి నుంచి భారీగా వరదనీరు గోదావరిలో కలిసే అవకాశం ఉన్నదని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) హెచ్చరించింది. దిగువ గోదావరి వెంట భారీ వర్షాలు కురుస్తాయని, ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరుతున్నది. దీంతో మంగళవారం ప్రాజెక్టు 2 గేట్లను ఎత్తి 6,424 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేశారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌కు కూడా భారీగా వరద వస్తున్నది. వరదనీటిని అంచనావేస్తూ 73.39 మీటర్ల నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేసి అదనపు నీటిని వదిలేస్తున్నారు.

వివిధ ప్రాజెక్టుల్లో మంగళవారంనాటి నీటిమట్టాల వివరాలు

రిజర్వాయర్	ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1705.00	1703.38	129.67	122.45	82,000	5,000
నారాయణపుర	1615.00	1613.71	37.64	36.28	40,000	5,650
ఉజ్జయిని	1630.00	1630.00	117.24	117.24	3,705	4,350
జూరాల	1045.00	1044.24	9.66	9.30	1,70,000	1,61,375
తుంగభద్ర	1633.00	1633.00	100.86	100.86	30,950	29,797
శ్రీశైలం	885.00	884.60	215.81	213.40	2,03,800	1,10,366
నాగార్జునసాగర్	590.00	587.80	312.052	305.98	53,109	53,109
పులిచింతల	175.00	168.37	45.77	36.09	0	0
సింగూరు	1717.93	1670.41	29.91	0.45	0	20
నిజాంసాగర్	1405.00	1368.37	17.18	0.14	0	10
శ్రీరాంసాగర్	1091.00	1063.00	90.31	17.32	2,012	400
లోయర్‌మానేరు	920.00	882.90	24.07	3.55	-	206
రాజరాజేశ్వరి	1043.31	1003.28	25.873	6.08	5,463	83
కడెం	700.00	697.10	7.60	6.87	746	888
ఎల్లంపల్లి	485.56	482.91	20.18	17.92	1,092	6,880
మూసీ	645	628.80	4.46	1.24	450	0

అల్కాపూర్‌లో కారు కలకలం

- సినీహీరో రాజ్‌తరుణ్ కారుగా అనుమానం
- మద్యం మత్తులో వేగంగా నడిపి గోడను ఢీకొట్టాడని విమర్శలు
- కారు రిజిస్ట్రేషన్ మరోవ్యక్తి పేరిట ఉందంటున్న పోలీసులు
- ఒకరిని అదుపులో తీసుకున్నామని నార్సింగి పోలీసుల వెల్లడి

మణికొండ, నమస్తే తెలంగాణ: మద్యం తాగి కారును అతివేగంగా నడిపిన ఓ వ్యక్తి నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి గోడను ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ వంద అడుగుల రహదారి మలుపువద్ద గతంలో ఓ కారు ఢీకొని నుజ్జునుజ్జయిన విషయం తెలిసిందే. సరిగ్గా అదే ప్రాంతంలో సోమవారం రాత్రి ఓ కారు అతివేగంగా వచ్చి ఖాళీ ప్లాటు గోడను ఢీకొట్టి నిలిచిపోయింది.. వేగంగా వచ్చి ఢీకొనడంతో గోడ కూలిపోయింది. ప్రమాద ప్రాంతం నుంచి ఓ వ్యక్తి కారునువదిలేసి పరారౌతున్న దృశ్యాలు సీసీటీవీ పుటేజీలో స్పష్టంగా కనిపించాయి. ఈ పుటేజీని పరిశీలించిన స్థానికులు పారిపోతున్న వ్యక్తి సినీహీరో రాజ్‌తరుణ్ అని అనుమానిస్తున్నారు. రద్దీ ప్రాంతంలో మద్యం మత్తులో అజాగ్రత్తగా వాహనం నడిపాడని అల్కాపూర్ టౌన్‌షిప్‌వాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కారు వచ్చిన వేగానికి అక్కడ ఎవరైనా ఉంటే ప్రాణాలు పోయేవని ఆందోళన వ్యక్తంచేశారు. ఆ కారు రాజ్‌తరుణ్‌ది కాదని, అందులో ఆయన లేరని, ఇంట్లోనే ఉన్నారంటూ కుటుంబసభ్యులు పేర్కొంటున్నారు. పోలీసులు రంగంలోకి దిగి వోల్వో కారు నంబరు టీఎస్ 09 ఈఎక్స్ 1100 ఆధారంగా పరిశీలించి.. లీడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందినదని, ప్రదీప్ పేరుతో రిజిస్ట్రేషన్ ఉన్నట్టు గుర్తించారు. అతివేగంగా కారు నడిపిన వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడి పరుగులు తీసిన దృశ్యం మాత్రం సీసీ పుటేజీలో కన్పిస్తుండటంపై పోలీసులు విచారణ చేపట్టారు. అసలు కారులో ఎంతమంది ఉన్నారు.. ఎక్కడికి వెళ్లి వస్తున్నారు.. వారికేమైనా అయ్యిందా అనే విషయాలపై స్పష్టత లేదు. ఇప్పటివరకు పోలీస్‌స్టేషన్‌కు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు. కారు నంబర్ ఆధారంగా గుర్తించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నామని ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.

సోమవారం రాత్రి అల్కాపూర్ టౌన్‌షిప్ ప్రధాన రహదారిలో గోడను ఢీకొట్టిన కారు

వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ బద్దిపోశమ్మకు మంగళవారం భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. ఉదయమే భక్తులు బోనం వండుకొని, డప్పుచప్పళ్ల మధ్య నృత్యాలుచేస్తూ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి కల్లుపోసి, సారెపెట్టి బోనం సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు.
- వేములవాడ కల్చరల్

పూర్తిస్థాయిలో నీండిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు


సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

WALK-IN INTERVIEW
21st to 31st August '19, 10:00am to 1:00pm
ACT FIBERNET
Field Network Engineers: 0-7 yr's exp.
Sales Executives: 0-7 yr's exp.
Customer Care Executives: 0-7 yr's exp.
Qualification: Intermediate/ITI/Diploma/Degree/Hardware & Networking
Venue: ACT Fibernet - Learning & Development Centre, Banjara Hills, Road No. 10, Near Care Hospital Outpatient Centre, Hyderabad - 500034.

నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజానుకూల చట్టాలను రద్దు చేస్తున్నది. ఆర్ఎస్సెస్ లక్ష్యం ప్రమాదకరం. ఆర్ఎస్సెస్ అగ్రనేతలు రిజర్వేషన్లపై చర్చించాలనటం వెనుక పెద్ద కుట్ర ఉన్నది. సామాజిక న్యాయం మీదనే వారి దాడి.

ప్రియాంకా గాంధీ వాద్రా, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి

నేను ఎక్కడున్నా నిబద్ధమైన సైనికునిలా ఉంటా. నేను తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఒక సైనికునిలా పార్టీ విధేయునిలా శ్రమించాను. ఇప్పుడు బీజేపీలో చేరాను. బీజేపీ పెద్దలు ఆదేశిస్తే మమతా బెనర్జీపై పోటీకి సైతం సిద్ధం.

సోవన్ ఛటర్జీ, కోల్‌కతా మాజీ మేయర్, తృణమూల్ మాజీ ఎమ్మెల్యే

చరిత్రలో నేడు

1831

అమెరికాలో బానిసత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీసిన నాట్ టర్నర్.

1888

కూడిక మెషిన్‌ను కనుగొన్న అమెరికా శాస్త్రవేత్త విలియం సేవార్డ్ బారో.

1961

కెన్యా జాతీయోద్యమనేత జోమో కెన్యట్టా జైలు నుంచి విడుదల. 1952లో మౌమౌ ఉద్యమం సందర్భంగా అరెస్టు.

నేపాల్ విద్యుత్ అథారిటీ విద్యుదుత్పత్తిని పెంచడంలో విజయవంతమైంది. నష్టాలను అధిగమించి, లాభాల బాట పట్టింది. దీంతో ఒకప్పుడున్న విద్యుత్ కోతలు ఇప్పుడు లేవు. జాతీయ గ్రిడ్ ఏర్పాటుచేసి దేశమంతటికీ విద్యుత్ సరఫరా చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో చేపట్టిన కొత్త ప్రాజెక్టులు త్వరలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించబోతున్నాయి. దీంతో దేశంలో వాహనాలు శిలాజ ఇంధనానికి బదులుగా విద్యుత్‌ను వాడవచ్చు. వంట గ్యాస్‌కు బదులు విద్యుత్తును వాడితే విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. మిగులు విద్యుత్‌ను విదేశాలకు ఎగుమతి చేయవచ్చు

ది హిమాలయన్ టైమ్స్

వరదలు, తుఫానుల వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనడంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం గతంలో ప్రశంసలు పొందింది. కానీ ఈ ఏడాది అనుభవాలను బట్టి చూస్తే, వరదలను ఎదుర్కొనడంలో అనేక లోపాలున్నాయని వెల్లడైంది. వరదల్లో చిక్కుకున్న వారికి సత్వర సహాయం అందించడంలో, పునరావాస చర్యల్లో కూడా అలసత్వం కనిపించింది. నిధులు వెంటనే విడుదల కాలేదు. ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదు. కానీ ముందుగా ప్రణాళికాబద్ధంగా సిద్ధపడితే వాటి ప్రభావాన్ని భారీగా తగ్గించవచ్చు.

ది డెలీ స్టార్

మైనర్ డ్రైవర్లు!

కాలేజీ విద్యార్థులు బైకులు, కార్లపై మితిమీరిన వేగంతో దూసుకుపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాల పట్ల ఎంతోకాలంగా ఆందోళన చెందుతున్నాం. కానీ కాలేజీ విద్యార్థులే కాదు, మైనారిటీ తీరని పిల్లలు కూడా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు సృష్టిస్తున్నారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఇద్దరి ప్రాణాలు బలిగొని అంతులేని విషాదాన్ని మిగిలించింది. పదో తరగతి చదువుతున్న పదహారేండ్ల బాలుడు స్నేహితులను ఎక్కించుకొని అతివేగంగా రాంగ్‌రూట్‌లో దూసుకుపోయి, ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను, మరో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టాడు. ఆటోలో ఒక మహిళ తన తల్లి, ఇద్దరు కవల పిల్లలతోపాటు ప్రయాణిస్తున్నది. కారు ఢీకొనడంతో ఆ మహిళ గాయాలపాలై విషమ పరిస్థితిలో ఉండగా ఆమె తల్లి ప్రాణాలు కోల్పోయింది.14 నెలల వయసున్న ఇద్దరు కవల పిల్లల్లో ఒక బాలుడు మరణించాడు. ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు కూడా గాయాలు కాగా, వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇలా నగరంలో రోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి నెల 25 నుంచి 30 మంది దాకా దుర్మరణం పాలవుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్ వరకే నగరంలో 250 మంది రోడ్డుప్రమాదాల్లో చనిపోయారు. రోడ్డు ప్రమాదాలకు అనేకానేక కారణాలుంటే, అందులో కొన్ని ప్రమాదాలకు మైనర్లు కారణం కావటం తీవ్ర విషయం. ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 40 శాతం వాటికి మైనర్లే కారకులని తేలింది. 2017లో 1761 ప్రమాదాలకు మైనర్లు కారణమైతే, 2018లో 1931, 2019లో ఇప్పటిదాకా 2832 ప్రమాదాలకు మైనర్లే కారకులు కావటం గమనార్హం. తల్లిదండ్రుల అతి గారాబం, పిల్లల నిర్లక్ష్యం ఇతరుల ప్రాణాలు తోడేసిదిగా మారటమే పెద్ద విషాదం.

పిల్లలు తల్లిదండ్రులు ఇంట్లో ఉన్నా లేకున్నా వాహనాలు తీసుకుని మిత్రులతో పాటు తిరుగుతున్నారు. వీరికి రోడ్డు నిబంధనలు తెలువవు. వాహనాన్ని నడిపేంత పరిణతి ఉండదు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపడం నేరమనే స్పృహ కూడా ఉండటం లేదు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన పిల్లలను తల్లిదండ్రులు వెనుకేసుకురావడం సాధారణం. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులకు తెలువకుండా పిల్లలు వాహనాలను నడుపవచ్చు. తమ వాహనాలను పిల్లలకు అందకుండా జాగ్రత్తపడవలసిన బాధ్యత తల్లిదండ్రులదే.

ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో మన దేశమే అగ్రస్థానంలో ఉన్నది. దీనికి అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడుపటం, ట్రాఫిక్ నిబంధనలు పాటించటంలో అలసత్వం, వాటిపై అవగాహన లోపం ప్రధాన కారణాలని తెలుస్తున్నది. రహదారులను శాస్త్రీయపద్ధతిలో నిర్మించకపోవటం, జాతీయ రహదారుల్లో కూడా అతి దగ్గరి మూల మలుపులు ఉండటం కూడా ప్రమాదాలకు హేతువులుగా ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. 2017లో దేశవ్యాప్తంగా 4,61,000 ప్రమాదాలు జరుగగా లక్షా 49 వేల మంది దుర్మరణం పాలయ్యారు. గతేడాది 4,65,000 ప్రమాదాలు జరుగగా లక్షా 48 వేల మంది చనిపోయారు. ఈ మధ్య కాలంలో ద్విచక్రవాహనాల ప్రమాదాలు పెరిగిపోయి యువత మరణాలు లెక్కకు మిక్కిలి జరుగుతున్నాయి. దీనికి అతివేగం, మద్యం తాగి నడుపటమే ప్రధాన కారణమని తేలింది. ఇలా రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారిలో ఎక్కువగా 16 నుంచి 30 ఏండ్ల లోపు వారే ఉంటున్నారు. ఈ ప్రమాదాలను అరికట్టేందుకే ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో మోటారు వాహనాల చట్టం (సవరణ) బిల్లును ఆమోదించారు. ఈ చట్టంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించటం, మద్యం తాగి వాహనాలు నడుపటం వంటి నేరాలకు జరిమానాలు పెంచటమే కాదు, తీవ్ర నేర విషయంగా పరిగణించి శిక్షా కాలాన్ని కూడా పెంచారు. మైనర్లు, లైసెన్స్ లేకుండా నడిపిన వారికి జరిమానాతో పాటు శిక్ష వేసేవిధంగా చట్టాలకు పదునుపెట్టారు.

మైనర్లకు వాహనాలు అందకుండా చూడటం తల్లిదండ్రుల బాధ్యత. కొందరు తల్లిదండ్రులే పిల్లలకు పనులు చెబుతూ వాహనాలు తీసుకుపొమ్మని పురమాయిస్తున్నారు. ఇదే అలవాటుగా పిల్లలు తల్లిదండ్రులు ఇంట్లో ఉన్నా లేకున్నా వాహనాలు తీసుకుని మిత్రులతో పాటు తిరుగుతున్నారు. వీరికి రోడ్డు నిబంధనలు తెలువవు. వాహనాన్ని నడిపేంత పరిణతి ఉండదు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపడం నేరమనే స్పృహ కూడా ఉండటం లేదు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన పిల్లలను తల్లిదండ్రులు వెనుకేసుకురావడం సాధారణం. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులకు తెలువకుండా పిల్లలు వాహనాలను నడుపవచ్చు. తమ వాహనాలను పిల్లలకు అందకుండా జాగ్రత్తపడవలసిన బాధ్యత తల్లిదండ్రులదే. అందుకే పోలీసులు మైనర్లతోపాటు వాహన యజమానులైన పెద్దలపైనా కేసులు నమోదు చేస్తున్నారు. కొందరు సంపన్నులు జరిమానా విధింపులకు భయపడటం లేదు. జరిమానాలు స్వల్పంగా ఉన్నందున వాటిని చెల్లిస్తూ అదే తప్పు మళ్ళా చేస్తున్నారు. అందువల్ల రెండవసారి నేరం చేసిన వారికి కఠినశిక్షలు వేయాలని పోలీసులు అంటున్నారు. జరిమానాను కూడా భారీగా వడ్డించినప్పుడే తల్లిదండ్రులు జాగ్రత్తపడుతారని వారు సూచిస్తున్నారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ పోలీసులు విప్లవాత్మక మార్పులతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించటంతో పాటు ప్రమాదాల నివారణకు పెద్దపీట వేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై దృష్టిసారించి వాహనదారులకు జరిమానాలు, శిక్షలు విధిస్తున్నారు. రహదారి నిబంధనలు, కుటుంబ బాధ్యతలు గుర్తెరిగి వ్యహరించినప్పుడే రోడ్లపై రక్తం మరకలు అంటవు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది పోలీసుల బాధ్యతగానే భావిస్తే ఆశించిన ఫలితాలు ఉండవు. ప్రమాదాల్లేని సురక్షిత ప్రయాణం తమ బాధ్యతగా ప్రజలు కూడా గుర్తించాలె.

జనగళం

జయజయహో కాళేశ్వరమా..!

నిండుకుండ పొంగిపొరలే
గుండె నిండ రైతు సాగె
కాళేశ్వరమే సుజల నిధి
గలగల నురగలను పారె!

ఎండు కున్న రైతు స్వరం
నిండించే కాళేశ్వరం..
పసిడి పంట రాశులతో
వసి వాడని సాగు వరం!

హాలికులకు కలల పంట
జలముతోను సస్యమంట
తెలంగాణ ముంగిటిలో
పచ్చల తోరణాలంట!

వాయనమే నీకు తల్లి
ఆయువేను మాకు మళ్ళి
దీవించు సదా మమ్ముల

రైతుపాలి కల్పవల్లి!
జయహో కాళేశ్వరమా
తెలంగాణ సుస్వరమా
గోదావరి తాండవ లీల
ఎద పొంగె జలశయమా!

డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి, 8555899493

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9. కృష్ణాపురం. రోడ్‌నంబర్.10. బంజారాహిల్స్. హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

కాళేశ్వరం

దేవరుప్పల భీమయ్య

తెలంగాణకు వరప్రదాయిని

ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద పరిశ్రమ పెట్టి లక్ష కోట్ల పెట్టుబడితో లక్ష ఉద్యోగాలు కల్పించలేకపోతున్నాం. కానీ వ్యవసాయరంగంలో కాళేశ్వరం ప్రాజెక్టుతో 27 లక్షల ఎకరాలు సాగులోకి వస్తే దాదాపు 10 లక్షల మంది రైతులు స్వయం ఉపాధి సంపాదించగలరు. వారిమీద ఆధారపడే మరో 10 లక్షల మంది రైతు కూలీలకు జీవనోపాధి లభిస్తుంది. లక్ష కోట్ల పెట్టుబడి ఏవిధంగా చూసినా భారం కాదు.

గోదావరి నదీజలాలను తెలంగాణ బీడు భూములకు మళ్ళించే బృహత్తర సాగునీటి పథకం కాళేశ్వరం ప్రాజెక్టు. ఇది తెలంగాణకు వరప్రదాయిని, అక్షయ భాండం తప్ప గుదిబండ కానే కాదు.

ఇటీవల మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బరాజ్‌ల నిర్మాణం పూర్తికావడంతో సంబంధిత పంపుహౌజ్‌ల నుంచి నీటిని ఎత్తిపోసే మొదటి దశ పూర్తయ్యింది. కాబట్టి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు, ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్ సమక్షంలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరుపడం తెలంగాణ రైతాంగానికి పర్వదినం. కానీ ఈమధ్య కొందరు విమర్శకులు, విశ్లేషకులు తమతమ శైలిలో కొన్ని అభ్యంతరాలు సామాజిక మాధ్యమాల్లో, టీవీ ఛానళ్లలో వ్యక్తం చేశారు. ఆ అభ్యంతరాలను పరిశీలిస్తే..

1.విద్యుత్‌ఛార్జీలు తెలంగాణకు మోయలేని భారమా?: ప్రాజెక్టు డీపీఆర్ తయారీలో 2016లో వ్యవసాయం కోసం ప్రత్యేక విద్యుత్ టారిఫ్ తెలంగాణలో లేదు. 2001లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇరిగేషన్ కోసం రూ.400/హెచ్‌పీ/ఏడాదికి టారిఫ్ ఉండేది. అట్టి టారిఫ్‌ను కుట్రపూరితంగా ఎత్తిపోతల పథకాలను నిరుత్సాహపరిచే ఉద్దేశంతో 2001 లో రద్దుచేశారు. కాబట్టి 2016లో యూనిట్ రేటు రూ. 5.30 చొప్పున విద్యుత్ ఛార్జీలు డీపీఆర్‌లో పొందుపర్చబడినది.

ఎ) కేంద్ర జలవనరుల సంఘం 2010లో డీపీఆర్ తయారుచేయడానికి గైడ్ లైన్స్ విడుదల చేసింది. అట్టి మార్గదర్శకాల్లో ఎత్తిపోతల పథకానికి బెనిఫిట్ కాస్టు నిష్పత్తి లెక్కగట్టడానికి అనెక్సర్-18(బీ)లో నమూనా పొందుపర్చబడినది. మహారాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టు నమూనాలో విద్యుత్తు రేటు రూ.600/- హెచ్.పి./ సంవత్సరం లెక్కన బెనిఫిట్ కాస్టు నిష్పత్తి లెక్కగట్టబడింది.

బి)ఎక్కడా కూడా గైడ్ లైన్స్‌లో యూనిట్ రేటు ప్రస్తావన రాలేదు. రూ.5.30/ యూనిట్ విద్యుత్తు ఛార్జీలు వ్యాపార సంస్థలకు ఉంటుంది. కానీ వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్తుకు అట్టి రేటు వాడకూడదు. కాబట్టి యూనిట్ రేటు ప్రకారంగా ఎకరానికి అయ్యే విదుత్తు ఖర్చు పెద్దమొత్తంలో కనబడుతుంది. మహారాష్ట్ర ప్రభుత్వం అవలంబించిన రూ. 600/ హెచ్.పి./సంవత్సరం చొప్పున కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లో విద్యుత్తు ఖర్చులు కట్టవలసి ఉన్నది. మొత్తం 5 వేల మెగావాట్లను హార్స్ పవర్ (హెచ్.పి)లోకి మార్చినట్లయితే మొత్తం 66 లక్షల 66 వేలు హెచ్.పి.తో సమానం. పైన తెలిపిన రూ.600/ హెచ్.పి./ సంవత్సరం చొప్పున విద్యుత్తు ఖర్చు ఏడాది మొత్తానికి రూ.400 కోట్లు మాత్రమే. ఈ మొత్తాన్ని 27 లక్షల ఎకరాలకు (18 లక్షలు కొత్తది+ 9 లక్షలు పాతది) పంచినట్లయితే ఎకరానికి అయ్యే విద్యుత్ ఖర్చు రూ.1500 మాత్రమే ఎకరానికి పండే పంట ఉత్పత్తి విలువ సరాసరి రూ. 50,000 ఉంటుంది. ఆ విద్యుత్ ఖర్చు పంట ఉత్పత్తి విలువలో 3 శాతం మాత్రమే. తెలంగాణ ప్రభుత్వం 2001లో ఉన్న ఇరిగేషన్ టారిఫ్ రూ.400 /హెచ్.పి./ సంవత్సరం నుంచి 600కు /హెచ్.పి./ సంవత్సరం పెంచినట్లయితే మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన టారిఫ్‌తో కలిసి వస్తది.

సి) తెలంగాణ ఖజనా మీద భారం పడకుండా మరొక పద్ధతి అవలంబించినట్లయితే విద్యుత్ ఖర్చు తగ్గుతుంది. 2020 సంవత్సరం వరకు తెలంగాణలో దాదాపు 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి వస్తుంది. ప్రతి సంవత్సరం వానకాలంలో 30 శాతం నుంచి 35 శాతం విద్యుత్ డిమాండ్ తగ్గుతుంది. కాబట్టి థర్మల్ పవర్ స్టేషన్లు కొన్ని ఆపివేయబడతాయి. థర్మల్ స్టేషన్లను ఆపకుండా ఉత్పత్తి వానకాలంలో చేసినట్లయితే దానికి కావలసిన బొగ్గు ఖర్చు భరించవలసి వస్తది. మిగతా ఖర్చులు ఆపివేసినా, నడిపించినా ఉండేవే. 35 శాతం థర్మల్ స్టేషన్లను నడిపినట్లయితే 7 వేల మెగావాట్లు అందుబాటులోకి వస్తుంది. కానీ మనకు కావల్సింది 5 వేల మెగావాట్లు, వందరోజులు మాత్రమే నడుపవలసి ఉంటుంది. ఈ వంద రోజులకు అయ్యే బొగ్గు ఖర్చు రూ. 400 కోట్లు మాత్రమే. పైన తెలిపిన రూ.600/హెచ్.పి./ సంవత్సరం లెక్కన అయ్యే ఖర్చు మొత్తం రూ.400 కోట్లు.

కాబట్టి ఈ రెండు విధానాల ప్రకారం ఎకరానికి అయ్యే విద్యుత్ ఖర్చు రూ.1500 మాత్రమే. కానీ 40 వేలు ఎకరానికి ఖర్చు అనే దుష్ప్రచారం తప్పు. ఎకరానికి అయ్యే ఖర్చు రూ.1500 మాత్రమే. కాబట్టి ఈ విషయంలో ఏమైనా అనుమానాలుంటే ఎక్కడ చర్చించడానికైనా సిద్ధం.

2) కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం నిర్మాణ పెట్టుబడి ఖర్చు తెలంగాణకు మోయలేని భారమా?

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం లక్ష కోట్లకు పైబడి ఉంటుంది. ఇది తెలంగాణకు మేయలేని భారమా..!

ఎ) ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద పరిశ్రమ పెట్టి లక్ష కోట్ల పెట్టుబడితో లక్ష ఉద్యోగాలు కల్పించలేకపోతున్నాం. కానీ వ్యవసాయ రంగంలో కాళేశ్వరం ప్రాజెక్టుతో 27లక్షల ఎకరాలు సాగులోకి వస్తే దాదాపు 10లక్షల మంది రైతులు స్వయం ఉపాధి సంపాదించగలరు. వారిమీద ఆధారపడే మరో 10 లక్షల మంది రైతు కూలీలకు జీవనోపాధి లభిస్తుంది. లక్ష కోట్ల పెట్టుబడి ఏవిధంగా చూసినా భారం కాదు.

బి) 27 లక్షల ఎకరాలు పండించే నీటి కాల్వల వల్ల చుట్టుముట్టు ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి ఇదివరకు చాలీచాలనీ నీటి వలన సగం పంట చేతికివచ్చే పరిస్థితి ఉండదు. పరిసర ప్రాంతాల్లో మరో 5 లక్షల ఎకరాల దాకా బోరు బావుల వలన పూర్తి పంట పండించుకునే అవకాశం లభిస్తుంది. 27 లక్షల ఎకరాల సరాసరి పంట ఉత్పత్తి విలువ 50,000 లెక్కలోకి తీసుకున్నట్లయితే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల పండే పంట 13,500 కోట్లు, అదనంగా 5లక్షల ఎకరాలలో వచ్చే పంట విలువ మరో 1250 కోట్లు మొత్తం 15 వేల కోట్ల పంట ఉత్పత్తి అవుతుంది. 2వ పంటలో మరో 10 వేల కోట్లు పంట ఉత్పత్తి లెక్కలోకి తీసుకుంటే మొత్తం 25 వేల కోట్ల పంట ఉత్పత్తి సంవత్సరానికి వస్తుంది. ఈ ఉత్పత్తి రాష్ట్ర జీడీపీకి, దేశం జీడీపీకి దోహదపడుతుంది. కాబట్టి ప్రాజెక్టు వ్యయం భారం కాదు.

తెలంగాణ రైతాంగం పరిసరాల నుంచి కృష్ణా, గోదావరి నదులు ప్రవహిస్తుండగా దశాబ్దాల తరబడి సాగునీటికి నోచుకోలేదు. బోరు బావులు తవ్వి చాలీచాలని నీటితో, నాణ్యతలేని విద్యుత్ సరఫరాతో మోటార్లు కాలిపోయాయి. పంటలు సగం పండి, సగం ఎండి రైతులు అప్పుల పాలైనారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఒక పెద్ద అవసరం.

కాళేశ్వరం ప్రాజెక్టు కింద పండే పలురకాల పంటలను ఉపయోగించి వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధికి, పాడి, పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతాయి. దీనివల్ల వేల కోట్ల ఆదాయం తెలంగాణ ప్రభుత్వానికి అందుతుంది. గోదావరి రిజర్వాయర్ దాదాపు 120 కిలో మీటర్లు పొడవు ఉండటం వల్ల 19 ఇతర రిజర్వాయర్ల వల్ల మత్స్య పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుంది. పర్యాటకరంగం రవాణా రంగం అభివృద్ధి చెందుతుంది. తాగునీటి సౌకర్యం వల్ల పట్టణాలు విలసిల్లడం వలన నిర్మాణరంగం అభివృద్ధి చెందుతుంది. పైన తెలిపిన రంగాలలో దాదాపు లక్ష ఉద్యోగాలు రావడానికి అవకాశం ఉన్నది.

తెలంగాణ రైతాంగం పరిసరాల నుంచి కృష్ణా, గోదావరి నదులు ప్రవహిస్తుండగా దశాబ్దాల తరబడి సాగునీటికి నోచుకోలేదు. బోరు బావులు తవ్వి చాలీచాలని నీటితో, నాణ్యతలేని విద్యుత్ సరఫరాతో మోటార్లు కాలిపోయాయి. పంటలు సగం పండి, సగం ఎండి రైతులు అప్పుల పాలైనారు. వేల ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఒక పెద్ద అవసరం. ఇన్ని లాభాలు ఇచ్చే కాళేశ్వరం ప్రాజెక్టు ఏవిధంగా భారమవుతుందో విజ్ఞులు, విమర్శకులు, విశ్లేషకులు పునరాలోచించవలసిన ఆవశ్యకత ఉన్నది.

వినియోగదారుల హక్కులకు భరోసా

విశ్లేషణ

డాక్టర్ అనభేరి రాజేశ్వర్‌రావు

అమెరికా పార్లమెంటు 1890లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం చట్టాన్ని రూపొందించింది. కొనుగోలుదారుల ప్రయోజనాన్ని పరిరక్షించేందుకు 1914లో, 1938లో ఈ చట్టానికి అనేక సవరణలు చేసింది. అమెరికా సమాజంలో అక్షరాస్యత, చైతన్యం ఎక్కువ. వినియోగదారులు, వ్యాపారులు బాధ్యతలను, హక్కులను గుర్తెరిగి వ్యవహరించడం పరిపాటి. మన దేశంలో అక్షరాస్యత తక్కువ. అయినప్పటికీ ఐక్యరాజ్యసమితి 1985లో చేసిన సూచనల ప్రకారం వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చట్టాన్ని చేసింది. మోసపూరిత వ్యాపారాలు నిర్వహించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రపంచంలోని చట్టాలన్నింటికన్నా మెరుగ్గా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని 1986 నుంచి అమలుచేస్తున్నది. ఈ చట్టం ప్రజల చైతన్యాన్ని అనుగుణంగా అమలు జరుగుతున్నది.

మన దేశంలోని వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం- దళారుల ప్రమేయం లేకుండా, అతితక్కువ రుసుంతో, తక్కువకాలంలో (90 రోజుల్లో) న్యాయం పొందవచ్చు. జిల్లా, రాష్ట్ర. జాతీయ వినియోగదారుల ఫోరాలను ఆశ్రయించి వ్యక్తిగతంగా న్యాయం పొందే సౌలభ్యం మన ప్రభుత్వం కల్పించింది. నేరస్తులుగా నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై, సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవటం, అరెస్టులు చేయించి మూడేండ్ల వరకు కారాగార శిక్ష, 10 లక్షల నుంచి 50 లక్షల వరకు జరిమానా విధించే అధికారం సెంట్రల్ కన్‌జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీకి అనుబంధంగా ఉన్న ఇన్‌వెస్టింగ్‌కు కల్పించింది.

1986 వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టానికి ప్రభుత్వం ఇటీవల మరికొన్ని సవరణలు తెచ్చింది. దీని ప్రకారం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో- పేర్లను ఫోరం బదులు కమిషన్‌గా మార్చింది. జిల్లా కమిషన్‌లో ఫిర్యాదు చేసేందుకు పది లక్షల నుంచి కోటి రూపాయల వరకు, రాష్ట్ర కమిషన్‌లో రూ.కోటి నుంచి పది కోట్ల వరకు జాతీయ కమిషన్‌లో పది కోట్లకు పైబడి నష్టపరిహారం పొందే విధంగా పరిధిని పెంచింది. జిల్లా కమిషన్‌లో వినియోగదారుల, ప్రజల ప్రయోజనార్థం మధ్యవర్తిత్వం ద్వారా సత్వరం న్యాయం అందించేందుకు తొలుత ప్రయత్నించే వీలు కల్పించింది. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు, కేసులు పరిష్కరించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు నిష్ణాతులైన సేవాభావం గల ప్యానల్ సభ్యులను ఎంపిక చేయటం నిష్పక్షపాతంగా కేసుల పరిష్కారాన్ని దోహదపడటం విశేషం. దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా ఫిర్యాదును ఆన్‌లైన్‌లో స్వీకరించవచ్చు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాక్షులను విచారించవచ్చు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక వసతులు, ఏర్పాటుచేయటం, నూతన భవన నిర్మాణాలు చేపట్టడం వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాల్ని జిల్లా కమిషన్‌లో రాష్ట్ర కమిషన్‌లలో ఏర్పాటు చేయడం, మధ్యవర్తిత్వం కేంద్రాల నిర్వహణకు సమావేశ మందిరాలు నిర్మించటం జరుగుతున్నది.

అత్యాధునిక శాస్త్ర, సాంకేతిక, విజ్ఞానాభివృద్ధి వల్ల వ్యాపార స్వరూపం మారిపోయింది. ఈ నేపథ్యంలో నూతన వ్యాపారాభివృద్ధి ప్రక్రియలు, ఆర్థిక సంస్కరణల మూలంగా, ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఈ-కామర్స్, టెలీ షాపింగ్ వ్యాపారాలు విస్తరించటం జరుగుతున్నది. దేశవ్యాప్తంగా వినియోగదారులు తప్పుడు ప్రకటనలకు మోసపోవటం, సైబర్ నేరాలు సాధారణమైపోయాయి. వినియోగదారులు నూతన విధానాల్లో సైతం మోసానికి గురువుతున్నందు వల్ల ప్రభుత్వం వినియోగదారుల ప్రయోజనార్థం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంలో ఎన్నో మార్పులు చేసింది. 1400 పైగా ప్రముఖులు ఇచ్చిన సూచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సమీక్షించిన అనంతరం చట్టానికి తగు సవరణలతో పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టింది. 'వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2019'ను లోక్‌సభ జూలై 31న, రాజ్యసభ ఆగస్టు 6న ఆమోదించాయి. ఆగస్టు 9న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదంతో నూతన చట్టం అమలులోకి వచ్చింది.

నూతన చట్టంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నది. మోసపోయిన ప్రజలకు సత్వరం న్యాయం అందించడం, పరిహారం చెల్లించడం కోసం ఏర్పాట్లు చేసింది. వాస్తవ విరుద్ధమైన ఆకర్షణీయ ప్రకటనలతో వినయోగదారులను మోసగించే సంస్థలపై, ప్రచార, ప్రసార సాధనాల్లో ప్రకటనల్లో భాగస్వాములయ్యే సెలబ్రిటీలపై చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకున్నది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక సెంట్రల్ కన్‌జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ అనే వ్యవస్థను రూపొందించి వారికి విచక్షణాధికారాలు, విచారణాధికారాలు కల్పించింది. మోసపూరిత ప్రకటనలపై వ్యాపార సంస్థలపై, వ్యాపారులపై సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవటం కోసం సీసీపీఏను ఏర్పాటుచేసింది. వారు నేరుగా జిల్లా కలెక్టర్ల సహాయం తీసుకొని, విచారణలు నేరుగా చేపట్టి చర్యలు తీసుకోవచ్చు. సత్వర సదుపాయాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు సద్వినియోగం చేసుకొని యుద్ధ ప్రాతిపదికన స్పందించి వసతుల కల్పనకు దోహదపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఈ కొత్త చట్టం అమలుకు వీలుగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలను అందించబోతున్నది. ఈ మేరకు రాష్ట్రాలలో రాష్ట్ర, జిల్లా కమిషన్‌ల ఏర్పాటు జరుగాలె. సభ్యుల నియామక ప్రక్రియ కూడా చేపట్టవలసి ఉన్నది. కేంద్ర ప్రభుత్వ నిధులను ఉపయోగించుకొని మౌలిక ఏర్పాట్లు చేసుకోవలసి ఉంటుంది.

ఆన్‌లైన్ వ్యాపారాలు పెరుగుతున్న నేపథ్యంలో మోసాల

అభినందన్‌ను హింసించిన అహ్మద్‌ఖాన్ హతం

- 17న మట్టుబెట్టిన సైన్యం

అభినందన్‌ను చిత్రహింసలకు గురిచేసిన పాక్ సైనిక అధికారి అహ్మద్ ఖాన్

న్యూఢిల్లీ: భారత వాయుసేన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురిచేసిన పాక్ సైనికుడు, సుబేదార్ అహ్మద్‌ఖాన్‌ను భారత బలగాలు హతమార్చాయి. బాలాకోట్ దాడుల తర్వాత ఫిబ్రవరి 27న భారత్, పాక్ మధ్య జరిగిన గగనతల ఘర్షణలో మిగ్-21 బైసన్ విమానం నడిపిన అభినందన్ పాక్ ఎఫ్-16 యుద్ధవిమానాన్ని కూల్చేశారు. ఆ తర్వాత అభినందన్ విమానం కూడా కూలిపోగా, ఆయన అందులో నుంచి దూకినప్పుడు పాక్ సైన్యానికి చిక్కారు. అభినందన్‌ను బంధించిన అహ్మద్‌ఖాన్ ఆయనను బురదనీటిలో పడేసి కాలుతో తొక్కుతూ చిత్రహింసలకు గురిచేశాడు. ఆ తర్వాత అభినందన్‌ను పాక్ విడుదలచేసింది. కాగా, సరిహద్దులో చొరబాట్లకు అహ్మద్‌ఖాన్‌ను ప్రత్యేకంగా నియమించిన పాక్.. తద్వారా కశ్మీర్‌లో ఉగ్రవాదం సజీవంగా ఉంటుందని భావించింది. ఈ నేపథ్యంలో ఉగ్రవాదులు భారత్‌లోకి ప్రవేశించేలా చూడటమే అతడి పనిగా మారింది. ఈ క్రమంలో ఈ నెల 17న నక్యాల్ సెక్టార్ వద్ద నియంత్రణ రేఖ వెంట చొరబాటుదారులకు సహకారంగా పాక్ కాల్పులు జరిపింది. కాల్పుల సమయంలో భారత జవాన్ల దృష్టి తమపైనే ఉంటుందని, ఇదే అదునుగా చొరబాటుదారులు భారత్‌లోకి ప్రవేశించొచ్చని పాక్ సైనికులు భావించారు. కానీ భారత సైన్యం వారి ఎత్తులను చిత్తు చేసింది. ఏకంగా వారి సైనిక పోస్టును పేల్చేయడంతో అహ్మద్‌ఖాన్ హతమయ్యాడు.

సోషల్ మీడియా ఖాతాలకు ఆధార్ అనుసంధానం!

- కేంద్రానికి నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: సోషల్ మీడియా ఖాతాలకు ఆధార్ అనుసంధానంపై దాఖలైన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. మద్రాస్, బాంబే, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో పెండింగులో ఉన్న ఈ కేసును సుప్రీంకోర్టు పరిధిలోకి తీసుకురావాలని ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంతో పాటు యూట్యూబ్, ట్విట్టర్, గూగుల్ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 13లోపు స్పందన తెలియజేయాల్సిందిగా ఆదేశించింది. ఫేస్‌బుక్ ఖాతా తెరవాలంటే ఆధార్ తప్పనిసరి చేయాలంటూ గతంలో పలు కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆధార్ అనుసంధానిస్తే తప్పుడు ఖాతాల గుర్తింపు సులభమవుతుందని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. అయితే, సోషల్ మీడియా ఖాతాలకు ఆధార్ అనుసంధానాన్ని ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

ఢిల్లీలోని చిదంబరం ఇంటి ముందు సీబీఐ అధికారులు

ఏ క్షణంలోనైనా అరెస్టు?!

- ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో చిదంబరంకు బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు
- రెండు గంటల్లోగా విచారణకు హాజరు కావాలని సీబీఐ నోటీసులు
- అందుబాటులోలేని కాంగ్రెస్ సీనియర్ నేత

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం అరెస్టుకు రంగం సిద్ధమైంది. ఆయన కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టోరెట్ (ఈడీ) అధికారులు ఎదురుచూస్తున్నారు. చిదంబరానికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించడం.. ఢిల్లీ కోర్టు తీర్పును సవాలు చేసే పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్ దృష్టికి తీసుకెళ్లి.. అత్యవసర విచారణ చేపట్టాల్సిందిగా చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో.. ఆయన ఏ క్షణమైనా అరెస్టు కావొచ్చని తెలుస్తున్నది. దీనిలో భాగంగానే మంగళవారం సాయంత్రం ఆరుగురు సీబీఐ, ఈడీ అధికారులు ఢిల్లీలోని ఆయన ఇంటికి వెళ్లారు. అయితే, ఆ సమయంలో ఆయన ఇంట్లో లేకపోవడంతో వెనుదిరిగిన అధికారులు వెంటనే నోటీసులు జారీ చేశారు. రెండు గంటల్లోగా విచారణ అధికారి ముందు హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అంతకుముందు.. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో చిదంబరానికి ఢిల్లీ హైకోర్టు భారీ షాక్ ఇచ్చింది. ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. ఇలాంటి కేసుల్లో బెయిల్ మంజూరు చేస్తే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఐఎన్‌ఎక్స్ కేసును ఓ ప్రత్యేకమైన మనీ లాండరింగ్ (హవాలా) కేసుగా అభివర్ణించింది. సమర్థవంతమైన విచారణ జరుగడానికి నిర్బంధ విచారణ అవసరమని జస్టిస్ సునీల్ గౌర్ పేర్కొన్నారు. మూడు రోజుల పాటు అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలన్న విన్నపాన్ని కోర్టు తిరస్కరించింది. మంగళవారమే కేసును సుప్రీంకోర్టు అత్యవసర విచారణ చేపట్టే విధంగా చిదంబరం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగనున్నట్టు సమాచారం.

చంద్రుడి కక్ష్యలోకి

దిగ్విజయంగా చేరిన చంద్రయాన్-2

జాబిల్లికి మరింత చేరువైన వ్యోమనౌక వచ్చే నెల 7న చంద్రుడిపై దిగనున్న ల్యాండర్

బెంగళూరు, ఆగస్టు 20:

చంద్రయాన్-2 మిషన్‌లో మరో కీలక ఘట్టం దిగ్విజయంగా పూర్తయింది. చంద్రయాన్-2 వ్యోమనౌక మంగళవారం విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి చేరింది. 1,738 సెకన్ల పాటు కొనసాగిన ఈ ప్రక్రియ.. ముందుగా నిర్ణయించిన మేరకు మంగళవారం ఉదయం 9.02 గంటలకు పూర్తయిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఒక ప్రకటనలో వెల్లడించింది. దీని తర్వాత 100 కి.మీ.x100 కి.మీ. చంద్రుడి కక్ష్యలోకి వ్యోమనౌకను ప్రవేశపెట్టేందుకు వివిధ దశలను చేపట్టనున్నట్లు వివరించింది. ఆ తర్వాత ఆర్బిటార్ నుంచి ల్యాండర్ విడిపోయి, 100 కి.మీ.x 30 కి.మీ. కక్ష్యలోకి చేరనుందని తెలిపింది. అనంతరం సెప్టెంబర్ 7న చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ల్యాండర్‌ను సాఫ్ట్ ల్యాండింగ్ చేసేందుకు పలు కీలక దశలను చేపట్టనున్నట్లు వివరించింది. బెంగళూరు సమీపంలోని బైలులోని ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్(ఐడీఎస్ఎన్) యాంటెన్నాల సాయంతో ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఐఎస్‌టీఆర్‌ఎన్‌సీ)లోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్(ఎంవోఎక్స్) నుంచి వ్యోమనౌక గమనాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. తదుపరి చంద్రుడి కక్ష్య మార్పు ప్రక్రియను బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల మధ్యలో చేపట్టనున్నట్లు పేర్కొంది. నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి గత నెల 22న జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్ ద్వారా చంద్రయాన్-2ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ నెల 14న వ్యోమనౌక లూనార్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి చేరింది. చంద్రయాన్-2లో ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ ఉంటాయి. ఆర్బిటార్ ఏడాది కాలం పాటు పనిచేయనుంది. ల్యాండర్ (విక్రమ్), రోవర్ (ప్రజ్ఞాన్) 14 రోజుల పాటు పనిచేయనున్నాయి.

ఆ 15 నిమిషాలు..

1. ల్యాండింగ్‌కు నాలుగు రోజుల ముందు ఆర్బిటార్ నుంచి విక్రమ్ విడిపోనుంది. అనంతరం గంటకు 6,120 కి.మీ వేగంతో 30కి.మీ.x100కి.మీ కక్ష్యలోకి చేరనుంది.
2. పది నిమిషాల ముప్పై సెకండ్ల అనంతరం, విక్రమ్ చంద్రుడికి 7.4 కి.మీ ఎత్తులోకి చేరనుంది. ఈ సమయంలో దాని వేగం గంటకు 526 కి.మీ.కు తగ్గుతుంది.
3. ఆ తర్వాతి 38 సెకండ్లలో విక్రమ్ వేగం గంటకు 331.2కు తగ్గి, చంద్రుడి ఉపరితలానికి 5 కి.మీ. సమీపానికి విక్రమ్ చేరనుంది.
4. తదుపరి 89 సెకండ్లకు విక్రమ్ చంద్రుడికి 400 మీ. సమీపానికి చేరనుంది.
5. 400 మీ. ఎత్తులో 12 సెకండ్లపాటు ఇది చక్కర్లు కొడుతూ, చంద్రుడి ఉపరితల సమాచారం సేకరిస్తుంది.
6. ఆ తదుపరి 66 సెకండ్లలో చంద్రుడికి 100 మీటర్ల సమీపానికి చేరి 25 సెకండ్ల పాటు చక్కర్లు కొట్టనుంది. ఈ సమయంలో అక్కడే ల్యాండ్ అవ్వాలా లేదా ప్రత్నామ్నాయ ప్రాంతంలో దిగాలా అన్నది ల్యాండర్ నిర్ణయిస్తుంది.
7. 10 మీ. ఎత్తుకు చేరిన తర్వాత చంద్రుడి ఉపరితలంపై దిగేందుకు ల్యాండర్ 13 సెకండ్ల సమయం తీసుకోనుంది. ఈ సమయంలో దానిలోని 5 ఇంజిన్లు మండుతాయి.
8. ఉపరితలానికి విక్రమ్ కాళ్లు తాకగానే, అందులోని సెన్సార్లు ఇంజిన్లు ఆఫ్ అయ్యేలా చేస్తాయి.
9. ల్యాండ్ అయిన 15 నిమిషాలకు మొదటి ఫొటోను పంపనుంది.
10. ల్యాండ్ అయిన 4 గంటల తర్వాత విక్రమ్ నుంచి ప్రజ్ఞాన్ బయటకు వచ్చి చంద్రుడి ఉపరితలంపై సంచరిస్తుంది.

ఆర్బిటార్ నుంచి ల్యాండర్ విడిపోయే క్రమాన్ని మీడియా సమావేశంలో వివరిస్తున్న ఇస్రో చైర్మన్ కే శివన్

గుండె దాదాపు ఆగిపోయింది: ఇస్రో చైర్మన్ శివన్

చంద్రయాన్-2 వ్యోమనౌకను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టే ప్రక్రియను చేపట్టే క్రమంలో తమ గుండె దాదాపు ఆగిపోయిందని ఇస్రో చైర్మన్ కె శివన్ అన్నారు. ఈ క్రతువును చేపట్టే సమయంలో తాము అనుభవించిన టెన్షన్‌ను ఆయన మీడియా సమావేశంలో వివరించారు. 'చంద్రుడి కక్ష్యలోకి వ్యోమనౌకను ప్రవేశపెట్టేందుకు చంద్రయాన్-2లోని ద్రవ ఇంధనాన్ని మండించినప్పుడు మా గుండె వేగం భారీగా పెరిగింది. దాదాపు 30 నిమిషాల పాటు గుండె ఆగినట్లయింది' అని శివన్ వివరించారు. సెప్టెంబర్ 7న వేకువజామున 1.55 గంటలకు చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్‌ను సాఫ్ట్ ల్యాండింగ్ చేసే ప్రక్రియ అత్యంత ఉత్కంఠతో కూడుకున్నదని చెప్పారు. ఈ ప్రక్రియను ఇస్రో ఇప్పటివరకు చేపట్టలేదు. వ్యోమనౌకను చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టే ప్రక్రియను మాత్రం చంద్రయాన్-1 మిషన్ సమయంలో ఇస్రో చేపట్టింది. 'ప్రస్తుతం మా టెన్షన్ పెరిగింది కానీ తగ్గలేదు' అని శివన్ పేర్కొన్నారు. అయితే సాఫ్ట్ ల్యాండింగ్‌పై ఇస్రో విశ్వాసంతో ఉంది.

పార్లమెంట్‌లో ప్లాస్టిక్‌పై నిషేధం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: పార్లమెంట్ కాంప్లెక్స్ పరిధిలో తిరిగి వాడకానికి పనికిరాని ప్లాస్టిక్ నీటి బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ పదార్థాలపై నిషేధం విధిస్తూ లోక్‌సభ సచివాలయం నిర్ణయం తీసుకున్నది. సచివాలయం అధికారులు, సిబ్బంది ఈ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే సిబ్బంది పర్యావరణ అనుకూల జీవశైధిల్య సంచులు, ఇతర సామగ్రిని వాడాలని సూచించింది. దేశాన్ని ప్లాస్టిక్ రహితంగా చేయాలన్న ప్రధాని పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఈ-టూరిస్టు వీసా ఫీజులను సవరించిన భారత్!

సీజన్‌ను బట్టి రుసుము వసూలు

న్యూఢిల్లీ: పర్యాటకుల రద్దీ, సీజను సమయాన్ని బట్టి ఈ-టూరిస్టు వీసా ఫీజులను సవరిస్తున్నట్టు మంగళవారం కేంద్రం ప్రకటించింది. పర్యాటకులు అత్యధికంగా విచ్చేసే జూలై-మార్చి సీజన్‌లో ఎక్కువ మొత్తాన్ని, ఏప్రిల్-జూన్‌లో తక్కువ ఫీజు వసూలు చేయనున్నట్టు కేంద్ర సాంస్కృతిక, టూరిజం వ్యవహారాల సహాయ మంత్రి ప్రహ్లాద్ పటేల్ పేర్కొన్నారు. 30 రోజుల నుంచి 5 ఏండ్ల పాటు చెల్లుబాటు అయ్యే ఈ-వీసాకు కనిష్టంగా 10 అమెరికన్ డాలర్లు, గరిష్టంగా 80 డాలర్లను విదేశీ పర్యాటకులు చెల్లించాలన్నారు. 30 రోజులు చెల్లుబాటు అయ్యే ఈ-వీసా రుసుమును 10 డాలర్లు(తక్కువ రద్దీ సమయం), 25 డాలర్లు(ఎక్కువ రద్దీ సమయం)గా నిర్ణయించారు. ఇండియా-పసిఫిక్ ఐలాండ్స్ కోఆపరేషన్ (ఎఫ్ఐపీఐసీ)లోని 14 దేశాలకు మాత్రం ఈ-వీసా ఫీజును వసూలు చేయబోమని తెలిపారు.

యమున ఉగ్రరూపం

ఢిల్లీకి పొంచి ఉన్న ముప్పు

- పరిస్థితి అదుపులోనే ఉందన్న సీఎం కేజ్రీవాల్
- ఉత్తరాది రాష్ట్రాల్లో ఇప్పటివరకు 58 మంది మృతి
- హిమాచల్‌లో చిక్కుకున్న కేరళ హీరోయిన్.. రక్షించిన సిబ్బంది

ఢిల్లీలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న యమునా నది

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ఉత్తరాదిన కురుస్తున్న భారీ వర్షాలతో యమునా నది ఉగ్రరూపం దాల్చింది. ఢిల్లీలో ప్రమాదకర స్థాయిని దాటి ఉద్ధృతంగా ప్రవహిస్తున్నది. హర్యానాలో మంగళవారం హతినికుండ్ బ్యారేజీ నుంచి 25,590 క్యూసెక్కుల నీటిని కిందకు వదలడంతో ఈ ప్రవాహం మరింత పెరిగే ప్రమాదం ఉన్నది. అయితే ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉన్నదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వ అధికారి వివరాల ప్రకారం.. యమునా నది సోమవారం ప్రమాదకర స్థాయి 205.33 మీటర్లను దాటిందని, ప్రస్తుతం 206.25 మీటర్ల వద్ద ప్రవహిస్తున్నదని తెలిపారు. యమునా బ్రిడ్జిపై రైలు ప్రయాణ వేగంపై ఉత్తర రైల్వే పరిమితి విధించింది. వేగాన్ని గంటకు 20 కి.మీ.కు తగ్గించింది. ఒకవేళ నది ప్రవాహం 206.40 మీటర్లు దాటితే, రైలు రాకపోకలు నిలిపివేయనున్నట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. వచ్చే నాలుగైదు రోజుల్లో ఉత్తరాఖండ్, హిమాచల్‌లో వర్షాలు తగ్గుముఖం పడుతాయని, దీంతో ఢిల్లీలో పరిస్థితి మెరుగుపడనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సీనియర్ శాస్త్రవేత్త కుల్‌దీప్ శ్రీవాస్తవ తెలిపారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. యమునా నది వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆక్రమణలపై ప్రశ్నించగా.. దానిపై పరిశీలిస్తామని చెప్పారు. ఢిల్లీలోని ఆరు జిల్లాల గుండా యమునా నది ప్రవహిస్తున్నది. ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వం 30 పడవలను సిద్ధంగా ఉంచింది. లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 10 వేల మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

ఐదు రాష్ట్రాల్లో 58 మంది మృతి

ఉత్తరాదిలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇప్పటివరకు ఐదు రాష్ట్రాల్లో 58 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హిమాచల్, ఉత్తరాఖండ్, పంజాబ్‌లో కొండచరియలు విరిగిపడడంతో ఆయా ప్రాంతాల్లో పర్యాటకులు, ప్రజలు చిక్కుకుపోయారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పంజాబ్‌లో సంభవించిన వరదలను ప్రకృతి విపత్తుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. వరద ప్రభావిత జిల్లాలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది.

వరదల్లో చిక్కుకున్న చిత్రబృందాన్ని రక్షించిన సిబ్బంది

మంజూ వారియర్

భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ గ్రామంలో మలయాళ హీరోయిన్ మంజూ వారియర్‌తోపాటు 30 మంది చిత్ర బృంద సభ్యులు చిక్కుకుపోగా, వారిని సురక్షితంగా రక్షించినట్లు ఆ రాష్ట్ర సీఎం జైరాం ఠాకూర్ తెలిపారు. దర్శకుడు సనల్ కుమార్ శశిధరన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ నిమిత్తం మనాలికి 80 కి.మీ. దూరంలోని ఛత్రాకు చిత్ర బృందం వెళ్లింది. అయితే వర్షాలు, వరదల నేపథ్యంలో అక్కడే చిక్కుకుపోయారు. హీరోయిన్ వారియర్ సోమవారం రాత్రి శాటిలైట్ ఫోన్ ద్వారా తన కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రెండు రోజులకు సరిపడ మాత్రమే ఆహారం ఉందని, సమాచార సదుపాయాలేవీ అక్కడ లేవని ఆమె పేర్కొంది. దీంతో వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కుటుంబ సభ్యులు రాష్ట్ర అధికారులను అభ్యర్థించారు. చిత్ర బృందంతో పాటు దాదాపు 200 మంది ఆ ప్రాంతంలో చిక్కుకుపోయారని ఆయన తెలిపారు. వారిని సురక్షితంగా తీసుకురావాలని కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి మురళీధరన్‌కు విజ్ఞప్తి చేయగా, ఆయన హిమాచల్ సీఎంతో మాట్లాడినట్లు చెప్పారు.

క్షీణిస్తున్న ఎల్‌నినో

ఎల్‌నినో క్షీణిత కొనసాగుతున్నది. క్రమంగా న్యూట్రల్ స్థితికి వస్తున్నది. ప్రైవేట్ వాతావరణ అధ్యయన సంస్థ స్కైమెట్ వివరాల ప్రకారం.. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వరుసగా మూడోవారం కూడా తగ్గుదల నమోదైంది. ఎల్‌నినో తటస్థ స్థితికి చేరుతున్న నేపథ్యంలోనే ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షపాతం పెరుగుతున్నదని తెలిపింది. ఈ నేపథ్యంలో కురిసిన భారీవర్షాలు, వరదల కారణంగా కేరళలో 121 మంది, కర్ణాటకలో 76 మంది మృతిచెందారు.

కశ్మీర్ అంశం భారత్ అంతర్గతం

- రాజ్‌నాథ్‌తో ఫోన్ చర్చల్లో అమెరికా రక్షణమంత్రి ఈస్పర్



న్యూఢిల్లీ, ఆగస్టు 20: జమ్ముకశ్మీర్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు భారతదేశ అంతర్గత అంశాలని అమెరికా రక్షణశాఖ మంత్రి మార్క్ టీ ఈస్పర్ పేర్కొన్నారు. గురువారం రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఫోన్‌లో మార్క్ టీ ఈస్పర్ మాట్లాడుతూ.. కశ్మీర్ అంశం భారత్, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షికంగా పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్ సరిహద్దుల్లో సీమాంతర ఉగ్రవాదం కొనసాగుతున్నదని ఈస్పర్‌తో రాజ్‌నాథ్ చెప్పారు. దక్షిణాసియా ప్రాంతంలో శాంతి, సుస్థిరతల కొనసాగింపునకు భారత్ తీసుకున్న చర్యలను అమెరికా ప్రశంసించిందని, అవసరమైన మద్దతు ఉంటుందని తెలిపిందని రక్షణశాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

బాలాకోట్‌పై దాడి ఐఏఎఫ్ శక్తిని తెలిపింది: రక్షణమంత్రి రాజ్‌నాథ్

పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో గల ఉగ్రవాద శిబిరాలపై దాడితో భారత సైన్యం శక్తి సామర్థ్యాలు బయటపడ్డాయని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఐఏఎఫ్ నిర్వహించిన ఒక సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. 'పొరుగుదేశంలోని ఉగ్రవాద శిబిరాలపై దాడితో భారత రక్షణ బలగాల శక్తి సామర్థ్యాలు బయటపడ్డాయి' అని అన్నారు.

ఆజాద్‌ను మళ్లీ అడ్డుకున్న అధికారులు

రాజ్యసభలో కాంగ్రెస్ పక్షనాయకుడు గులాం నబీ ఆజాద్‌ను జమ్ముకశ్మీర్‌లో అడుగుపెట్టనివ్వకుండా మళ్లీ వెనక్కి పంపారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో ఈనెల 8న శ్రీనగర్ విమానాశ్రయానికి వచ్చిన ఆయనను అధికారులు ఢిల్లీకి తిరిగి పంపారు. మళ్లీ మంగళవారం జమ్ము విమానాశ్రయానికి వచ్చిన ఆజాద్‌ను తిరిగి ఢిల్లీకి పంపారు. జమ్ముకశ్మీర్‌లోని తన ఇంటికి వెళ్లడానికి, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సమావేశానికి హాజరుకావడానికి ఆజాద్‌ను అనుమతించలేదని కాంగ్రెస్ నాయకుడొకరు చెప్పారు. మరోవైపు కశ్మీర్ లోయలో మొబైల్, ఇంటర్నెట్ సర్వీసులపై ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి.

కశ్మీర్‌పై ప్రపంచ కోర్టుకు పాక్

పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఖురేషి వెల్లడి

ఇస్లామాబాద్, ఆగస్టు 20: జమ్ముకశ్మీర్ విషయంలో అంతర్జాతీయ న్యాయస్థానాన్ని (ఐసీజే) ఆశ్రయించాలని పాకిస్థాన్ నిర్ణయించింది. ఆర్టికల్ 370ను భారత ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో పాక్ తొలుత ఐక్యరాజ్యసమితి (ఐరాస)ని ఆశ్రయించింది. కశ్మీర్‌పై ఐరాస భద్రతా మండలి సమావేశంలో పాక్‌కు చైనా ఒక్కటే మద్దతుగా నిలిచింది. దీంతో చివరికి పరువును దక్కించుకోవడానికి ఐసీజే గడపతొక్కాలని పాక్ నిర్ణయించింది. మంగళవారం పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఖురేషి విలేకరులతో మాట్లాడుతూ కశ్మీర్ విషయాన్ని ఐసీజే దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు.

జకీర్ బహిరంగసభలపై మలేషియా నిషేధం!

క్షమాపణలు కోరిన వివాదాస్పద మత ప్రచారకుడు

కౌలాలంపూర్: వివాదాస్పద మత ప్రచారకుడు జకీర్ నాయక్ బహిరంగ సభలపై నిషేధం విధిస్తూ మలేషియా ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. జాతీయ భద్రత నేపథ్యంలో ఈ నిషేధం విధించినట్టు అక్కడి అధికారులు తెలిపారు. అయితే, తన వ్యాఖ్యలకు జకీర్ నాయక్ క్షమాపణలు కోరారు. తాను ఎవరినీ కించపరుచాలని ఆ వ్యాఖ్యలు చేయలేదని.. కావాలనే కొందరు తనపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మలేషియాలోని హిందువులు భారత ప్రధాని మోదీకి ఎక్కువ విధేయతతో ఉంటారని, చైనీయులు పురాతన అతిథులని ఈ నెల 8న జకీర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ అంశంపై మలేషియా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జకీర్ వివక్షాపూరిత వ్యాఖ్యలను చేసినట్టు దర్యాప్తులో తేలడంతో ఆయన సభలపై నిషేధం విధించారు. కాగా భారత్‌లో జకీర్‌పై హవాలా చట్టం కింద కేసు నమోదు కావడంతో ఆయన మలేషియాకెళ్లి అక్కడ శాశ్వత నివాస అర్హతను పొందారు.

ఎయిమ్స్‌కు గడ్కరీ, జవదేకర్

జైట్లీ ఆరోగ్యంపై ఆరా

న్యూఢిల్లీ: తీవ్ర అనారోగ్యంతో ఎయిమ్స్‌లో చికిత్సపొందుతున్న కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ ఆరోగ్య పరిస్థితి గురించి పలువురు కేంద్ర మంత్రులు వాకబు చేశారు. జైట్లీ ఆరోగ్యం విషమించడంతో ఆయనను ప్రాణాధార వ్యవస్థపై ఉంచి ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, ప్రకాశ్ జవదేకర్ మంగళవారం దవాఖానకు వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను ఆరా తీశారు. శ్వాస సంబంధ ఇబ్బంది రావడంతో జైట్లీ ఈ నెల 9న ఎయిమ్స్‌లో చేరారు.

చోటా రాజన్‌కు ఎనిమిదేండ్ల జైలు

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబై నగర శివారుల్లోని అంధేరీలో 2012 అక్టోబర్‌లో ఒక హోటల్ యజమాని బీఆర్ శెట్టిపై హత్యాయత్నం కేసులో గ్యాంగ్‌స్టర్ చోటా రాజన్, మరో ఐదుగురికి ఎనిమిదేండ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. వీరిపై మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం (మోకా)తోపాటు ఐపీసీలోని 307, 120 (బీ) సెక్షన్ల కింద ముంబై ప్రత్యేక కోర్టు జడ్జి ఏటీ వాంఖడే శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఒక్కొక్కరిపై రూ.5 లక్షల జరిమానా విధించారు. గతేడాది మేలో ముంబై కేంద్రంగా పనిచేసిన జర్నలిస్ట్ జే దేవ్ హత్య కేసులో రాజన్‌కు ఇదే కోర్టు యావజ్జీవ ఖైదు విధించింది. 2012 అక్టోబర్ మూడో తేదీన స్నేహితుడ్ని కలుసుకునేందుకు వెళుతుండగా బీఆర్ శెట్టిపై మోటారుసైకిల్‌పై వచ్చిన దిలీప్ ఉపాధ్యాయ్, తల్వీందర్ సింగ్ కాల్పులు జరిపి పారిపోయారు.

గడ్కరీ స్పీడుకు బ్రేకులు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9 రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.
Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.
స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE

సరోజినీదేవికి పాస్‌బుక్ ఇస్తాం

'హైకోర్టు తీర్పిస్తే నాకేంటి' కథనానికి స్పందించిన భువనగిరి ఆర్డీవో వెంకటేశ్వర్లు

రత్నశ్రీవాణి ఎకరం భూమి కూడా భూదాన్‌భూమే

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: దివంగత సినీనటి ప్రత్యూష తల్లి పాదరాజు సరోజినీదేవికి చెందాల్సిన బొమ్మాయిపల్లిలోని సర్వేనంబర్ 10/ఆ/ 2 భూమి విషయంలో హైకోర్టు ఉత్తర్వులను తూచ తప్పకుండా అమలుచేస్తామని భువనగిరి ఆర్డీవో గార్లపాటి వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ' ధర్మగంటలో 'హైకోర్టు తీర్పిస్తే నాకేంటి' శీర్షికన వచ్చిన కథనానికి భువనగిరి ఆర్డీవో వెంకటేశ్వర్లు స్పందించారు. హైకోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని సరోజినీదేవి భూమి విషయంలో అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. భువనగిరి తాసిల్దార్ వ్యవహరించిన తీరుపై ఆరోపణలు వచ్చినందున వాటిపైనా విచారణ చేస్తామని హామీఇచ్చారు. హైకోర్టు తీర్పుఇచ్చినా పాస్‌బుక్ పెండింగ్‌లో పెట్టిన తీరుపై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కావడంతో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ విచారణకు ఆదేశించారు. భువనగిరి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. ఆర్డీవో వెంకటేశ్వర్లు భూమికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. సర్వే నంబర్ 10/ఆ/ 2 భూమి విషయంలో పాస్‌పుస్తకాన్ని భువనగిరి తాసిల్దార్ ఎందుకు పెండింగ్‌లో పెట్టారన్న విషయంపై సమగ్రంగా విచారణ జరుపుతామని 'నమస్తే తెలంగాణ' జిల్లా ప్రతినిధితో చెప్పారు. రైతులను ఎవరు ఇబ్బంది పెట్టాలని చూసినా సహించేదిలేదని హెచ్చరించారు. మొదటగా సరోజినీదేవికి అనుకూలంగా డిక్రీ జారీచేసి పాస్‌పుస్తకం జారీచేస్తామని చెప్పారు. సివిల్ కోర్టుల్లో కేసులుంటే వారిరువురు చూసుకుంటారని, తాము మొదటగా హైకోర్టు ఉత్తర్వులు అమలుచేస్తామని చెప్పారు. పాస్‌బుక్‌ను సరోజినీదేవికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కలెక్టర్‌కు ఈ భూమి వివాద, ఇతర వివరాలను తెలియజేశామని పేర్కొన్నారు.

రత్నశ్రీవాణి ఎకరం భూమి కూడా భూదాన్‌భూమే

సీసీఎల్ వెబ్‌సైట్‌లో సర్వేనంబర్ 10లోని పెండింగ్, క్లియర్ ఖాతాలను పరిశీలిస్తే రత్నశ్రీవాణికి చెందిన 10/ఆ/1లోని ఎకరం భూమిని భూదాన్‌భూమిగా గుర్తించిన రెవెన్యూ అధికారులు దానిని పెండింగ్‌లో పెట్టారు. సీసీఎల్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారం రత్నశ్రీవాణికి చెందిన భూమి భూదాన్‌భూమిగా నిర్ధారణచేశారు.

లోకాయుక్త చెప్పినా పట్టదా!

- సమాచారం ఇవ్వకుండానే వారసత్వ భూమి రికార్డు మార్పు
- కాస్తులో ఉన్నా బాధితుడి పేరిట రికార్డులో ఎక్కని 8.04 ఎకరాలు
- రైతు భూపోరాటంపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన గద్వాల జిల్లావాసి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం భీంపురం గ్రామానికి చెందిన నర్సన్నకు చింతరేవుల శివారులోని సర్వే నంబర్ 363/ఖ లో 4.06 ఎకరాల భూమి తండ్రి నుంచి వారసత్వంగా సంక్రమించింది. నర్సన్న సర్వే నంబర్ 368/ఘ లోని 3.38 ఎకరాలను మాసమ్మ వద్ద కొని.. మొత్తం 8.04 ఎకరాలను సాగుచేసుకొన్నారు. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఈ భూమి నర్సన్న పేరిట లేకుండాపోయింది. 1995 వరకు నర్సన్న పేరిట ఉన్న భూరికార్డులు.. ఆ తర్వాత ఇతరుల పేరిట మారాయి. కొందరు వారసులమంటూ భూరికార్డులను తమ పేరిట మార్చేసుకొన్నారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా ఎలాంటి ఆధారాలు లేకుండా, విచారణ చేపట్టకుండా, పత్రాలను పరిశీలించకుండానే రికార్డులో పేరు మార్చారు. నర్సన్న పెద్దగా చదువుకోకపోవడంతో ఈ విషయాన్ని గుర్తించలేకపోయారు. నిజానికి ఆ భూమిలో ఇప్పటికీ నర్సన్న కుటుంబమే కాస్తులో ఉన్నది. కానీ రికార్డులో పేరు మాత్రం లేదు. ఈ సమస్య పరిష్కారం కోసం నర్సన్న కుమారుడు వెంకటయ్య 2005 నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. బాధితుడు సమాచార హక్కు చట్టం కింద ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి అధికారులకు అందజేశారు. ఆ భూమి నర్సన్న కుటుంబానికే చెందుతుందని అధికారులు గుర్తించారు.. కానీ రికార్డులో మాత్రం పేర్లు మార్చడంలేదు. ఇదే విషయమై చివరగా 2016లో లోకాయుక్తకు ఫిర్యాదు చేయగా, ఆరు నెలల్లో బాధితుడికి న్యాయంచేయాలని గద్వాల్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సూచించింది. ఇంతలో అప్పటి జేసీ బదిలీ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన జేసీ పట్టించుకోవడం లేదు. భూరికార్డుల ప్రక్షాళనలో సైతం బాధితుడు ఇదే విషయం చెప్పగా, ఎవరికీ పట్టాచేయకుండా నిలుపుదలచేశారు. కాస్తులో ఉండి కూడా రికార్డులో పేరు లేక రైతుబంధు అందడంలేదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఏండ్ల నుంచి తిరుగుతున్నా..

నేను ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిని. మా నాన్న నర్సన్న 2004లో చనిపోయారు. దాదాపు పదిహేనేండ్ల నుంచి నేను మా భూమి సమస్యపై పోరాటంచేస్తున్నాను. చదువుకొన్న వారికే రెవెన్యూ అధికారులు ఇన్ని తిప్పలు పెడుతుంటే, ఇక అమాయకుల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాసిల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. ఎక్కడా న్యాయం జరుగడంలేదు. లోకాయుక్త చెప్పినా అధికారులు వినడం లేదు. తాసిల్దార్ సూచనతో జేసీ కోర్టుకు వెళ్లాను. అయినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా జేసీ కోర్టులో ఆర్వోఆర్ అప్పీల్‌ను పూర్తి చేసి, భూమి మాకు దక్కేలా చూడాలని కోరుతున్నాను.

- వెంకటయ్య, బాధితుడు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ పరిష్కార వేదికలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ స్వర్ణలత

రైతుచెంతకే రెవెన్యూ సిబ్బంది

- రెండోరోజు విజయవంతంగా భూపరిష్కార వేదిక
- పాల్గొన్న జాయింట్ కలెక్టర్ స్వర్ణలత, జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి

భూపాలపల్లి టౌన్ (జయశంకర్ భూపాలపల్లి): భూ పరిష్కార వేదిక- రైతుల చెంతకే రెవెన్యూ సిబ్బంది' కార్యక్రమం రెండోరోజు మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విజయవంతంగా కొనసాగింది. రైతులు ఎదుర్కొంటున్న వివిధ భూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు 'భూ పరిష్కార వేదిక-రైతుల చెంతకే రెవెన్యూ సిబ్బంది' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంప్యూటర్ ఆపరేటర్ మొదలుకొని తాసిల్దార్ వరకు పలువురు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మొదటి విడుతగా జిల్లా వ్యాప్తంగా 2,700 సమస్యలు పరిష్కరించారు. రెండో విడుత ప్రారంభమైన మొదటిరోజే 250 సమస్యలకు పరిష్కారం చూపారు. మంగళవారం జిల్లాలోని భూపాలపల్లి మండలం నందిగామ, చిట్యాల మండలం చైన్‌పాక, గణపురం మండలం బుర్రకాయలగూడెం, కాటారం మండలం ఒడిపిలవంచ, మహదేవ్‌పూర్ మండలం బ్రాహ్మణ్‌పల్లి, మహాముత్తారం మండలం జీలపల్లి, మల్హార్ మండలం చిన్నతూండ్ల, మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లి, పలిమెల మండలం నీలంపల్లి, రేగొండ మండలం రామన్నగూడెం, టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామాల్లో వేదిక ఏర్పాటుచేశారు. కాటారం మండలం ఒడిపిలవంచ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి హాజరయి రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు, 1 బీ ప్రతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు. మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ స్వర్ణలత హాజరై పలువురు రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు, 1 బీ పత్రాలను అందజేశారు. మల్హార్ మండలం చిన్నతూండ్లలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో వెంకటాచారి పాల్గొన్నారు.

రాజుబాయికి పట్టామార్పిడి ప్రొసీడింగ్

- మహిళా రైతుకు కాపీని అందజేసిన తాసిల్దార్
- వీఆర్వో భూమన్నపై కలెక్టర్‌కు నివేదిక
- ధర్మగంట కథనానికి స్పందన

నందిపేట రూరల్: పదివేల రూపాయల లంచమిచ్చినా పట్టామార్పిడి కాలేదు. కానీ, మహిళా రైతు తాసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోను నిలదీసిన గంటల వ్యవధిలోనే పట్టామార్పిడి ప్రొసీడింగ్స్ చేతికొచ్చాయి. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం షాపూర్ గ్రామానికి చెందిన కొమిరె రాజుబాయి భర్త నచ్చన్న 2009లో మృతిచెందడంతో ఆయన పేరుమీద ఉన్న ఎకరం 24 గుంటల భూమిని తమపేరు మీదకు మార్పిడిచేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకొన్నారు. ఏండ్లు గడుస్తున్నా పట్టా మార్పిడి కాకపోవడంతో స్థానిక వీఆర్వో భూమన్నను సంప్రదించగా.. ఆయన రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచమిచ్చినప్పటికీ పనికాకపోవడంతో సోమవారం ఆమె నందిపేట తాసిల్ కార్యాలయంలో వీఆర్వో భూమన్నను నిలదీశారు. అనంతరం రాజుబాయి 'ధర్మగంట'ను సంప్రదించి తమ గోడు వెల్లబోసుకొన్నారు. 'పైసలిచ్చినా పనిచేయవా?' పేరిట నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమయింది. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. తాసిల్దార్ అలివేలు మంగళవారం మహిళా రైతు రాజుబాయిని కార్యాలయానికి పిలిపించుకున్నారు. ఆమె భర్త నచ్చన్న పేరు మీదఉన్న ఎకరం 24 గుంటల భూమి పట్టామార్పిడి చేసి ఆర్డీవో ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ధర్మగంటలో కథనం ప్రచురితమైన గంటల వ్యవధిలోనే తనకు పట్టామార్పిడి జరిగిందని మహిళా రైతు ఆనందం వ్యక్తంచేశారు. రాజుబాయి నుంచి రూ.10 వేలు లంచం తీసుకున్నాడనే ఆరోపణల నేపథ్యంలో వీఆర్వో భూమన్నపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్టు తాసిల్దార్ అలివేలు తెలిపారు.

మంగళ వారం రైతు రాజుబాయికి ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న నందిపేట తాసిల్దార్ అలివేలు

మట్టిలో సగం పూడ్చుకొని..

వారసత్వ భూమిని ఇతరులకు పట్టా చేశారని రైతు నిరసన దీక్ష

- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో ఘటన
- జేసీ హామీతో దీక్ష విరమణ

మరిపెడ, నమస్తే తెలంగాణ:

తన వ్యవసాయ భూమిని డోర్నకల్ రెవెన్యూ అధికారులు డబ్బుకు కక్కుర్తిపడి ఇతరులకు పట్టాచేశారని ఆరోపిస్తూ మహబూబాబాద్ జిల్లా రైతు, జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్‌రెడ్డి మంగళవారం వ్యవసాయ భూమిలో వినూత్న నిరసనకు దిగారు. ఆరున్నర ఫీట్ల లోతు గుంత తీసి సగం వరకు శరీరాన్ని మట్టిలో పూడ్చేసుకుని 72 గంటల దీక్షకు సిద్ధమయ్యారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమాళ్లసంకీసకు చెందిన మారెడ్డి నాగేందర్‌రెడ్డికి గ్రామంలోని సర్వేనంబర్ 433లో 10.21 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చింది. ఆ భూమిపై నాగేందర్‌రెడ్డి బ్యాంకుల్లో రుణం కూడా పొందారు. భూమిపై ఆయనే ఇప్పటికీ కాస్తు, మోఖాపై ఉంటున్నారు. రెవెన్యూ అధికారులు కేవలం 4.31 ఎకరాలకే తనకు పట్టా పాస్‌బుక్ ఇవ్వడంతో ఆందోళనకు గురయ్యానని, గ్రామ వీఆర్వో రాంబాబు, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ డబ్బుకు కక్కుర్తిపడి తన భూమిని పరాయి వ్యక్తుల పేర పట్టా చేయించారని ఆరోపించారు. పలుమార్లు తాసిల్దార్, మహబూబాబాద్ ఆర్డీవో, జేసీ, కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశానని నాగేందర్‌రెడ్డి తెలిపారు. నాటి స్థానిక రెవెన్యూ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోలేదని, అధికారుల తప్పిదంతో రైతుబంధు కోల్పోయానని వాపోయారు. పలు దినపత్రికల్లో జిల్లా రిపోర్టర్‌గా పనిచేసిన తనకే ఈ పరిస్థితి ఉంటే.. సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తంచేశారు. నాగేందర్‌రెడ్డి నిరసన విషయం తెలుసుకున్న అధికారులు.. అక్కడకు చేరుకుని దీక్ష విరమించాలని కోరారు. స్థానిక సీఐ, జేసీతో ఫోన్లో మాట్లాడించారు. మూడ్రోజుల్లో సమగ్ర విచారణ జరిపి న్యాయంచేస్తానని జేసీ డేవిడ్ హామీ ఇవ్వడంతో నాగేందర్‌రెడ్డి దీక్ష విరమించారు.

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమాళ్ల సంకీసలో మంగళ వారం శరీరాన్ని సగం మట్టిలో పూడ్చేసుకుని నిరసన వ్యక్తంచేస్తున్న రైతు మారెడ్డి నాగేందర్‌రెడ్డి (ఇన్‌సెట్) రైతును దీక్ష విరమించాలని కోరుతున్న పోలీసులు

THE TELANGANA STATE DAIRY DEVELOPMENT CO-OPERATIVE FEDERATION LIMITED
Milk Products Factory, Hyderabad – 500 017. Email ID: gmmpfhyd.tsddcf@gmail.com
e-Procurement
Tender Notice No: 525 /G.M / MPF / HYD /2019 Date: 02.08.2019
Technical cum Commercial Tenders are invited from the experienced and reputed Manufacturers / Suppliers / Authorized Dealers / Agencies for the following works at Milk Products Factory, Hyderabad in Telangana State through e-procurement platform @ www.tender.telangana.gov.in.

Tender No.	Tender Description
525	Supply, Installation, Testing & Commissioning of 02Nos 120Ltrs Capacity Khova Pans in Bi-Products Section on buy back basis at Milk Products Factory, Hyderabad

Start of downloading bid documents will commence from 21.08.2019. For further details please contact Mobile No. 9032369758.
Sd/- Managing Director

THE TELANGANA STATE DAIRY DEVELOPMENT CO-OPERATIVE FEDERATION LIMITED
Vijaya Bhavan, Lalapet, Hyderabad-500 017. Email ID: gmmkt.tsddcf@gmail.com
e-Procurement
Tender Notice No: 1589/RSM(Mktg.)/2019 Date: 20.08.2019
Technical cum Commercial Tenders are invited from the experienced and reputed Manufacturers / Authorized Dealers / Agencies for supply & maintenance of Battery Operated E-Cart at TSDDCF Ltd., Hyderabad in Telangana State through e-procurement platform @ www.tender.telangana.gov.in

Tender No.	Tender Description
1589	Supply & Maintenance of 200 No.'s of E-Carts(Battery Operated Vehicles) at TSDDCF Ltd., Hyderabad.

Bidders may start downloading the documents from 21.08.2019. For further details please contact Mobile No. 9515060719.
Sd/- Managing Director

తెలంగాణ ప్రభుత్వం
O/o రీజినల్ ఆఫీసర్ పంచాయతీ రాజ్, మహబూబ్‌నగర్
NIT No. 64 to 68/2019, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 16-08-2019
పని పేరు (5): PR మహబూబ్‌నగర్‌లో అమ్మాపూర్ వద్ద 2BHK(40) నిర్మాణం, విలియంకొండ తాండా వద్ద 2BHK ఇళ్ల నిర్మాణం, తిర్మలాయిపల్లి బ్లాక్-I వద్ద 2BHK(40) ఇళ్లు (G+1) నిర్మాణం, తిర్మలాయిపల్లి బ్లాక్-II వద్ద 2BHK(40) ఇళ్లు (G+1) నిర్మాణం, వసతి హాల్ మరియు యూరినల్స్ నిర్మాణం మరియు ఇతర సివిల్ పనులు. ECV: రూ. 7.71 కోట్లు. టెండరు డాక్యుమెంట్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో తేది: 21-08-2019న సా॥ 5.00 గం. నుండి లభిస్తుంది. టెండరు స్వీకరణ: 28-08-2019న సా॥ 5.00 గం. వరకు. సాంకేతిక బిడ్లు తెరచుట: 29-08-2019న ఉ॥ 11.00 గం. ధర బిడ్లు తెరచుట: 31-08-2019న ఉ॥ 11.00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్: http://tender.eprocurement.gov.inలో చూడవచ్చును.
DIPR RO.No. 948-DP/CL/ADVT/1/2019-20, Dt: 20-08-2019 సం/- రీజినల్ ఆఫీసర్ పంచాయతీ రాజ్, మహబూబ్‌నగర్

తెలంగాణ ప్రభుత్వం
పోలీస్ శాఖ
ప్రిన్సిపాల్, పోలీస్ శిక్షణ కళాశాల, వరంగల్
టెండరు ప్రకటన
C.No.381/T3/Mess-Tender/PTC-వరంగల్/2019 తేది: 16-08-2019
(09) నెలల కాలానికి SCTPCలు 1000 మంది మహిళలకు మమ్మూర్ వరంగల్, పోలీసు శిక్షణ కళాశాల వద్ద మెస్ నడుపుటకు టెండరు కోరబడినవి. ఒక నెల లేదా అంతకన్నా పొడిగింపవచ్చును. పాల్గొనుటకు ప్రీ క్వాలిఫికేషన్-ఏదేని ప్రముఖ విద్యా/ శిక్షణ కేంద్రాలు/ ప్రైవేట్ కంపెనీలు/ ప్రముఖ హోటల్/క్యాంటీన్/ రెస్టారెంట్/క్యాటరింగ్ సేవలలో మెస్సు నడుపుటలో వృత్తిలో కనీసంగా 2 సం॥ల అనుభవం కలిగి ఉండవలెను. రూ.100/- (రూపాయలు వంద మాత్రమే) చెల్లింపి ప్రిన్సిపాల్, PTC వరంగల్ వారి కార్యాలయం నుండి టెండరు షెడ్యూలు పొందవచ్చును. టెండరు షెడ్యూలు తేదీలు దిగువ విధంగా ఉన్నవి. షెడ్యూలు అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం: 21-08-2019 ఉ.11.00గం.లకు. షెడ్యూలు అమ్మకం ముగింపు తేది మరియు సమయం: 26-08-2019, సా. 5.00గం.లకు. బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 28-08-2019, సా. 5.00గం.లకు. ప్రీ క్వాలిఫికేషన్ తెరుచు తేది & సమయం: 30-08-2019, ఉ.11.00గం.లకు. బిడ్లను హాజరు కావలెను. సాంకేతిక సరిశీలనాలు తెరుచు తేది & సమయం: 03-09-2019, ఉ. 11.00గం.లకు. మొబైల్ నం.తో సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ ఎం. శ్రీనివాస్, DSP (AR) PTC, వరంగల్ (మమ్మూర్). మొబైల్ నెం. 9440710656.
సం/- ప్రిన్సిపాల్, పోలీసు శిక్షణ కళాశాల, వంరగల్
DIPR RO. No. 950-DP/CL/Advt/1/2019-20, Dt: 20/08/2019

తెలంగాణ ప్రభుత్వం
పోలీసు శాఖ
RC.No. 02/BTC-15/TSSP/2019 ప్రెస్ నోట్ తేది: 19.08.2019
ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం బి.గంగారం లోని 15వ తెలంగాణ ప్రత్యేక పోలీసు పటాలంలోని పటాలపు శిక్షణ కేంద్రం (బి.టి.సి.) నందు సుమారు 200 మంది సైపంటరీ పోలీసు కానిస్టేబుళ్ళకు తగిన శిక్షణ ప్రారంభం కానున్నందున 9 నుండి 10 నెలల పాటు శిక్షణ కేంద్రం (బి.టి.సి.) నందు భోజన సదుపాయం కల్పించుటకై హాస్టల్‌లో కానీ, రెస్టారెంట్‌లో కానీ, హోటళ్ళలో కానీ కనీసం రెండు సంవత్సరాల అనుభవం కలిగిన వారి నుండి టెండర్లు ఆహ్వానించడమైనది టెండర్ల దరఖాస్తు పత్రము నియమ నిబంధనలు పూర్తి వివరాల కోసం 15వ పటాలంలోని ప్రిన్సిపాల్/దళాధిపతి వారి కార్యాలయమును సంప్రదించగలరు. టెండరు దరఖాస్తు పత్రమును రూ. 100/- రుసుమును చెల్లించి తీసుకోగలరని తెలియపరచడమైనది. ఇతర సమాచారము కొర్రె ఫోన్ నంబర్: 08761-288010 మరియు 8309693955 ఫోన్ నెబ్యుగలరు లేదా నేరుగా సంప్రదించగలరు. టెండరు యొక్క తేదీల పట్టిక ఈ క్రింది విధమైనా యున్నది. 1. టెండరు దరఖాస్తు విక్రయము తేది & సమయం: 27.08.2019న ఉ.10.30 గం॥లకు 2. దరఖాస్తు విక్రయము ముగింపు తేది & సమయం: 30.08.2019న సా.04.00 గం॥లకు 3. బిడ్ దాఖలు చేయు తేది & సమయం: 31.08.2019న సా.05.00 గం॥లకు 4. ప్ర-యోగ్య పాత్రము తెరచు తేది & సమయం: 03.09.2019న ఉ.10.30 గం॥లకు 5. సాంకేతిక వివరములు తెరచు తేది & సమయం: 08.09.2019న ఉ.10.30 గం॥లకు 6.ప్ర-యోగ్య పాత్రము తెరచు తేది & సమయం: 07.09.2019న ఉ.10.30 గం॥లకు
సం/- దళాధిపతి/ప్రిన్సిపాల్, బి.టి.సి 15వ పటాలము బి.గంగారం,సత్తుపల్లి, ఖమ్మం జిల్లా
DIPR RO. No. 959-DP/CL/Advt/1/2019-20, Dt: 20/08/2019

Telangana State Co-operative Marketing Federation Ltd.,
5-2-68, 3rd Floor, Mahathma Gandhi Markfed Bhavan, Jambagh, Hyderabad-095
Email: proc.tsmarkfed@gmail.com, Ph.No: 040-2460 7108, Fax: 040-2460 7100
TENDER NOTIFICATION FOR ONLINE REVERSE E-AUCTION FOR PURCHASE OF ONCE USED SOUND (B-TWILL) 50KG/100KG GUNNIES AND 3 PLY NEW SUTHILI IN ALL ERSTWHILE DISTRICTS FOR PROCUREMENT OF ALL AGRICULTURE COMMODITIES & OILSEEDS DURING KHARIF & RABI 2019-20
Online auction starts on 31.08.2019, from 10:00AM to 05:00 PM through Telangana e-procurement portal i.e. e-procurement.telangana.gov.in./ https://auction.telangana.gov.in/ (Applications in e procurement portal will be available from 21.08.2019 AN). For online registration and further details please contact Mr. Sandeep Ph: 8096685509 and 7337318404 (Service providers M/s Vupadhi Techno Services Pvt ltd).
For further details please contact. Ph: 7288879806, 7288879824. Bid Submission from: 21.08.2019. EMD payment and tender submission last date: 29.08.2019. Technical bid opening date: 30.08.2019, 10:30AM e-auction date: 31.08.2019.
Date : 20.08.2019 Sd/- MANAGING DIRECTOR

భారతీయ కంటైనర్ నిగమ్ లిమిటెడ్
(భారత సర్కార్ యొక్క రవాణా శాఖ)
ఒక నవరత్న కంపెనీ
కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ, రైల్వేల మంత్రిత్వ శాఖ)
సంపత్ కుమార్ కంపెనీ
501-503, 5వ అంతస్తు, నవజీవన్ బిల్డింగ్, S.D.రోడ్, సికింద్రాబాద్-03. ఫోన్: 040-27806938/39
CIN: L63011DL1988GOI030915
టెండరు ప్రకటన (ఇ-టెండరింగ్ సహిత లివర్స్ విధానం మాత్రమే)
టెండరు నం: CON/SCR/CMCN/H&T/2019 తేది: 21-08-2019
డొమెస్టిక్ కంటైనర్ టెర్మినల్ (DCT), నాగులపల్లి (CMCN), సంగారెడ్డి జిల్లా (TS), CONCOR సౌత్ సెంట్రల్ రీజియన్‌లో కార్గో హ్యాండ్లింగ్, టెర్మినల్ లోపల కంటైనర్ల రవాణా మరియు కంటైనర్ల షార్ట్ లీడ్ రవాణాలు నిర్వహించుటకు CONCOR రెండు బిడ్డు విధానంలో ఆన్‌లైన్ బిడ్డింగ్ ఇ-టెండరు -సహిత లివర్స్ టెండరింగ్ ఆహ్వానిస్తున్నది.
1) అంచనా వ్యయం: రా. 18,34,00,000/-(4+1 సంవత్సరాలకు టర్నోవర్ రేటు ఆధారిత రూపాయలు 11.88% కు సమానం) 2) కాంట్రాక్ట్ కాలం: 4+1 సంవత్సరాలు
3) బయానా: రూ.5,00,000/-(ఇ-చెల్లింపు ద్వారా) 4) డాక్యుమెంటు ధర: రూ.2500/-(GST కలుపుకొని ఇ-చెల్లింపు ద్వారా)
5) టెండరు ప్రాసెసింగ్ ఫీజు: రూ. .5310/- (పన్నులు కలుపుకొని ఇ-చెల్లింపు ద్వారా)
6) ఆన్‌లైన్ బిడ్ (ఆఫర్): 21-08-2019(1500గం||లకు) నుండి 17-09-2019 (1700గం||లకు) వరకు
7) పై-బిడ్ సమావేశం: 05-09-2019, 15.00గం||లకు
8) ఇ-టెండరు దాఖలుకు చివరి తేది & సమయం: 18-09-2019 18.00గం||ల వరకు
9) ఇ-టెండరు తెరుచు తేది & సమయం: 20-09-2019న 12.00గం||లకు
అర్హత ప్రమాణాలు మరియు ఇతర వివరాలు కొరకు www.concorindia.com లేదా eprocure.gov.in లేదా www.tenderwizard.com/CCIL.కు లాగిన్ అవ్వండి. దాఖలు చేసిన బిడ్డు మొదటగా ఆమోదించిన వివరణ www.concorindia.com మరియు www.tenderwizard.com/CCIL. పబ్లిష్‌చేసి మాత్రమే జారీ చెయ్యబడును. కావున ప్రతిరోజూ పబ్లిష్‌చేసి దర్శించాల్సిందిగా బిడ్డర్లను కోరడమైనది.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్/SCR

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (E) కార్యాలయం, PCC-III, ఖైరతాబాద్, హైదరాబాద్-04.
ఇ-ప్రొక్యూర్‌మెంట్

ఇ-టెండరు ప్రకటన నెం. మరియు తేది	పని పేరు	సుమారు అంచనా కాంట్రాక్టు విలువ (లక్షలలో)
EP. No.11/CGM(E)/ PCC-III/Peripheral/ Pumps Patancheru to Beeram-guda/2019-20 తేది: 19-08-2019 (4th call)	2 సంవత్సరాల కాలవ్యవధి కొరకు MOM కలుపుకుని బీరంగూడ వద్ద ELSRకు పటాన్‌చెరు GLSR పంపు వాటర్ వద్ద 33/6.6 kv ఎలక్ట్రికల్ సబ్-స్టేషన్ ఏర్పాటు చేయుట మరియు స్ప్రైరల్ కేజ్ ఇండక్షన్ మోటార్స్‌తో 83 Mt హెడ్ కవుల్డ్‌కు సంబంధించి ఒక్కొక్కటి 750 Cum/Hr డిశ్చార్జి సామర్థ్యంగల 3 నెం.లు హారిజాంటల్ సెంట్రిఫ్యూగల్ పంపునెట్టు కలిగిన క్లియర్ వాటర్ పంపింగ్ ప్లాంట్ తయారీ, సరఫరా, బట్వాడా, స్థాపన, పరీక్షించుట & పని చేయించుట.	రూ. 377.21

1. ECV మరియు EMD మరియు ఇతర వివరాలు ఆన్‌లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో చూడవచ్చును. 2. బిడ్ డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 21-08-2019 మరియు ముగింపు తేది ఆన్‌లైన్ NITలో లభిస్తుంది. 3. సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) పేరు మరియు చిరునామా - చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ సర్కిల్-III, HMWSSB, ఖైరతాబాద్, హైదరాబాద్-500 004. 4. సమావారమును నిర్దిష్టముగా 'ZIP' ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కాంట్రాక్టర్లు/సంస్థలు కోరబడుతున్నారు. 5. తదుపరి వివరాలను @ http://www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), PCC-III, ఖైరతాబాద్, హైదరాబాద్-500 004, T.S.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
కలెక్టర్, జనగాం గారి ప్రకటన
ఫారం-సి
(తె

భూమికి పచ్చాని రంగేసినట్టు..

జనగామ జిల్లా నవాబ్ పేట రిజర్వాయర్ కింద పచ్చదనం పరుచుకున్నది. ఎటుచూసినా కనుచూపు మేర భూమికి పచ్చని రంగువేసినట్టు వరిపైరు కన్పిస్తున్నది. ఇలాంటి దృశ్యాలు ఎక్కువగా కోనసీమలో కన్పిస్తుంటాయి. కానీ నవాబ్ పేట రిజర్వాయర్ కట్టపైకి ఎక్కితే అలాంటి అందాలే ఇక్కడ మనకు కనువిందు చేస్తున్నాయి.

- ఫొటో: స్వర్గం చంద్రశేఖర్, నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనగామ

బీజేపీ నేతలవి పగటికలలు

అధికారకాంక్షతోనే నీచ రాజకీయాలు

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

బీజేపీ నాయకుల ఆరోపణలను తిప్పికొట్టిన టీఆర్ఎస్ నేతలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: తెలంగాణలో బీజేపీ నాయకుల ఆటలు సాగవని టీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. అధికార కాంక్షతోనే బీజేపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకుల ఆరోపణలను టీఆర్ఎస్ నేతలు తిప్పికొట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడటంపై టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు భానుప్రసాద్‌రావు, వీ గంగాధర్‌గౌడ్ ఫైర్ అయ్యారు. మాజీ ఎంపీ కవిత పేరును ప్రస్తావిస్తూ లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. మంగళవారం టీఆర్ఎస్ఎల్పీలో వారు మీడియాతో మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో 103 స్థానాల్లో బీజేపీ డిపాజిట్లు కోల్పోయిందని, లక్ష్మణ్ చిత్తుగా ఓడిపోయారని గుర్తుచేశారు. 'మీ లాగే మేము మాట్లాడితే తట్టుకోగలరా?' అని ప్రశ్నించారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. అధికార కాంక్షతో నీచ రాజకీయాలు చేసేందుకు బీజేపీ సిద్ధమవుతున్నదని విమర్శించారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నడ్డా వస్తే జనాలు కన్పించలేదని.. టీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి సమావేశానికి వచ్చిన జనం కూడా రాలేదని ఎద్దేవా చేశారు. పసుపు బోర్డు హామీ ఏమైందని వారు ప్రశ్నించారు.

అసంబద్ధ ఆరోపణలు: శంభీపూర్ రాజు

రాష్ట్రంలో 2023 తర్వాత తామే అధికారంలోకి వస్తామని బీజేపీ నేతలు పగటికలలు కంటున్నారని ఎమ్మెల్సీ, టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శంభీపూర్ రాజు ఎద్దేవా చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అసంబద్ధ ఆరోపణలు చేయడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ కవితపై లక్ష్మణ్ దిగజారి మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ పాల్గొనలేదని లక్ష్మణ్ చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఉద్యమ సమయంలో కేటీఆర్‌పై ఎన్నికేసులు నమోదయ్యాయో..? తెలియదా? అంటూ ప్రశ్నించారు.

టీఆర్ఎస్ఎల్పీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ వీజీ గౌడ్

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు

కేటీఆర్‌ను విమర్శించే అర్హతలేదు..

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించే అర్హత బీజేపీ నేతలకు లేదని ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకి తెలంగాణలో పునాదులే లేవని కిషన్‌రావు ఎద్దేవా చేశారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కేటీఆర్ ప్రచారంచేసి వంద సీట్లు గెలిపించారని, బీజేపీ నేత లెన్ని సీట్లు గెలిచారో గుర్తుందా? అని ప్రశ్నించారు. అవినీతిపరులకు అండగా నిలిచే చరిత్ర ఎవరిదో.. ఎవరి హయాంలో విజయ్‌మాల్యా, నీరవ్‌మోదీలు దేశం విడిచి పారిపోయారో అందరికీ తెలుసన్నారు. ఇకనైనా బీజేపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదన్నారు.

మోదీ, షా ద్వయం ఇక్కడ పనిచేయదు: వేణుగోపాలాచారి

తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి వేణుగోపాలాచారి పేర్కొన్నారు. అమిత్‌షా, మోదీ ద్వయం తెలంగాణలో పనిచేయదన్నారు. మంగళవారం ఆయన నిర్మల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని తెలంగాణ ప్రజలు విశ్వసించి రెండోసారి అధికారం కట్టబెట్టారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ ప్రభుత్వం రైతుబీమా, రైతుబంధు పథకాలను అమలు చేస్తున్నదన్నారు. రైతుబంధు పథకాన్ని కేంద్ర ప్రభుత్వమే కాపీ కొట్టి, పలు ఆంక్షలు విధించి ఎకరానికి రూ.రెండు వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న విషయాన్ని బీజేపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలను గతంలో బీజేపీ నాయకులే ప్రశంసించారని వేణుగోపాలాచారి గుర్తుచేశారు. ఇకనైనా బీజేపీ నాయకులు వాస్తవాలు గుర్తించి మాట్లాడితే మంచిదన్నారు.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీచైతన్య ఇంజినీరింగ్ కాలేజీ అధ్యాపకుడు బట్టు వెంకటేశ్‌కు దేహశుద్ధి చేస్తున్న విద్యార్థులు

కీచక అధ్యాపకుడికి దేహశుద్ధి

- ఇన్విజిలేటర్ ముసుగులో విద్యార్థినితో అసభ్య ప్రవర్తన
- పోలీసులకు పట్టించిన విద్యార్థులు

తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ: పరీక్షరాయడానికి వచ్చిన ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడికి విద్యార్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల రెండోసంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని సోమవారం ఇదే మండలంలోని శ్రీ చైతన్యఇంజినీరింగ్ కళాశాలలో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష రాసింది. అదే కళాశాలలో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బట్టు వెంకటేశ్ ఆ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఫోన్‌నంబర్ ఇవ్వాలంటూ వేధించాడు. మాటిమాటికి దగ్గరికొచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థిని పరీక్షరాసిన అనంతరం జ్యోతిష్మతి కళాశాల యాజమాన్యానికి.. తోటి విద్యార్థులకు విషయం తెలిపింది. మంగళవారం విద్యార్థులు, కళాశాల సిబ్బంది వెంకటేశ్‌ను పట్టుకొని జ్యోతిష్మతి కళాశాలకు తీసుకొచ్చి దేహశుద్ధి చేశారు. సమాచారమందుకున్న తిమ్మాపూర్ ఎస్సై నరేశ్‌రెడ్డి తన సిబ్బందితో వచ్చి వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌పై నిర్భయచట్టం కింద కేసు నమోదుచేసినట్టు పోలీసులు చెప్పారు.

సంస్థాన్ నారాయణపురంలో వైన్స్ సీజ్

సంస్థాన్‌నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని సాగర్ మద్యం దుకాణాన్ని మంగళవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేసి సీజ్ చేశారు. సోమవారం భూదాన్ పోచంపల్లిలో కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో సంస్థాన్ నారాయణపురానికి చెందిన సాగర్‌వైన్స్ నిర్వాహకుడు నౌకర్‌నామ విక్రమ్‌రెడ్డి ఉండటంతో సంస్థాన్ నారాయణపురంలోని అతడి దుకాణాన్ని తనిఖీచేసి సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా సోమవారం రాత్రి 11 గంటల సమయంలో వైన్స్ నిర్వాహకులు దుకాణంలోని మద్యాన్ని అక్కడి నుంచి తరలించినట్టు సమాచారం.

సాగర్ వైన్స్‌కు తాళం వేస్తున్న ఎక్సైజ్ సీఐ నాగలత, పోలీసులు

గిరిజనుల సంక్షేమానికి కృషి

బంజారా తీజ్‌మేళాలో మంత్రులు కొప్పుల, శ్రీనివాస్‌గౌడ్

బంజారా తీజ్‌మేళాలో ఐక్యతను చాటుతున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే రేఖానాయక్ తదితరులు

నాగర్‌కర్నూల్ జిల్లా ఆమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో మొలకల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

రవీంద్రభారతి:

గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని రాష్ట్ర మంత్రులు కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గిరిజనులు ఆర్థిక, సామాజిక, విద్య తదితర రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో బంజారా సమాచార్, ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ, భాషాసాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ మేళా - 2019 కు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తీజ్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు తమవంతు కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నెహ్రూనాయక్ రచించిన 'బంజారా జీవనాదం' పుస్తకాన్ని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం సభలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. అనంతరం బంజారాయువతులచే సంప్రదాయ తీజ్ ఉత్సవాలు నిర్వహించారు. పలువురు బంజారా మేధావులను సత్కరించి రాష్ట్రస్థాయి బంజారా కీర్తిపురస్కరాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే రేఖానాయక్, మాజీ ఎంపీ సీతారామ్‌నాయక్, గిరిజన ప్రముఖులు, ఉద్యోగులు, విద్యార్థులు, గిరిజన మేధావులు తదితరులు పాల్గొన్నారు.

తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అమ్రాబాద్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మన్ననూర్‌లో బంజార గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన మొలకల పండుగ(తీజ్)లో మంగళవారం ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు. మొలకెత్తిన బుట్టలను ఆడబిడ్డలకు అందజేశారు.

ఏసీబీకి చిక్కిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

రూ. 30 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి

తాండూరు, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథ పైప్‌లైన్ బిల్లు చేసేందుకు కాంట్రాక్టర్ నుంచి లంచంతీసుకుంటూ వికారాబాద్ జిల్లా తాండూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలంలో కాంట్రాక్టర్ గురువయ్య మిషన్‌భగీరథలో భాగంగా రూ. 69 లక్షల పనులు పూర్తిచేశాడు. ఇందుకు బిల్లు మంజూరు చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్ లంచం డిమాండ్ చేశాడు. రూ. 65 వేలు లంచం తీసుకొని మొదటి విడుతలో రూ. 25 లక్షలు విడుదల చేశాడు. మిగిలిన బిల్లు కోసం మళ్లీ కాంట్రాక్టర్‌ను లంచం అడుగడంతో విసుగు చెందిన కాంట్రాక్టర్ గురువయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో మంగళవారం సాయంత్రం కాంట్రాక్టర్ గురువయ్య నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను రూ. 30,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్

చిన్నారిని చిదిమేసిన ఆటో

కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి శివారులోని సోమ్లా తండాలో ఆటో ఢీకొట్టడంతో చిన్నారి దుర్మరణం చెందింది. కురవి తండాకు చెందిన భూక్య వెంకన్న, బిందు దంపతుల కుమార్తె ఉషశ్రీ (5) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హోలీ ఏంజెల్స్ పాఠశాలలో ఎల్కేజీ చదువుతున్నది. పాఠశాల బస్సు ఎక్కించేందుకు మంగళవారం ఉదయం చిన్నారిని ఆమె తల్లి బిందు రోడ్డు పక్కన నిలబెట్టింది. తోటి కోడళ్ల పిల్లలు అక్కడే ఉండటంతో రోజులాగే చిన్నారి బస్సు రాగానే ఎక్కి వెళ్తుందన్న ధైర్యంతో ఇంట్లోకి వెళ్లింది. అదే సమయంలో మహబూబాబాద్ నుంచి మరిపెడకు అతివేగంతో వెళ్తున్న ఆటో చిన్నారి ఉషశ్రీకి తగలడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఉషశ్రీని తగలిన ఆటోబోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన ఉషశ్రీని, గాయపడిన ఆటో ప్రయాణికులను 108లో మహబూబాబాద్‌లోని ఏరియా దవాఖానకు తరలించారు. దవాఖానకు చేరుకునేలోపే చిన్నారి మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

ఉషశ్రీ (ఫైల్)

ఎమ్మెల్సీ ఆకుల లలితకు పితృవియోగం

నిజామాబాద్ సిటీ: ఎమ్మెల్సీ ఆకుల లలితకు పితృవియోగం కలిగింది. ఆమె తండ్రి డాక్టర్ ఎన్ వెంకట్ నర్సయ్య (85) మంగళవారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గతంలో ఆయన జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీగా పనిచేశారు. బుధవారం నిజామాబాద్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు. ఆకుల లలితకు తీవ్ర సానుభూతిని వ్యక్తం చేశారు.

బాలుడిపై లైంగిక దాడి

నిజామాబాద్ జిల్లాలో ఘటన

ఎడపల్లి: నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం పోచారం గ్రామంలో బాలుడి(6)పై అదేగ్రామానికి చెందిన మరో బాలుడు(17) లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆరేండ్ల బాలుడిని ఇంటికి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని ఆ బాలుడు తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎడపల్లి పోలీసులు పోక్సో చట్టం కింద బాలుడి (17)పై కేసు నమోదు చేశారు.

తొమ్మిది జిల్లాల్లో ఓ మోస్తరు వానలు

అత్యధికంగా నవాబుపేటలో 65.6 మి.మీ. నమోదు

హైదరాబాద్/నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మంగళవారం దాదాపు తొమ్మిది జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో 65.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వచ్చే 48గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో భారీవర్షం కురిసింది. లక్ష్మీదేవిపల్లి మండలం మైలారంలో పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతిచెందాయి. జూలూరుపాడులోని వెంగన్నపాలెం పాఠశాలలోకి వరద నీరు చేరింది. ఖమ్మం జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. ఖమ్మం నగరంతోపాటు ఖమ్మం రూరల్, కూసుమంచి, కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, వైరా, బోనకల్ మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా తల్లాడ మండలంలో 40.8 మి.మీ., పెనుబల్లి మండలంలో 32.4 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 8.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం రికార్డయింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులోని వెంగన్నపాలెం పాఠశాలలోకి చేరిన వరద.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

నవాబుపేటలో అత్యధికం..

వికారాబాద్ జిల్లాలో రెండ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం వికారాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మధ్యాహ్నం జోరు వర్షం కురిసింది. అత్యధికంగా నవాబుపేట మండలంలో 65.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లాలో సోమవారంరాత్రి, మంగళవారం పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. పెన్‌పహాడ్, ఆత్మకూర్ (ఎస్), చివ్వెంల, మఠంపల్లి, నడిగూడెం, నూతనకల్, మోతె, మేళ్లచెర్వు, మద్దిరాల, సూర్యాపేట మండలాల్లో మోస్తరు నుంచి చిరుజల్లులు పడ్డాయి. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరుతోపాటు పలుగ్రామాల్లో మంగళవారం సాయంత్రం సుమారు గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. మహబూబాబాద్, గార్ల మండలాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మానుకోట, గార్ల మండలాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ములుగు జిల్లా కేంద్రంలో చిరుజల్లులతో మొదలై ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా వాజేడు మండలంలో 34.02 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో దాదాపు గంటపాటు భారీ వర్షం పడింది. కాగా బెజ్జూరు మండల కేంద్రంతోపాటు నాగుల్వాయి, రేచిని, కుశ్నపల్లి, పాపన్‌పేట తదితర గ్రామాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది.

48 గంటల్లో రాష్ట్రంలో తేలికపాటి వానలు

రాగల 48 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నది. ఆగ్నేయ ఉత్తరప్రదేశ్ దానిని ఆనుకొని ఉన్న జార్ఖండ్, బీహార్ ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతున్నది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. అల్పపీడనం మధ్య ప్రాంతం నుంచి ఉత్తర తమిళనాడు వరకు ఒడిశా, ఉత్తర కోస్తాంధ్ర మీదుగా 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు ఉత్తర, దక్షిణ ద్రోణి ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారి రాజారావు తెలిపారు. రాగల 48 గంటల వరకు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని పేర్కొన్నారు.

వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ ఊరచెరువులో మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలు వదులుతున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ తదితరులు - ఎల్కతుర్తి

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురంలోని పార్వతి బరాజ్‌లో మంగళవారం చేప, రొయ్య పిల్లలను వదులుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ తదితరులు - మంథని, నమస్తే తెలంగాణ/మంథని రూరల్

బాలికను గర్భవతిని చేసిన వృద్ధుడి అరెస్ట్

జగిత్యాల క్రైం: వరుసకు మనుమరాలయ్యే విద్యార్థినిని లోబరుచుకొని గర్భవతిని చేసిన రిటైర్డు ఉపాధ్యాయుడు బ్రహ్మయ్యను మంగళవారం అరెస్ట్ చేసినట్లు జగిత్యాల పోలీసులు తెలిపారు. బ్రహ్మయ్య వరుసకు మనమరాలు అయ్యే బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడి జరుపడంతో గర్భందాల్చిందని వారు పేర్కొన్నారు.

గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ ప్రారంభం

కవాడిగూడ: టెట్రా సాఫ్ట్ మారియట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. ఆతిథ్య భారత్ సహా పది దేశాల నుంచి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడుతున్న టోర్నీకి రాష్ట్రం తొలిసారి వేదికైంది. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్‌ఇండియా చెస్ సమాఖ్య కార్యదర్శి భరత్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ భారత్ గ్రాండ్‌మాస్టర్స్‌కు పవర్ హబ్‌గా మారిందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, కార్యదర్శి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల చెన్నైలో జాతీయ అండర్-18 టెన్నిస్ చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్న రాష్ట్ర యువ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మికను మంగళవారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి,టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ తదితరులు

డాన్ ధమాల్!

ఒలింపిక్ విజేత లిన్‌పై ప్రణయ్ సంచలన విజయం

ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశం

నేడు బరిలోకి సింధు, సైనా

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు ప్రణయ్, సాయి ప్రణీత్ దుమ్మురేపారు. రౌండో రౌండ్‌లో తిరుగులేని ఆటతో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ లిన్ డాన్(చైనా)కు ప్రణయ్ షాకిచ్చాడు. ఓ దశలో వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించి.. వణికించాడు. సాయి ప్రణీత్ సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ కొరియా ఆటగాడిని వరుస గేమ్‌ల్లో ఓడించి ముందడుగేశాడు. మహిళల డబుల్స్‌లో ప్రత్యర్థి వాకోవర్ ఇవ్వడంతో సిక్కిరెడ్డి-పొన్నప్ప జోడీ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది.

ప్రణయ్

లిన్ డాన్

బాసెల్(స్విట్జర్లాండ్):

బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ సంచలనం సృష్టించాడు. మంగళవారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రణయ్ 21-11, 13-21, 21-7 తేడాతో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత, 11వ సీడ్ లిన్ డాన్(చైనా)ను మట్టికరిపించి ప్రి క్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. 62 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో.. అన్‌సీడెడ్ ప్రణ య్ తొలి నుంచి డాన్‌పై ఆధిపత్యం కనబరిచాడు. మొదటి గేమ్‌లో 2-2 నుంచి రెచ్చిపోయి 10-5కు ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. అదిరే షాట్లతో డాన్‌కు చుక్కలు చూపిస్తూ కాసేపటికే 19-11కి చేరుకొని వరుస పాయింట్లతో గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. అయితే రెండో గేమ్‌లో పాయింట్లు 5-5గా ఉన్న సమయంలో డాన్ చెలరేగాడు. ప్రత్యర్థి వరుసగా పాయింట్లు సాధిస్తుండడంతో ఆత్మరక్షణలో పడిన భారత షట్లర్ తడబడి గేమ్‌ను 13-21తో చేజార్చుకున్నాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రణయ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోవడంతో చైనా ఆటగాడు చేష్టలుడిగిపోయాడు. 6-4గా స్కోరు ఉన్న సమయంలో వరుసగా ప్రణయ్ ఎనిమిది పాయింట్లు సాధించి అందనంత అధిక్యానికి వెళ్లాడు. ఆ తర్వాత అదే జోరును కొనసాగిస్తూ 21-7తో గేమ్‌ను గెలిచి, 11సీడ్ ఆటగాడికి భారీ పరాభవాన్ని రుచిచూపించాడు. ప్రిక్వార్టర్స్‌లో టాప్ సీడ్ కెంటో మెమోటా (జపాన్)తో ప్రణయ్ తలపడనున్నాడు.

డబుల్స్‌లోనూ భారత్ జోరు

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత్ ద్వయం సుమీత్ రెడ్డి- మను అత్రి 21-13, 21-13తో ఫ్రాన్స్ జోడీ థోమ్ గిక్వెల్-రానోన్ లాబర్‌పై గెలిచింది. 26 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ తొలి నుంచి చివరి వరకు పైచేయి సాధించింది. రెండో గేమ్‌లో ఏకంగా ఏడు వరుస పాయింట్లతో సత్తా చాటింది. తదుపరి రౌండ్‌లో ఆరో సీడ్ హన్ చెంగ్ కై, హావ్ డంగ్‌తో తలపడనున్నారు. మరోమ్యాచ్‌లో అరుణ్ జార్జ్-సన్యమ్ శుక్లా 18-21, 11-21 తేడాతో జపాన్ జోడీ తకుటో -కనెకో చేతిలో ఓడింది.

సిక్కి-ఆశ్వినీ ముందడుగు

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రత్యర్థి చైనీస్ తైపీ జోడీ చంగ్ చింగ్ హుయ్- చింగ్ టున్ వాక్‌ఓవర్ ఇవ్వడంతో భారత ద్వయం ఎన్.సిక్కిరెడ్డి- అశ్వినీ పొన్నప్ప రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. తదుపరి పోరులో ఏడో సీడ్ చైనీస్ జోడీ డు యె- లి యిన్ హూతో వారు పోటీ పడనుంది. మరో మ్యాచ్‌లో భారత జోడీ పూజా దండు-సంజన సంతోష్ 15-21, 14-21 తేడాతో చైనీస్ తైపీ ద్వయం యాచింగ్-లింగ్ ఫాంగ్ చేతిలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ప్రణీత్.. వరుससెట్లలో

మరోమ్యాచ్‌లో తెలుగు షట్లర్, 16వ సీడ్ సాయిప్రణీత్ 21-16, 21-15 తేడాతో వరుస సెట్లలో లీ డాంగ్ కిన్ (కొరియా)పై విజయం సాధించి, ప్రి క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. 56నిమిషాల పాటు సాగిన మ్యాచ్ తొలి గేమ్‌లో ఓ దశలో 4-8తో వెనుకబడ్డ ప్రణీత్.. ఆ తర్వాత పుంజుకొని ప్రత్యర్థి ఆధిక్యాన్ని తగ్గించుకుంటూ పోయాడు. 12-12 పాయింట్లతో సమం చేయడం సహా.. గేమ్‌ను 21-16తో కైవసం చేసుకున్నాడు. ఇక రెండో గేమ్‌లోనూ అదే ఆత్మవిశ్వాసంతో ఏ మాత్రం తడబడకుండా ప్రణీత్ రాణించాడు. తొలుత పాయింట్ల విషయంలో ఆధిక్యం చేతు లు మారినా.. ఆ తర్వాత క్రమంగా మ్యాచ్‌ను ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. 12-12తో పాయింట్లతో సమం అయ్యాక ఒక్కసారిగా పుంజుకున్న ప్రణీత్ చివరి వరకు ఆధిక్యాన్ని నిలుపుకొని వరుస గేమ్‌ల్లోనే పని కానిచ్చేశాడు.

బరిలో సైనా, సింధు

భారత స్టార్ షట్లర్లు ఐదో సీడ్ పీవీ సింధు, ఎనిమిదో సీడ్ సైనా నెహ్వాల్ బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బుధవారం పతక వేటను ప్రారంభించనున్నారు. తొలి రౌండ్‌లో ఇద్దరు బై పొందగా, రెండో రౌండ్‌లో పై యూ పో(చైనీస్ తైపీ)తో సింధు తలపడనుంది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో కిడాంబి శ్రీకాంత్... మిషా జిల్బెర్‌మెన్(ఇజ్రాయెల్)తో నేడు తాడోపేడో తేల్చుకోనున్నాడు.



వరల్డ్ చాంపియన్‌షిప్‌కు

రెజ్లర్ సుశీల్

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్ ఎట్టకేలకు ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ బెర్త్ దక్కించుకున్నాడు. ఏడాది కాలంగా మ్యాట్‌కు దూరంగా ఉన్న సుశీల్ ఇటీవల బెలారస్ టోర్నీ బరిలో దిగి పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. అయితే తాజాగా నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో మాత్రం సుశీల్ సత్తాచాటాడు. 74 కేజీల విభాగం ఫైనల్లో మంగళవారం సుశీల్ 4-2తో జితేందర్ కుమార్‌పై విజయం సాధించాడు. తొలి రౌండ్ ఆరంభంలోనే 4-0తో ఆధిక్యంలోకి వెళ్లిన సుశీల్.. ఆ తర్వాత పట్టు వదలకుండా జోరు కొనసాగించాడు. జితేందర్ రెండు పాయింట్లు సాధించి పోటీలోకి వచ్చేందుకు ప్రయత్నించినా.. అది సాధ్యపడలేదు.

శ్రీశాంత్‌పై నిషేధం ఎత్తివేత

2020 ఆగస్టుతో ముగింపు

న్యూఢిల్లీ: స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో టీమ్‌ఇండియాకు దూరమైన పేసర్ శ్రీశాంత్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. అతడిపై విధించిన జీవిత కాల నిషేధాన్ని ఎత్తేశారు. శ్రీశాంత్ నిషేధం ఏడేండ్ల వరకే కొనసాగుతుందని బీసీసీఐ అంబుడ్స్‌మన్, రిటైర్డ్ జస్టిస్ డీకే జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఇప్పటికే ఆరేండ్లు నిషేధం పూర్తిచేసుకున్న శ్రీశాంత్‌కు 2020 ఆగస్టులో విముక్తి లభించనుంది. 36 ఏండ్ల శాంతకుమారన్ శ్రీశాంత్ 2013 ఐపీఎల్లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డట్లు ఆరోపణలొచ్చాయి. అతడితో పాటు అజిత్ చండీలా, అంకిత్ చౌహాన్‌పై అప్పట్లో బీసీసీఐ జీవితకాల నిషేధం విధించింది.ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 15న సుప్రీంకోర్టు అతడిపై నిషేధం ఎత్తేసి.. శిక్ష తగ్గించి ఆటగాడికి న్యాయం చేయాలని బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు ఆదేశాలు జారీచేసింది. 2005లో వన్డేల్లో అరంగేట్రం చేసిన ఈ పేసర్ 2011లో చివరి టెస్టు ఆడాడు. ఆ తర్వాత జట్టుకు దూరమైన అతడు ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణల్లో ఇరుక్కున్నాడు.

బీసీసీఐ అంబుడ్స్‌మన్ తీర్పు విన్న తర్వాత చాలా సంతోషించా. టెస్టు జట్టులో పునరాగమనం చేసేందుకు ప్రయత్నిస్తా. మరో 13 వికెట్లు పడగొట్టి సెంచరీ పూర్తి చేసుకుంటా. - శ్రీశాంత్

తల్లి కాబోతున్నా : అమీ శాటెర్త్‌వైట్

లీయా తహుహు

శాటర్త్‌వైట్

వెల్లింగ్టన్: వివాహం చేసుకున్న తొలి మహిళా క్రికెట్ జంటగా సంచలనం సృష్టించిన న్యూజిలాండ్ కెప్టెన్ శాటెర్త్‌వైట్, బౌలర్ లీయా తహుహూ.. త్వరలో ఓ బిడ్డకు జన్మనివ్వనున్నారు. ఈ మేరకు తాను గర్భం దాల్చానని శాటెర్త్‌వైట్ మంగళవారం ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి కల్లా ఓ బిడ్డకు జన్మనిస్తానని, సొంతగడ్డపై జరిగే 2021 ప్రపంచ కప్ కల్లా జట్టులోకి వస్తానని విశ్వాసం వ్యక్తం చేసింది. అప్పటి దాకా అవసరమైతే జట్టుకు మెంటార్‌లా ఉంటానని చెప్పింది. 'వచ్చే ఏడాది మొదట్లో మా తొలి సంతానం భూమ్మీదికి వస్తుందని చెప్పేందుకు నేను లియా సంతోషిస్తున్నాం. ఇదో ప్రత్యేకమైన సమయం. మా జీవితాల్లో కొత్త అధ్యాయం కోసం ఎదురుచూస్తున్నాం' అని శాటెర్త్‌వైట్ ట్వీట్ చేసింది. అయితే ఏ పద్ధతి ద్వారా గర్భం దాల్చినది ఆమె వెల్లడించలేదు. ప్రెగ్నెన్సీ పాలసీ ప్రకారం శాటెర్త్‌వైట్‌కు వేతనంతో కూడిన మాతృత్వ సెలవులతో పాటు కాంట్రాక్టును కూడా పొడిగిస్తామని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. గతేడాది నుంచి కివీస్ కెప్టెన్‌గా ఉన్న అమీ మొత్తం 119 వన్డేలు, 99 టీ20లు ఆడింది.

టెస్టులకు ఆదరణ పెరిగింది: కోహ్లీ

నార్త్‌సౌండ్(అంటిగ్వా): ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో అడుగుపెట్టేందుకు టీమ్‌ఇండియా సిద్ధమైంది. విండీస్‌తో గురువారం ప్రారంభమయ్యే మ్యాచ్‌తో యాత్రను మొదలుపెట్టనుంది. ఈ నేపథ్యంలో చాంపియన్‌షిప్ కోసం తాను ఆత్రుతగా ఎదురుచూస్తున్నానని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. టెస్టు క్రికెట్‌కు ఆదరణ బాగానే ఉందని... ఈ ప్రయోగం వల్ల రెట్టింపవుతుందని అభిప్రాయపడ్డారు. వెస్టిండీస్ ప్లేయర్స్ అసోసియేషన్ అవార్డుల కార్యక్రమానికి హాజరైన విరాట్ మాట్లాడాడు. చాంపియన్‌షిప్ వల్ల ఆడే ప్రతి టెస్టుకు పరమార్థం వచ్చిందని చెప్పాడు. సరైన సమయంలో.. ఇది సరైన చర్య అంటూ ఐసీసీని ప్రశంసించాడు. టెస్టు క్రికెట్ పడిపోతున్నదని కొందరు అంటున్నారని, కానీ రెండేళ్లుగా సుదీర్ఘ ఫార్మాట్‌కు ఆదరణ విశేషంగా పెరిగిందని చెప్పుకొచ్చాడు.

మహీ రికార్డుకు అడుగు దూరంలో..

టెస్టుల్లో సారథిగా మహేంద్ర సింగ్ ధోనీ రికార్డును సమం చేసేందుకు కెప్టెన్ విరాట్ కోహ్లీ ఓ విజయం దూరంలో ఉన్నాడు. ధోనీ సారథ్యంలోని టీమ్‌ఇండియా విదేశాల్లో ఆడిన 60టెస్టుల్లో 27 మ్యాచ్‌లు గెలిచింది. పరాయి దేశాల్లో అత్యధిక మ్యాచ్‌లు గెలిచిన కెప్టెన్‌గా రికార్డు మహీ పేరిట ఉంది. విండీస్‌తో తొలి మ్యాచ్‌లో భారత్ గెలిస్తే కెప్టెన్‌గా ఆ రికార్డును కోహ్లీ సమం చేస్తాడు. విరాట్ సారథ్యంలో టీమ్‌ఇండియా విదేశాల్లో ఇప్పటివరకు 46 టెస్టులు ఆడి 26 గెలిచింది.

మెరుగయ్యేందుకు కష్టపడ్డా : ఉమేశ్

కూలిడ్జ్(అంటిగ్వా) : మెరుపు వేగం, మంచి బౌన్స్ రాబట్టగలిగే సామర్థ్యమున్నా.. లైన్ అండ్ లెంగ్త్ విషయంలో విఫలమవుతున్నాడనే విమర్శలు టీమ్‌ఇండియా పేసర్ ఉమేశ్ యాదవ్‌పై ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ కారణంతోనే అతడు పరిమిత ఓవర్ల క్రికెట్‌కు ఎంపిక కావడంలేదు. ప్రస్తుతం టెస్టు ఫార్మాట్‌కే పరిమితయ్యాడు. టీమ్‌ఇండియా తరపున చివరగా గతేడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఆడాడు. ప్రస్తుతం విండీస్ గడ్డపై టెస్టు సిరీస్‌కు ఎంపికైన అతడు తొలి మ్యాచ్ తుదిజట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్నాడు. కాగా, జట్టుకు దూరంగా ఉన్న సమయంలో బౌలింగ్‌ను మెరుగుపరుచుకునేందుకు ఎంతో కష్టపడ్డానని ఉమేశ్ యాదవ్ మంగళవారం తెలిపాడు. లైన్ అండ్ లెంగ్త్‌లో కచ్చితత్వం కోసం కృషి చేశానని, పూర్తి ఆత్మవిశ్వాసాన్ని సాధించానని చెప్పాడు. కోచ్ సుబ్రతో బెనర్జీ సారథ్యంలో విదర్భ క్రికెట్ అకాడమీలో కొన్ని నెలలుగా సన్నాహకాలు చేసినట్టు వెల్లడించాడు.

అఖిల బౌలింగ్‌పై మళ్లీ అనుమానాలు

కివీస్ కెప్టెన్ విలియమ్సన్ పైనా..

విలియమ్సన్ అఖిల ధనంజయ

దుబాయ్ : న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆరు వికెట్లు తీసిన శ్రీలంక స్పిన్నర్ అఖిల ధనంజయ బౌలింగ్ యాక్షన్‌పై మరోసారి అనుమానాలు రేగాయి. నిబంధనలకు విరుద్ధమైన బౌలింగ్ యాక్షన్ కలిగి ఉన్నాడన్న కారణంతో గతేడాది డిసెంబర్‌లో సస్పెన్షన్‌కు గురైన ధనంజయ.. తన యాక్షన్‌ను సరిచేసుకొని ఈ ఏడాది మార్చిలో అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం జరుగుతున్న టెస్టు సిరీస్‌లో అతడి బౌలింగ్ యాక్షన్‌పై మ్యాచ్ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఐసీసీకి నివేదిక పంపారు. అతడితో పాటు విలియమన్స్ బౌలింగ్ యాక్షన్ పైనా అభ్యంతరాలు తెలిపారు. దీంతో వచ్చే నెల 2వ తేదీలోగా ఐసీసీ ఇద్దరికీ బౌలింగ్ పరీక్షలు నిర్వహించనుంది. ఆ పరీక్షల ఫలితం తేలే వరకు వీరు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడొచ్చు.

రెండో రౌండ్లో అంకిత

న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అడుగుపెట్టేందుకు భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ అంకితా రైనా ముంగిట చక్కటి అవకాశం నిలిచింది. క్వాలిఫయింగ్ టోర్నీ తొలి రౌండ్‌లో తన కంటే మెరుగైన ప్రత్యర్థిని చిత్తు చేసిన అంకిత.. రెండో రౌండ్‌లో ర్యాంకింగ్‌లో ఎంతో వెనుకబడి ఉన్న ప్రత్యర్థితో తలపడనుంది. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 194వ ర్యాంకర్ అంకిత 6-1, 1-6, 6-2తో ప్రపంచ 111వ ర్యాంకర్ బొనావెన్టురే (బెల్జియం)పై గెలిచింది. బుధవారం జరుగనున్న రెండో రౌండ్‌లో ప్రపంచ 279వ ర్యాంకర్ డానియా అల్లెర్తోవా (చెక్ రిపబ్లిక్)తో అంకిత తలపడనుంది. ఇప్పటివరకు గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వాలిఫయింగ్ టోర్నీలో అంకిత రెండో రౌండ్ అడ్డంకిని అధిగమించలేకపోయింది. మరోవైపు పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో రామ్‌కుమార్ రామనాథన్ 5-7, 6-7 (7/9)తో ఫిలిప్పో బాల్డీ (ఇటలీ) చేతిలో ఓటమి పాలయ్యాడు.

రోహిత్ లేక రహానే

తుది జట్టు కూర్పుపై తర్జనభర్జన

అంటిగ్వా: వెస్టిండీస్ టూర్‌లో భాగంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దుమ్మురేపి రెండు సిరీస్‌లు చేజిక్కించుకున్న టీమ్‌ఇండియాకు టెస్టు సిరీస్ ప్రాంభానికి ముందు కొత్త చిక్కు వచ్చి పడింది. వన్డే క్రికెట్‌లో తనదైన శైలిలో రెచ్చిపోతున్న వైస్ కెప్టెన్ రోహిత్ శర్మను తుది జట్టులోకి తీసుకోవాలా..? సంప్రదాయ క్రికెట్‌లో అత్యంత నమ్మదగిన బ్యాట్స్‌మన్, టెస్టు వైస్ కెప్టెన్ అజింక్యా రహానేను ఎంపిక చేయాలా తేల్చుకోలేక జట్టు యాజమాన్యం గందరగోళంలో పడింది. ఐదుగురు బౌలర్ల కూర్పుతో బరిలో దిగాలనుకుంటే వీరిద్దరిలో ఒక్కరికే అవకాశం దక్కనుంది. అలా కాదని నలుగురు బౌలర్ల ప్లాన్‌కు సిద్ధమైతే ఇద్దరికీ తుది జట్టులో చోటు దక్కొచ్చు. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ నెగ్గిన అనంతరం ఈ ఫార్మాట్‌లో భారత్ తొలిసారిగా బరిలో దిగనుంది. ఈ మ్యాచ్ నుంచి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత్ ప్రస్థానం ప్రారంభం కానుండటంతో ఎలాంటి కూర్పుతో బరిలో దిగుతుందనేది ఆసక్తిగా మారింది. రోహిత్, రహానేను తుది జట్టులో కొనసాగిస్తే.. ఒకే స్పిన్నర్‌తో బరిలో దిగాల్సి ఉంటుంది. అలాంటప్పుడు అశ్విన్‌నే ఆడించొచ్చు.

మూడో టెస్టుకు స్మిత్ దూరం

లండన్: పద్దెనిమిదేండ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఇంగ్లండ్ గడ్డపై యాషెస్ సిరీస్ చేజిక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్న ఆస్ట్రేలియా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాట్స్‌మన్, మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ మూడో టెస్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. ప్రతిష్ఠాత్మక సిరీస్‌లో భాగంగా గురువారం నుంచి ఇంగ్లండ్‌తో ఆసీస్ మూడో టెస్టు ఆడాల్సి ఉంది. అయితే రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తుండగా.. ఆర్చర్ వేసిన రాకాసి బౌన్సర్ తలకు బలంగా తగలడంతో గాయపడిన స్మిత్ మూడో టెస్టు ఆడే అవకాశాలు లేవని క్రికెట్ ఆస్ట్రేలియా మంగళవారం ప్రకటించింది.

ఫైనల్లో భారత జట్లు

ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్‌లో సత్తాచాటిన పురుషుల, మహిళల హాకీ టీమ్స్

టోక్యో: ప్రతిష్ఠాత్మక ఒలింపిక్ క్రీడల సన్నాహకంలో భాగంగా జరుగుతున్న టెస్ట్ ఈవెంట్‌లో భారత జట్లు సత్తాచాటాయి. చివరి లీగ్ మ్యాచ్‌లో పురుషుల జట్టు 6-3తో జపాన్‌ను చిత్తు చేసి ఫైనల్ చేరితే.. మహిళల జట్టు 0-0తో చైనాతో మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం ద్వారా తుదిపోరుకు అర్హత సాధించింది. బుధవారం జరుగనున్న ఫైనల్లో న్యూజిలాండ్‌తో పురుషుల జట్టు, ఆతిథ్య జపాన్‌తో మహిళల జట్టు అమీతుమీ తేల్చుకోనుంది.

మన్‌దీప్ హ్యాట్రిక్

జపాన్‌తో మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు పూర్తి ఆధిపత్యం కనబర్చింది. స్టార్ స్ట్రయికర్ మన్‌దీప్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో రెచ్చిపోవడంతో మన జట్టుకు తిరుగులేకుండా పోయింది. గత మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన భారత్ వెంటనే పుంజుకొని పూర్తిస్థాయిలో సత్తాచాటింది. భారత్ తరపున మన్‌దీప్ (9వ, 29వ, 30వ నిమిషాల్లో) 3 గోల్స్‌తో ఆకట్టుకుంటే.. నీలకంఠ శర్మ (3వ ని.లో), నీలమ్ సంజీప్ (7వ ని.లో), గుర్జంత్ సింగ్ (41వ ని.లో) తలా ఓ గోల్ చేశారు. ప్రత్యర్థి జట్టు తరపున కెంటారో (25వ ని.లో), కెంట తనకా (36వ ని.లో), కాజుమా మురాత (52వ ని.లో) ఒక్కో గోల్ నమోదు చేశారు.

వరుసగా రెండో 'డ్రా'

మరోవైపు భారత అమ్మాయిలు ఈ టోర్నీలో వరుసగా రెండో 'డ్రా'నమోదు చేసుకున్నారు. గత మ్యాచ్‌లో అగ్రశ్రేణి జట్టు ఆస్ట్రేలియాను నిలువరించిన మన అమ్మాయిలు.. మంగళవారం మ్యాచ్‌లో చైనాకు తమ డిఫెన్స్ పవర్ చాటి చెప్పారు. మ్యాచ్ మొత్తం ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వని భారత్ ఎక్కువ శాతం డిఫెన్స్‌కే ప్రాధాన్యతనిచ్చింది.

సెన్సెక్స్	నిఫ్టీ
37,328	11,017
74	37

ముడి చమురు (బ్రెంట్) 59.86 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	38,770
22 క్యారెట్లు	38,400
వెండి (కిలో)	43,900

విదేశీ మారకం (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.40	73.90
యూరో	75.50	82.00
బహ్రెయిన్ దినార్	175.20	189.20
కువైట్ దినార్	225.00	237.00
సౌదీ రియాల్	17.80	19.60
యూఏఈ దిర్హామ్	18.20	19.90

రెడ్డీస్ దువ్వాడ ప్లాంట్‌పై అమెరికా ఆంక్షలు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: డాక్టర్ రెడ్డీస్‌కు అమెరికా నియంత్రణ మండలి షాకిచ్చింది. ఏపీలోని దువ్వాడలో ఉన్న ప్లాంట్‌పై యూఎస్ఎఫ్‌డీఏ..ఎనిమిది అభ్యంతరాలు వ్యక్తంచేసింది. వైజాగ్ సెజ్‌లో ఏర్పాటు చేసిన ఫార్ములేషన్ తయారీ ప్లాంట్‌ను ఇటీవల తనిఖీ చేసిన యూఎస్ఎఫ్‌డీఏ ఉన్నతాధికారులు ఎనిమిది అభ్యంతరాలపై ఫామ్ 483ని జారీ చేసినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. అమెరికా లెవనేత్తిన అంశాలను త్వరలో పరిష్కరించనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఎస్బీఐ పండుగ ఆఫర్

తక్కువ వడ్డీకే రుణాలు

గృహాలపై 8.05%, వాహనాలపై 8.70%

న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)..వచ్చే పండుగ సీజన్‌లో రుణాలను తీసుకునేవారిని ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో గృహ, వాహన రుణాలను తక్కువ వడ్డీకి ఇవ్వనున్నట్లు మంగళవారం ప్రకటించింది. వినియోగదారులు ఈ చౌక రుణాలతోపాటు ప్రాసెసింగ్ ఫీజు ఎత్తివేయనున్న బ్యాంక్..డిజిటల్ రుణాలకు ముందస్తు అనుమతి, అన్ని రకాల రుణాలపై వడ్డీ తీవ్రతను తగ్గించనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎప్పటిలోగా తీసుకునే రుణాలకు వర్తించనున్నదో మాత్రం బ్యాంక్ వెల్లడించకపోయినప్పటికీ, వచ్చే పండుగ సీజన్ ముగిసేవరకు తీసుకునే రుణాలకు వర్తించనున్నదని తెలస్తున్నది. మిగతా బ్యాంకులు కూడా ఎస్బీఐ బాట పట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ పండుగ సీజన్‌లో కార్ల రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును ఎత్తివేసిన బ్యాంక్..8.70 శాతం ప్రారంభ వడ్డీకే వాహన రుణాలను అందిస్తున్నది. కారు రుణాలు కావాలనుకునేవారు బ్యాంక్‌కు చెందిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'యోనో' లేదా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించింది. ఇలా దరఖాస్తు చేసుకున్నవారికి పావుశాతం వడ్డీ రాయితీ కూడా ఇస్తున్నది. వేతన జీవులకు కారు మార్కెట్ ధరలో 90 శాతం రుణం ఇవ్వనున్నది బ్యాంక్. ఇటీవల బ్యాంక్ మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)పై 15 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రుణాల్లో వడ్డీని 35 బేసిస్ పాయింట్లు కోత విధించింది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో అతి తక్కువ 8.05 శాతానికే గృహ రుణాలు అందిస్తున్నది ఎస్బీఐ కావడం విశేషం. ఇటీవల ఈ రుణాలను రెపోరేటుకు అనుసంధానం కూడా చేసింది. వీటితోపాటు రూ.20 లక్షల లోపు వ్యక్తిగత రుణాలపై వార్షిక వడ్డీని 10.75 శాతంగా విధిస్తున్నట్లు ప్రకటించింది. వీటిని ఆరేండ్ల వరకు తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశం కల్పించింది.

- రూ.5 లక్షల లోపు రుణం కావాల్సిన వేతన జీవులు వారు యోనో ద్వారా దరఖాస్తు చేసుకుంటే సరిపోతున్నది. వెంటనే అనుమతి లభించనున్నది.
- రూ.50 లక్షల లోపు విద్యా రుణాలపై ప్రారంభ వడ్డీ 8.25 శాతంగా నిర్ణయించింది. 15 ఏండ్లలోగా ఈ రుణాలను తిరిగి చెల్లింపులు జరిపేందుకు వీలు కల్పించింది.

బంగారమాయేనా..!

రూ.200 పెరిగి రూ.38,770కి చేరిన తులం ధర.. రూ.1,100 తగ్గిన కిలో వెండి

న్యూఢిల్లీ, ఆగస్టు 20: బంగారం ధర మరో శిఖరాలకు చేరుకున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న అతి విలువైన లోహాల ధర మంగళవారం మరో చారిత్రక స్థాయి రూ.38,770కి చేరుకున్నాయి. నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.200 అధికమైంది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేకపోయినప్పటికీ స్థానిక వ్యాపారుల నుంచి డిమాండ్ తగ్గకపోవడంతో రికార్డు స్థాయికి చేరుకున్నదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. వెండి కిలో ధర రూ.1,100 తగ్గి రూ.43,900కి చేరుకున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్ల మద్దతు లేకపోవడంతో వెండి భారీగా తగ్గిందని బులియన్ ట్రేడర్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు ఉన్నప్పటికీ దేశీయంగా ధరలు పెరుగుతుండటం విశేషం. మరో వైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి పతనమవడం బంగారం ధరలు పెరుగడానికి పరోక్షంగా కారణమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,500 డాలర్లకు చేరువైంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ క్రమంగా కోలుకుంటున్నట్లు జూలైలో జరిగిన ఫెడరల్ సమావేశం పూర్తి వివరాలు వెల్లడికావడంకావడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన తగ్గుముఖం పట్టిందని, దీంతో తమ ఇన్వెస్ట్‌మెంట్లను అతి విలువైన లోహాల వైపు మళ్లించినట్లు జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ హరీష్ వీ తెలిపారు. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,496.60 డాలర్లకు, వెండి 16.93 డాలర్లకు చేరుకున్నది.

పెరిగిన పసిడి దిగుమతులు

పసిడి దిగుమతులను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై మధ్య కాలంలో భారత్ 13.16 బిలియన్ డాలర్ల(రూ.92 వేల కోట్లు) విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకున్నది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో చేసుకున్న 11.41 బిలియన్ డాలర్లతో పోలిస్తే 15.4 శాతం అధిక మని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గతేడాదికిగాను జీడీపీలో క్యాడ్ 57.2 బిలియన్ డాలర్లు లేదా 2.1 శాతంగా ఉన్నది. అంతక్రితం ఏడాదిలో 1.8 శాతంగా ఉన్నది. ఈ ఏడాది తొలి నెల జనవరి నుంచి పసిడి దిగుమతుల్లో రెండంకెల వృద్ధి నమోదవుతున్నది. ఒక ఫిబ్రవరిలో మాత్రం 11 శాతం తగ్గాయి. ప్రపంచ పసిడి వినిమయంలో రెండో అతిపెద్ద దేశమైన భారత్‌లో ఆభరణాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రతియేటా 800 నుంచి 900 టన్నుల బంగారాన్ని డిమాండ్ చేసుకుంటున్నది. ఈ దిగుమతులను కట్టడి చేయడానికి ఈ ఏడాదికిగాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో దిగుమతి సుంకాన్ని 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచినప్పటికీ దిగుమతులు కట్టడి చేయడంలో విఫలమైంది.

ప్లాస్టిక్ నీటి బాటిళ్లతో దుస్తులు

ఆవిష్కరించిన క్లాసిక్ పోలో

హైదరాబాద్, ఆగస్టు 20: రెడిమేడ్ దుస్తుల సంస్థ క్లాసిక్ పోలో..మరో వినూత్న ఆవిష్కరణలకు తెరలేపింది. వ్యర్థమైన నీటి బాటిళ్లతో దుస్తులను రూపొందించింది. ఇలా తయారు చేసిన తొలి సంస్థ క్లాసిక్ పోలో కావడం విశేషం. 50 శాతం వరకు ప్లాస్టిక్ నీటి బాటిళ్లు, మిగతా 50 శాతం నూలుపొగులతో తయారు చేసిన దుస్తులను మంగళవారం ఆవిష్కరించింది. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్న ఈ దుస్తులు ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న వాటికంటే కాస్త ధర ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ఈ సందర్భంగా కంపెనీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ మాట్లాడుతూ..ప్లాస్టిక్ నీటి బాటిళ్లతో తయారు చేసిన దుస్తులతోపాటు వెదురుతో తయారు చేసిన దుస్తులను కూడా త్వరలో మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం దేశీయంగా ఫ్రాంచైజ్ పద్ధతిన 135 రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేసిన సంస్థ..ఈ ఏడాది చివరినాటికి వీటి సంఖ్యను 200కి పెంచుకోవాలని చూస్తున్నది. వీటిలో తెలుగు రాష్ట్రాల్లో 18 ఉండగా, వీటిని 35కి పెంచనున్నది. రూ.800 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగిన గ్రూపునకు ఈ క్లాసిక్ పోలో నుంచి రూ.160 కోట్లు లభిస్తున్నది.

ప్లాస్టిక్ నీటి బాటిళ్లతో తయారు చేసిన దుస్తులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

59

నిమిషాల్లో గృహ, వాహన రుణాలు

ప్రత్యేక సేవలను ఆరంభించిన ప్రభుత్వ బ్యాంకులు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: రుణాల పరిధిని మరింత పెంచుకోవడానికి ప్రభుత్వరంగ బ్యాంకులైతే ఏకంగా గృహ, వాహన రుణాలను 59 నిమిషాల్లో అందించడానికి ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించాయి. 'psbloansin59minutes' పోర్టల్ ద్వారా ప్రస్తుతం కోటి రూపాయల వరకు రుణాలను చిన్న, మధ్య స్థాయి వ్యాపారవేత్తలకు అందిస్తుండగా, ఈ పరిధిని రిటైల్ రుణాలకు వర్తించనున్నట్లు బ్యాంకులు ప్రకటించాయి. ఎస్బీఐతోపాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంకులు రూ.5 కోట్ల వరకు రుణాన్ని ఈ పోర్టల్ ద్వారా అందిస్తున్నాయి. గృహ, వాహన రుణాలను ఈ పోర్టల్ పరిధిలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సలీల్ కుమార్ స్వాన్ తెలిపారు. మరో బ్యాంకైన ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) కూడా ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నది. 59 నిమిషాల్లో సూత్రప్రాయంగా ఆమోదం లభించిన తర్వాత ఆయా సంస్థలకు 7 నుంచి 8 పనిదినాల్లో రుణం మంజూరుకానున్నది. ఎంఎస్ఎంఈలకు ఆర్థికంగా చేయూతనందించే ఉద్దేశంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ నవంబర్ 2018లో ఈ ప్రత్యేక సేవలను ఆరంభించారు. ఈ పోర్టల్ సేవలు ఆరంభించిన నాలుగు నెలల్లోనే రూ.35 వేల కోట్లకు పైగా రుణాలను మంజూరు చేసింది. మార్చి 31, 2019 నాటికి 50 వేల దరఖాస్తులు రాగా, వీటిలో 28 వేల ప్రతిపాదనలకు సూత్రప్రాయ అనుమతులు లభించాయి.

> వచ్చే మార్చి నాటికి ఇది రూ.200 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. అలాగే దేశవ్యాప్తంగా తెలుగు రాష్ట్రాల్లో రెడిమేడ్ దుస్తులకు డిమాండ్ అధికంగా ఉంటే ఇక్కడనే ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉందని సూచనప్రాయంగా చెప్పారు.

ఆదానీ చేతికి కృష్ణపట్నం పోర్ట్!

హైదరాబాద్, ఆగస్టు 20: ప్రముఖ వ్యాపారవేత్తల్లో ఒకటైన గౌతమ్ అదానీ కన్ను కృష్ణపట్నం పోర్టుపై పడింది. ఆయన నాయకత్వంలో నడుస్తున్న ఆదానీ గ్రూపు..కృష్ణపట్నం పోర్ట్ కంపెనీ లిమిటెడ్(కేపీసీఎల్)లో మెజార్టీ వాటాను కొనుగోలు చేయడానికి చర్చలు జరిగినట్లు పోర్ట్ ప్రమోటర్లకు చెందిన దగ్గరి వ్యక్తుల ద్వారా ఈ సమాచారం బయటకు పొక్కింది. ఒప్పందం విలువ రూ.5,500 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం ఓడరేవును నిర్వహిస్తున్నది సంస్థ. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య అంగీకార ఒప్పందం జరిగినట్లు తెలుస్తున్నది. కేపీసీఎల్‌లలో 72 శాతం వాటాను కొనుగోలు చేయడానికి అదానీ గ్రూపు ఆసక్తి చూపినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఉన్న కంపెనీ మార్కెట్ విలువ ప్రకారం ఈ ఒప్పందం విలువ రూ.5,500 కోట్ల స్థాయిలో ఉంటుందని ప్రాథమిక అంచనా. హైదరాబాద్‌కు చెందిన నవయుగ గ్రూపు ఈ కేపీసీఎల్‌ను ఏర్పాటు చేసింది. 2008లో ప్రారంభమైన ఈ కేపీసీఎల్..6800 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 41 మిలియన్ టన్నుల సరుకు ఎగుమతి అయింది. ఈ ఒప్పందం పూర్తైన తర్వాత ప్రస్తుతం కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న చింతా శశిధర్‌కు 28 శాతం వాటాతో అదే స్థానంలో కొనసాగే అవకాశాలున్నాయి.

సంక్షోభంలో బ్యాంకింగ్

వ్యాపారానికి ఆర్థిక మందగమనం సెగ

మళ్లీ పెరుగుతున్న మొండి బకాయిలు
- కొత్త రుణాలకు వెనుకడుగేస్తున్న బ్యాంకర్లు
- వ్యక్తిగత, సంస్థాగత లోన్లపై ప్రభావం



న్యూఢిల్లీ, ఆగస్టు 20:

దేశ ఆర్థిక వ్యవస్థ చుట్టూ సంక్షోభపు వలయాలు ఏర్పడుతున్నాయి. కీలక రంగాల్లో నెలకొన్న స్తబ్ధత.. ఇప్పుడు బ్యాంకింగ్ రంగానికి తాకుతున్నది. ఆర్థిక మందగమనం, ఉద్యోగాల కోతలు.. రుణ వితరణతోపాటు ఇప్పటికే ఉన్న రుణాల వసూలుకు ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయి. భారతీయ బ్యాంకింగ్ రంగాన్ని మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) ముప్పుతిప్పలు పెడుతున్న విషయం తెలిసిందే. బ్యాంకుల ఉనికినే ఇవి ప్రశ్నార్థకం చేస్తున్న క్రమంలో ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల వల్ల కొత్త రుణాలకు బ్యాంకులు సాహసించలేకపోతున్నాయి. దీంతో బ్యాంకింగ్ వ్యాపారం, రుణాల మంజూరు బాగా పడిపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తిగత, సంస్థాగత, రిటైల్ రుణాలపై ఈ ప్రభావం పెద్దఎత్తున ఉంటుందన్న ఆందోళనలు కనిపిస్తున్నాయి. జెట్ ఎయిర్‌వేస్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, అలోక్ ఇండస్ట్రీస్ వంటి భారీ సంస్థలు దివాలా తీయడం, వేలాది మంది ఉద్యోగులు ఉపాధిని కోల్పోవడం బ్యాంకర్లను కలవరపాటుకు గురిచేస్తున్నది. ఉద్యోగులు తీసుకున్న రుణాల భవితవ్యం అగమ్యగోచరంగా ఉన్నదిమరి. నిజానికి ప్రమాదకర స్థాయికి చేరుకున్న ఎన్‌పీఏల నుంచి ఇప్పుడిప్పుడే బ్యాంకులు కోలుకుంటున్నాయి. ఈ తరుణంలో మరో సంక్షోభం ముంచుకొస్తుందటం.. బ్యాంకింగ్ రంగానికే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకూ ఇబ్బందేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండేండ్ల క్రితం ఐటీ రంగంలో చోటుచేసుకున్న సంక్షోభం కంటే ఇప్పుడున్నది భిన్నంగా ఉందని ఇండస్ఇండ్ బ్యాంక్ ఎండీ రమేశ్ సోబ్టీ అన్నారు. నానాటికీ పరిస్థితులు దిగజారుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈవో ఆదిత్యా పూరీ అన్నారు.

క్షీణించిన వినియోగ సామర్థ్యం

వినియోగదారుల కొనుగోళ్ల శక్తి దెబ్బతినడం కూడా ప్రస్తుత ఆర్థిక మందగమనానికి ఓ కారణంగా అభివర్ణిస్తున్నారు నిపుణులు. మారిన ఆర్థిక ముఖచిత్రంతో గృహ, ఆటో, వ్యక్తిగత రుణాలు తగ్గిపోయాయని బ్యాంకర్లే చెబుతున్నారు. అమ్మకాలు లేక ఆటో రంగం భీకర సంక్షోభానికి లోనవగా, 10 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని భారతీయ ఆటోమోటివ్ కంపోనెంట్ తయారీదారుల సంఘం హెచ్చరికలు చేస్తున్న విషయం తెలిసిందే. దాదాపు 20 ఏండ్ల కనిష్ఠానికి విక్రయాలు పతనమవగా, ప్యాసింజర్ వాహన అమ్మకాలు భారీగా దిగజారాయి. దీంతో చివరకు సరైన సెక్యూరిటీ లేకుండా డీలర్లకూ రుణాలు దొరుకడం లేదని కొటక్ మహీంద్రా బ్యాంక్ చీఫ్ ఉదయ్ కొటక్ అన్నారు. ఈ ఏడాది జనవరి–మార్చిలో దేశ జీడీపీ ఐదేండ్ల కనిష్ఠానికి పతనమవగా, ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంకుల నుంచి రుణాలూ తగ్గిపోయాయి. దీంతో రుణ లభ్యత లేక వ్యాపార, పారిశ్రామిక రంగాలు కుదేలైపోగా, క్షీణించిన వినియోగ సామర్థ్యంతో అమ్మకాలూ పడిపోయి సంక్షోభం ముదురుతున్నది.

భవిష్యత్తు అయోమయం!

కార్పొరేట్ రంగమైనా.. రిటైల్ రంగమైనా వాటికిచ్చే రుణాలు ఆయా రంగాల పనితీరుపైనే ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలు మందగమనంలోనే ఉండటంతో బ్యాంకుల నుంచి రుణాలూ తగ్గాయి. దీంతో అటు బ్యాంకింగేతర రంగాలు, ఇటు బ్యాంకింగ్ రంగం రెండింటి భవిష్యత్తు అయోమయంలో పడ్డాయి. ముఖ్యంగా ఆటో, నిర్మాణ రంగాలు కుదేలైపోతుండగా, రుణాలు ఇస్తామన్నా ఎవరూ తీసుకోవడం లేదని ఇటీవలే ఎస్బీఐ చైర్మన్ రజ్నీశ్ కుమార్ స్పష్టంచేసిన సంగతి విదితమే. దీంతో రుణాలపై వినియోగదారుల్లోనే ఆసక్తి తగ్గిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఆర్థిక పరిస్థితులు కుదుటపడ్డాకగానీ కొనుగోళ్లకు వెళ్లవదన్న నిర్ణయానికి కొనుగోలుదారులు వచ్చినట్లు మార్కెట్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. బ్యాంకులు సైతం రుణాలు కావాలని వచ్చేవారి మొత్తం స్థితిగతులను పరిశీలించిగానీ రుణాలను మంజూరు చేయడం లేదు. వ్యక్తిగతంగానైనా, సంస్థాగతంగానైనా చాలా జాగ్రత్తలు వహిస్తున్నాయి. వ్యక్తిగతంగా రుణం ఆశించేవారి.. ఉద్యోగం, జీతం, చేస్తున్న పని, సంస్థలను గమనించి బ్యాంకులు ముందుకొస్తున్నాయి. అలాగే సంస్థాగతంగానైతే ఆయా రంగాలనుబట్టి నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఇక ప్రస్తుత పరిస్థితుల్లో సిబిల్ స్కోరు బాగున్నా రుణాలను ఇవ్వలేమని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ ఆదిత్యా పురి అంటుండటం తాజా భయానక పరిస్థితులకు అద్దం పడుతున్నది.

ముందున్నది అసలు మాంద్యం

అసలు మాంద్యం ముందున్నదని బజాజ్ ఫైనాన్స్ హెచ్చరించింది. మొండి బకాయిలు పెరుగుతాయన్న భయాలతో బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు రుణాలకు దూరంగా ఉంటున్నాయని బజాజ్ ఫైనాన్స్ ఎండీ, సీఈవో రాజీవ్ జైన్ తెలిపారు. ఆర్థిక సంక్షోభం కారణంగా ఆస్తుల విలువలు గణనీయంగా పడిపోతున్నాయని, దీంతో రుణాలు ఇచ్చేందుకు ఇటు బ్యాంకులు, అటు ఎన్‌బీఎఫ్‌సీలు వెనుకాడుతున్నాయని అన్నారు. ఇక యువకులకైతే రుణాలు ఇవ్వడమే లేదని, తాము 25 ఏండ్ల లోపు వయసున్నవారికి లోన్లు మంజూరు చేయడం లేదని జైన్ అన్నారు. మొత్తానికి తాము మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం రుణాల విషయంలో ఆచితూచి అడుగులేస్తుండగా, సెక్యూరిటీ లేని రుణాలు, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల బకాయిల విషయంలో నిబంధనలను మార్చుతున్నది. దీంతో ఇప్పుడు రుణం అంత సులభంగా రాదన్న అంచనాలు నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. గృహ, వాహన రుణాలు కష్టమేనన్న ఆందోళన వారిలో కనిపిస్తున్నది.

30 వేల ఉద్యోగాలు ఔట్

దేశ ఆర్థిక వ్యవస్థపైనేగాక.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పుడు తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్ రంగంపై భయాలు నెలకొన్నాయి. ఈ ఏడాది బ్యాంకింగ్ రంగంలో 30 వేల ఉద్యోగాలు పోయేందుకు ఆస్కారముందని తెలుస్తున్నది. ఆర్థిక మందగమనం, ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు, వ్యయ నియంత్రణ, వడ్డీరేట్ల పతనం వంటి కారణాలు, లక్ష్యాలు, ప్రాధాన్యత అంశాలు ఇందుకు దారి తీస్తున్నాయి. డ్యూషే బ్యాంక్ 18 వేల ఉద్యోగాలను తొలగిస్తామని ప్రకటించగా, బార్క్‌లేస్ 3 వేలు, సొసైటీ జనరెలి 1,600 మేర ఉద్యోగులను తొలగించే వీలున్నది. సిటీ గ్రూప్ సైతం వందలాది మంది ఉద్యోగులను తీసేయాలని పావులు కదుపుతున్నది. బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న కొనుగోళ్లు, కుదురుతున్న విలీనాలు సైతం ఉద్యోగుల కోతకు కారణమవుతున్నాయని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

చైనాకు హైదరాబాద్ ఔషధాలు

- తెలంగాణ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో సీఐబీసీ శాశ్వత కార్యాలయం
- మా దేశంలో పరిశ్రమల స్థాపనకు రావాలంటూ చైనా పిలుపు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఔషధ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి చైనా పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ ఫార్మా సిటీలో పరిశ్రమల స్థాపనకు ఆ దేశ పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తవుతున్న ఔషధాలను దిగుమతి చేసుకోవడానికీ చైనా సిద్ధమవుతున్నది. ఈ క్రమంలోనే తెలంగాణ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో శాశ్వతంగా తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని చైనా–ఇండియా బిజినెస్ కౌన్సిల్ (సీఐబీసీ) నిర్ణయించింది. తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌టీపీసీ), బల్క్ డ్రగ్స్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ (బీడీఎమ్ఏఐ), చైనా–ఇండియా ఫార్మా ట్రేడ్ సెంటర్‌లతోపాటు చైనాలోని చాంగ్‌షా, హునాన్ ప్రావిన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ, చైనా అధికారుల మధ్య మంగళవారం హైదరాబాద్‌లో ప్రత్యేక అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐబీసీ, సీఐపీటీసీ చైర్మన్ ప్రొఫెసర్ జాక్ షెంగాయి మాట్లాడుతూ హైదరాబాద్.. ఔషధ పరిశ్రమలకు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడ మౌలిక సదుపాయాలు బాగున్నాయని కితాబిచ్చారు. తెలంగాణలో ఉత్పత్తయిన ఔషధాలను దిగుమతి చేసుకోవడానికి తమ దేశం అనుమతిని చ్చిందని ఆయన వివరించారు. కాగా, తమ దేశంలోని చాంగ్‌షా, హునాన్ ప్రావిన్స్‌లో పరిశ్రమల స్థాపనకు తెలంగాణవారికి పూర్తి అవకాశాలుంటాయని తెలిపారు. ఇందులో భాగంగానే చాంగ్‌షాకు రావాలని తెలంగాణ అధికారులను ఆహ్వానించారు. అక్కడ పరిశ్రమలు స్థాపించదలుచుకునే వారికి అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు టీఎస్‌టీపీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ నర్సింహా రెడ్డి చైనా ప్రతినిధులతో సమావేశమయ్యారు.

సామ్‌సంగ్ నోట్ 10, 10ప్లస్

ప్రీమియం సెగ్మెంట్‌లోకి సరికొత్త గెలాక్సీ ఫోన్లు • ప్రారంభ ధర: రూ. 69,999

బెంగళూరు నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి: దేశీయ మార్కెట్‌కు గెలాక్సీ నోట్ 10 స్మార్ట్‌ఫోన్లను సామ్‌సంగ్ పరిచయం చేసింది. మంగళవారం నోట్ 10, 10ప్లస్‌లను ముందుకు తెచ్చింది. బెంగళూరులోని ఒపెరాహౌస్‌లో సామ్‌సంగ్ నైరుతీ ఆసియా అధ్యక్షుడు, సీఈవో హెచ్‌సీ హంగ్ ఈ రెండు వేరియంట్లను ఆవిష్కరించారు. ఈ నెల 23 నుంచి ఇవి వినియోగదారులకు అందుబాటులో ఉండనుండగా, నోట్ 10 ధర రూ. 69,999గా, 10ప్లస్ ధర రూ.79,999గా ఉన్నాయి. ఈ సందర్భంగా హంగ్ మాట్లాడుతూ.. స్మార్ట్ ఫోన్ విభాగంలో ఇప్పటికే అగ్రగామిగా ఉన్న సామ్‌సంగ్.. ఈ గెలాక్సీ నోట్ 10తో 65 శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకోగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ ఫోన్లలో 'ఎస్ పెన్'తో సరికొత్త అనుభూతిని వినియోగదారులు పొందుతారని చెప్పారు. 6.8 అంగుళాల స్క్రీన్ ఉన్న నోట్ 10ప్లస్ స్మార్ట్‌ఫోన్‌లో రెండు రకాలుండగా 12జీబీ ర్యామ్, 256 జీబీ ఇంటర్నల్ మెమరీతో ఒకటి, 12జీబీ ర్యామ్ 512జీబీ మెమరీతో మరొకటి ఉన్నాయి. బ్యాటరీ సామర్థ్యం 4,300 మెగాహెట్జ్. ఇక నోట్ 10లో స్క్రీన్ 6.3 అంగుళాలు, ర్యామ్ 8జీబీ, మెమరీ 256జీబీ ఉంటుంది. 3,500 మెగాహెట్జ్ బ్యాటరీ ఉన్నది. రెండింటిలోనూ ఓ 16 మెగాపిక్సల్, రెండు 12 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరాలున్నాయి. 10 మెగాపిక్సల్ ఫ్రంట్ కెమెరాలూ ఉన్నాయి. కాగా, హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్, డెబిట్ కార్డుపై కొనుగోలు చేసిన వారికి రూ.6 వేలు క్యాష్ బ్యాక్, ఆన్‌లైన్‌లో ఐసీఐసీఐ కస్టమర్లకు రూ.6 వేల క్యాష్‌బ్యాక్ ఆఫర్ ఉంది. అదే విధంగా సామ్‌సంగ్ షోరూంలు, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా కూడా బుకింగ్ చేసుకోవచ్చు.

డీఆర్ఐ అధికారులు పట్టుకొన్న సౌదీ రియాల్స్

విమానాశ్రయంలో విదేశీ కరెన్సీ పట్టివేత

- ఉస్మానియా బిస్కెట్ ప్యాకెట్లు, స్వీట్ బాక్సుల్లో నోట్లు
- రూ.1.48 కోట్ల విలువైన సౌదీ రియాల్స్ పట్టివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/శంషాబాద్: స్మగ్లర్లు వేసే ఎత్తులను ఎప్పటికప్పుడు చిత్తు చేస్తున్నారు డీఆర్ఐ అధికారులు. తాజాగా భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని తరలించేందుకు యత్నించిన ఇద్దరిని విమానాశ్రయంలో పట్టుకున్నారు. స్వీట్‌బాక్సులు, ఉస్మానియా బిస్కెట్ ప్యాకెట్లలో సౌదీ రియాల్స్ తరలిస్తుండగా డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ అదనపు డైరెక్టర్ జనరల్ డీపీ నాయుడు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్‌కి వెళ్తున్న ఇద్దరు ప్రయాణికులు పెద్దమొత్తంలో విదేశీ కరెన్సీని తరలిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం 2.50 గంటలకు ఇండిగో, రాత్రి 8-10 గంటలకు ఎయిర్‌ఇండియా విమానాల్లో దుబాయ్‌కు వెళ్లేందుకు ప్లాన్ వేసుకున్నారు. డీఆర్ఐ అధికారులు అడ్డుకొని చెక్‌ఇన్ లగేజీని తనిఖీచేసి స్వీట్‌బాక్స్‌లు, ఉస్మానియా బిస్కెట్ ప్యాకెట్ల అడుగున ప్రత్యేక అమరికలో సౌదీ రియాల్స్ కట్టలను గుర్తించారు. మొత్తం రూ.1,48,75,000 విలువైన విదేశీ కరెన్సీ పట్టుబడింది. కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేసినట్టు డీఆర్ఐ అధికారులు పేర్కొన్నారు.

నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలోని హుండీలను మంగళవారం అధికారులు లెక్కించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన హుండీ లెక్కింపు సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. హుండీ లెక్కింపులో అమ్మవారికి నగదు రూపంలో రూ. 41,97,169 సమకూరాయి. మిశ్రమ వెండి రెండు కిలోల 850 గ్రాములు, మిశ్రమ బంగారం 70 గ్రాములు, విదేశీ కరెన్సీ 13 డాలర్లు లభించాయి. ఈ మొత్తం ఆదాయం 46 రోజుల్లో సమకూరినట్టు ఆలయ ప్రత్యేకాధికారి వినోద్‌రెడ్డి తెలిపారు.

- బాసర

కె జైసే తుఝ్‌కో బులాయా గయా హై..

విలక్షణ సంగీత దర్శకుడు ఖయ్యాం కన్నుమూత

ప్రముఖుల నివాళి.. ముంబైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ఎక్కడో తారల మధ్య తారాడేవాడు.. మనకోసం భువిపైకి వచ్చి.. జీవితాంతం పాడుకునేందుకు గుప్పెడు మధుర స్వరాలు కానుకగా సమకూర్చి.. మళ్లీ గగనసీమలకేగాడు! కథానాయికల కన్నులకు దీటుగా తన బాణీలతో మత్తుమందు జల్లిన అలనాటి విలక్షణ స్వరకారుడు.. ఇకలేడు! పదాలకు సంగీతాన్ని సమకూర్చే సంగీత దర్శకులున్న రంగంలో.. కవిత్వానికి స్వరాలు సమకూర్చిన దిగ్గజం.. ఇక సెలవన్నాడు! 'కభీ..కభీ మేరే దిల్ మే.. ఖయాల్ ఆతా హై.., ఆజారే ఓ మేరి దిల్‌బర్.., జీత్ లేంగే బాజీ హమ్ తుమ్.., హజార్ రాహే ముడ్ కే దేఖే., ఆయ్ దిలే నాదాన్.., కరోగే యాద్ తో.., దిఖాయి దియే యూన్...' వంటి అనేక అలనాటి బాలీవుడ్ విరహ, రొమాంటిక్ గీతాలతో తనదైన అధ్యాయాన్ని సృష్టించుకుని.. 'స్వర'మరుగైపోయాడు!

భార్య జగ్జీత్ కౌర్‌తో ..

మేయిస్త్రో అవార్డును స్వీకరించిన సందర్భంగా షబానా అజ్మీ, బప్పీ లహరీలతో..

ముంబై, ఆగస్టు 20: ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు ఖయ్యాం (93) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం రాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఖయ్యాం మృతదేహానికి మంగళవారం ముంబైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఖయ్యాం మృతిపట్ల ప్రధాని నరేంద్రమోదీతోపాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. బాలీవుడ్ సంగీత సామ్రాజ్యంలో ఏడు దశాబ్దాలపాటు తనదైన విలక్షణ పాత్ర పోషించిన ఖయ్యాం పూర్తి పేరు మహ్మద్ జహూర్ ఖయ్యాం హష్మి. బ్రిటిష్ పాలనలోని పంజాబ్ రాష్ట్రం జలంధర్ సమీపంలోని రహాన్‌లో 1927 ఫిబ్రవరి 18న జన్మించారు. స్వతహాగా సంగీతం, సాహిత్యం పట్ల మక్కువ ఉన్న ఖయ్యాం తండ్రి.. తన పిల్లలను జలంధర్‌కు తీసుకెళ్లి సినిమాలు చూపించేవారు. ఖయ్యాం తండ్రికి దేశంపైనా ఎనలేని అభిమానం. అది ఎంతగా అంటే.. దేశ స్వాతంత్ర్యంకోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ పుట్టిన ఊరు మీదుగా రైల్లో వెళుతున్నప్పుడు నిలబడి సెల్యూట్ చేయాలని తన పిల్లలకు చెప్పేంత! దీంతో ఖయ్యాం చిన్నప్పటి నుంచే సంగీతంతోపాటు దేశంపట్ల అభిమానం పెంపొందించుకున్నారు. చదువులో రాణించలేకపోవడంతో 11 ఏండ్ల వయసులోనే ఇంట్లో చెప్పకుండా ఢిల్లీకి వెళ్లి.. మేనమామ ఆశ్రయం పొందారు. ఆయన.. పండిట్ హుస్న్‌లాల్, పండిత్ భగత్ రాముందర్ వద్దకు తీసుకెళ్లారు. ఖయ్యాం వారి వద్ద ఐదేండ్లపాటు శిక్షణ పొందారు. తన ప్రతిభను చాటుకునేందుకు ప్రయత్నించినా చిన్నవయసు కావడంతో నాటి సంగీత ప్రముఖుల దృష్టిని ఆకట్టుకోలేకపోయారు. చివరకు ఓ స్నేహితుడు ఖయ్యాంను లాహోర్‌లోని ప్రముఖ స్వరకర్త గుల్షమ్ అహ్మద్ చిస్తీ (చిస్తీ బాబా) వద్దకు తీసుకెళ్లాడు. ఖయ్యాం పాటతో ముగ్ధుడైన చిస్తీబాబా.. తన సహాయకుడిగా చేర్చుకునేందుకు అంగీకరించారు. అయితే.. జీతం ఇవ్వబోనని చెప్పాడు. కొన్ని రోజులకు ఖయ్యాం వద్ద డబ్బులు అయిపోయాయి. అన్న వద్దకు సాయంకోసం వెళితే.. చదువుతోపాటు సంపాదనా లేదంటూ కోపంతో ఖయ్యాం చెంపపై కొట్టాడు. అది తన జీవితంలో మరిచిపోని ఘటనగా ఖయ్యాం చెప్పేవారు. ఆ రాత్రి.. ఆత్మహత్య చేసుకోవాలనిపించిందని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

సైన్యంలోనూ సేవలు

సోదరుడి మాటలకు తట్టుకోలేకపోయిన ఖయ్యాం సైన్యంలో చేరారు. లాహోర్, రావల్పిండి, పూణె యూనిట్లలో పనిచేశారు. ఆ సమయంలో తన పాటలతో తోటిసైనికులను అలరించేవాడు. ఉన్నతాధికారులు ప్రత్యేక సందర్భాల్లో ఆయనతో పాటలు పాడించేవారు. సైన్యంలో ఉన్నా మనసంతా సంగీతంపైనే ఉండేది. ఎప్పటికైనా కేఎల్ సైగల్ అంతటివాడిని కావాలనేదే ఆయన ఆకాంక్ష! మూడేండ్ల సర్వీసు అనంతరం సైన్యాన్ని వీడిన ఖయ్యాం.. తిరిగి చిస్తీబాబా చెంతకు చేరారు. ఆయన ప్రతిభను గుర్తించిన సినీ నిర్మాత బీఆర్ చోప్రా.. ఇతరుల మాదిరిగా వేతనం ఇవ్వాలని చిస్తీబాబాకు సూచించారు. ఖయ్యాం తొలి సంపాదన నెలకు రూ.125! క్రమంగా సంగీతంపై పూర్తిస్థాయిలో పట్టుసాధించిన ఖయ్యాం.. 1947లో తనలాగే చిస్తీబాబా అనుచరుడైన రెహ్మాన్‌తో కలిసి ముంబైకి వచ్చారు. దేశంలో తొలి సంగీత దర్శక జంటగా పేరుగాంచిన హుస్న్‌లాల్, పండిత్ భగత్‌రామ్‌ను కలిశారు. దీంతో ఖయ్యాం దశ మారిపోయింది. హీర్ రజ్జా చిత్రానికి రెహ్మాన్‌తో కలిసి శర్మాజీవర్మాజీ అనే మారుపేరుతో తొలిసారి నేపథ్య సంగీతం అందించారు. దేశ విభజనతో రెహ్మాన్ పాకిస్థాన్‌కు వెళ్లిపోగా.. ఖయ్యాం భారత్‌లోనే ఉండి.. శర్మాజీ పేరుతో సంగీత దర్శకుడిగా కొనసాగారు. బీవీ (1948) చిత్రంలో మహ్మద్ రఫీ పాడిన 'అఖేలే మై..' గజల్‌తో పాపులర్ అయ్యారు. 1952లో స్నేహితుల సలహాతో 'ఖయ్యాం' పేరుతో సంగీత దర్శకత్వానికి స్వీకారం చుట్టి దూసుకుపోయారు. 'షామ్ ఏ ఘమ్ కి కసమ్..' పాటకు అందించిన సంగీతంతో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. లాలా రుఖ్ (1958), షోలా ఔర్ షబ్నం (1961), షాగూన్(1964), ఆఖరి ఖత్ (1966), కభీ కభీ (1972), నూరీ (1979), ఉమ్రావ్ జాన్ (1981), రజియా సుల్తాన్ (1983), బాజార్ (1982) వంటి పలు హిట్ చిత్రాలకు సంగీతం అందించారు. పలు చిత్రాలకు ఫిలింఫేర్ అవార్డులు దక్కాయి. 2007లో సంగీత నాటక అకాడమి అవార్డు వరించింది. 2011లో పద్మభూషణ్ అవార్డుతో ప్రభుత్వం సత్కరించింది. ఖయ్యాం భార్య జగ్జీత్‌కౌర్ కూడా మంచి గాయని. ఒక విధంగా బాలీవుడ్ ఇండస్ట్రీలో రెండు మతాలకు చెందినవారి వివాహాల్లో బహుశా వీరిదే మొదటిది. తన భార్య అద్భుతమైన గాయని అయినప్పటికీ.. తనకుతానుగా ఖయ్యాం ఏ నిర్మాతనూ తన భార్యకు అవకాశం ఇవ్వాలని కోరకపోవడం విశేషం. ఖయ్యాం చేసింది 57 సినిమాలే. తన సమకాలీన సంగీత దర్శకుల మాదిరిగా తాను సైతం 200కుపైగా సినిమాలకు సంగీతం అందించగలిగేవాడినని, కానీ.. నాణ్యతపై రాజీపడకపోవడం వల్లే అన్ని సినిమాలు చేయలేదని ఒక సందర్భంలో చెప్పారు. సాధారణంగా పాటకు బాణీలు కట్టేటప్పుడు సంగీత దర్శకులు.. ఆ పాట సందర్భాన్ని తెలుసుకుంటారు. కానీ.. ఖయ్యాం.. ఆ సినిమా స్క్రిప్ట్ మొత్తాన్నీ చదివి.. ఆ పాటలకు అభినయించే నటీనటులు ఎవరో తెలుసుకుని మరీ బాణీలు కట్టేవారు.

దైవశక్తే నాతో స్వరాలు పలికిస్తుంది..

ఖయ్యాం బాణీలు, స్వరాలు ఆ చిత్ర నటీనటుల సహజత్వానికి దగ్గరగా, జానపద నేపథ్యంలో మిళితమై ఉండేవి. దీంతో ఖయ్యాం సంగీతం అంటే నేటికీ సంగీత ప్రియులు చెవికోసుకుంటారు. అయితే ఆయన ఏ వాయిద్య పరికరంపై ఇంతటి మధురమైన బాణీలు, స్వరాలు సమకూర్చేవారన్నది పెద్ద రహస్యంగానే ఉండిపోయింది. ఎందుకంటే ఆయన ఎలాంటి వాయిద్య పరికరాలు వినియోగించేవారు కాదు. తన స్టైలే వేరని.. దైవ శక్తే తనతో స్వరాలు పలికిస్తుందని ఖయ్యాం చెప్పేవారు. భార్య జగ్జిత్ కౌర్‌తో చర్చించి సంగీతానికి తుది రూపు ఇచ్చేవారు. తనకు దక్కిన కీర్తిలో సగం భార్యకు చెందుతుందని అనేవారు. తమ ఇద్దరి పేర్లు కలిసేలా 'ఖయ్యం జగ్జిత్‌కౌర్'తో సంగీతానికి దర్శకత్వం వహించాలని భావించినా జగ్జిత్ కౌర్ ఒప్పుకోలేదు.

కళాకారులను ఆదుకునేందుకు ట్రస్ట్

ఖయ్యాం, కౌర్ దంపతులకు ప్రదీప్ అనే కుమారుడు ఉండేవాడు. 2012లో గుండెపోటుతో చనిపోయాడు. అందరికీ చేదోడుగా ఉండే తమ కుమారుడి స్ఫూర్తితో ఖయ్యాం దంపతులు 2016లో 'ఖయ్యాం జగ్జిత్‌కౌర్' పేరుతో ఒక చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేశారు. దీనికోసం వారి ఆస్తులన్నీ అమ్మి రూ.10 కోట్లు కూడబెట్టి బ్యాంకులో జమచేశారు. దీని ద్వారా వచ్చిన వడ్డీ ఆదాయంతో ప్రతి ఏటా పేద కళాకారులు, సహాయం కోరినవారికి అండగా నిలిచారు. తాము లేకపోయినా ట్రస్ట్ కొనసాగుతుందని చెప్పేవారు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న సైబరాబాద్ హోంగార్డుల సంఘం ప్రతినిధులు

సమస్యలు పరిష్కరించండి

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు హోంగార్డు ప్రతినిధుల వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమస్యల పరిష్కారానికి చొరువ తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి, రాష్ట్ర హోంగార్డ్స్ సంఘం గౌరవాధ్యక్షుడు వీ శ్రీనివాస్‌గౌడ్‌ను సైబరాబాద్ హోంగార్డు సంక్షేమసంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆరోగ్య భద్రత, కారుణ్య నియామకాలు, పదవీవిరమణ పొందిన హోంగార్డులకు ఆర్థికసాయం, డ్రెస్ అలవెన్స్ సహా పలు సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వినతిపత్రం సమర్పించినవారిలో సైబరాబాద్ హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం అశోక్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్మథరావు, సభ్యుడు బీ గోపాల్ తదితరులు ఉన్నారు.

దేశ పర్యాటక అభివృద్ధిపై చర్చ

ఢిల్లీలో సమావేశమైన రాష్ట్రాల పర్యాటకశాఖల మంత్రులు, అధికారులు

సీ పార్థసారథి, మనోహర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర పర్యాటక శాఖ మంగళవారం ఢిల్లీలోని అశోకా హోటల్‌లో రాష్ట్రాల పర్యాటక శాఖల మంత్రులు, కార్యదర్శులు, ఇతర సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశాన్ని కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ ప్రారంభించారు. దేశంలో పర్యాటకరంగ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. తెలంగాణ తరఫున ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, టీఎస్‌టీడీసీ ఎండీ బీ మనోహర్ పాల్గొన్నారు.

టైటిల్ వివాదానికి లోబడి పాస్‌పుస్తకాలు

ప్రతాప్ జంగిల్ రిసార్ట్స్ కేసులో హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం ఖానాపూర్ గ్రామంలో ప్రతాప్ జంగిల్ రిసార్ట్స్‌కు ఉన్న 20 ఎకరాల భూమికి ఈ-పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీచేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే భూమిపై హక్కులు మాత్రం.. ప్రభుత్వానికి, కంపెనీకి మధ్య కొనసాగుతున్న టైటిల్ వివాదంపై తుది తీర్పునకు లోబడి ఉంటాయని చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం తన ఉత్తర్వులో స్పష్టంచేసింది. ఈ భూమిపై 1998 నుంచి రెవెన్యూశాఖకు, కంపెనీకి మధ్య వివాదం కొనసాగుతున్నది. 1998లో తాము ఆ భూమిని కొనుగోలుచేసినట్టు కంపెనీ చెప్తుండగా.. అది ప్రభుత్వ భూమి అని రెవెన్యూశాఖ పేర్కొంటూ.. దాని కొనుగోళ్లు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్‌పై నిషేధం విధించింది.

వ్యాపారి గన్నె శ్రీనివాసరావు కేసులో రూ.2.42 కోట్ల ఆస్తులు అటాచ్

బ్యాంకు రుణాల ఎగవేతపై ఈడీ దర్యాప్తు వేగవంతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్యాంకుల నుంచి రూ.25.50 కోట్ల రుణాలు తీసుకుని మోసగించిన కేసులో వ్యాపారి గన్నె శ్రీనివాసరావుకు చెందిన రూ.2.42 కోట్ల విలువైన స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేసింది. వీటిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవసాయ భూములు, ప్లాట్లు ఉన్నాయని, ఈ ఆస్తులన్నీ శ్రీనివాసరావుతోపాటు అతడి తల్లి మణికుమారి, ఆయన బంధువు నందిగామ నవీన్ కుమార్ పేరిట ఉన్నాయని ఈడీ అధికారులు తెలిపారు. బ్యాంకులను మోసగించాలన్న ఉద్దేశంతోనే శ్రీనివాసరావు.. ఇండ్లు, వాహనాల కొనుగోలు కోసం తనతోపాటు తన కంపెనీలు, బంధువుల పేరిట ఈ రుణాలను తీసుకున్నాడని, ఇందుకోసం దుర్గా స్టీల్స్, డెల్టా అయాన్ ఎక్స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చర్స్ లిమిటెడ్, మహవీర్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, శరవణ మోటార్స్, శరవణ ఇండస్ట్రీస్, సుబ్రహ్మణ్యం ఇండస్ట్రీస్, మురుగన్ ఇండస్ట్రీస్ పేర్లతో కుటుంబసభ్యులు, బంధువుల పేరిట ఖాతాలు తెరిచి తప్పుడు ధ్రువపత్రాలతో బ్యాంకులను మోసగించినట్టు గుర్తించడంతో కేసు దర్యాప్తును వేగవంతం చేశామని ఈడీ అధికారులు వివరించారు.

గూగుల్‌కు హైకోర్టు నోటీస్

పోర్న్‌సైట్ నుంచి తన పేరు తొలిగించడంలేదని ఓ యువతి పిటిషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గూగుల్‌లో అందుబాటులో ఉన్న ఓ పోర్న్‌సైట్‌లో ఇంటి పేరుతో కలిపి తన పేరు కనిపిస్తున్నదని, దీనివల్ల తన పరువు ప్రతిష్ఠలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని ఓ యువతి హైకోర్టును ఆశ్రయించారు. 2017లో కూడా ఇలాగే పోర్న్‌సైట్‌లో పేరు కనిపించగా అదే ఏడాది ఫిబ్రవరిలో తాను గూగుల్ సంస్థకు ఫిర్యాదు చేశానని, అప్పుడు దానిని తొలిగించారని పిటిషనర్ తెలిపారు. తాజాగా ఈ ఏడాది మళ్లీ అదే సైట్‌లో పేరు కనిపిస్తున్నదని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. బెంగళూరులోని గూగుల్ ప్రధాన కార్యాలయంతోపాటు హైదరాబాద్‌లో గూగుల్ కార్యాలయానికి నోటీసులు జారీచేసింది. ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలు తెలుపాలని ఆదేశించి.. విచారణను నాలుగు వారాలపాటు వాయిదా వేసింది.

కేసీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని పాదయాత్ర

సెప్టెంబర్ 5న ప్రారంభిస్తాం: టీఆర్ఎస్‌వీ నాయకుడు బీటెక్ తేజ

కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 5 నెలలుపాటు కొనసాగనున్న యాత్ర

సీఎం కేసీఆర్‌తో టీఆర్ఎస్‌వీ నేత బీటెక్ తేజ (ఫైల్)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు భారతరత్న పురస్కారాన్ని ప్రదానం చేయాలనే డిమాండ్‌తో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్టు టీఆర్ఎస్‌వీ నాయకుడు బీటెక్ తేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కన్యాకుమారిలో ఈ పాదయాత్రను ప్రారంభిస్తానని తెలిపారు. దాదాపు 3,500 కిలోమీటర్ల మేర 5 నెలలపాటు కొనసాగనున్న యాత్ర కశ్మీర్‌లో ముగుస్తుందని, యాత్ర హైదరాబాద్‌కు చేరిన తర్వాత సీఎం కేసీఆర్‌ను కలుసుకుంటానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ నామకోటి పుస్తకాలను ఆయనకు అందజేస్తానని చెప్పారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన తీరు, రాష్ట్రంలో ఉత్తమ పాలనను అందించడం ద్వారా నంబర్ 1 ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందిన అంశాలతోపాటు ఆయన అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. బీటెక్ తేజతోపాటు నాంపల్లికి చెందిన ఏ ధర్మతేజ, అబిడ్స్ ఎస్సీ హాస్టల్‌కు చెందిన సీహెచ్ సాయికుమార్, పవన్, గణేశ్ పాదయాత్రలో పాల్గొననున్నట్టు పేర్కొన్నారు.

వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా చూడాలి
- పరిశ్రమలొస్తే వెదురు సాగుకు రైతుల ఆసక్తి
- ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి

వెదురు ఉత్పత్తుల తయారీపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యాన-పట్టుపరిశ్రమలశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, పాల్గొన్న ఎంఎస్ఎంఈ, బాంబూ సొసైటీ సభ్యులు, ఉద్యాన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వెదురును ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగడంతోపాటు పర్యావరణ సమతుల్యత, గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఉద్యాన-పట్టుపరిశ్రమలశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఉద్యాన శిక్షణ సంస్థలో రాష్ట్రంలో వెదురు పరిశ్రమ, ఉత్పత్తుల తయారీ అవకాశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వెదురు పరిశ్రమ నిర్వహణకు ప్రస్తుతం మిజోరాం, అస్సాం, త్రిపుర రాష్ట్రాల నుంచి వెదురును దిగుమతి చేసుకుంటున్నట్టు తెలిపారు. తెలంగాణలో ఔత్సాహికులు వెదురు సంబంధ పరిశ్రమలను ఏర్పాటుచేస్తే ఇక్కడ వెదురుసాగుకు రైతులు ఆసక్తి చూపిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనిల్ ఎంటర్‌ప్రైన్యూర్ మధ్యప్రదేశ్‌కు చెందిన రోహిత్ అగర్వాల్ లాభదాయకమైన వెదురు పరిశ్రమలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అగర్‌బత్తిల తయారీ, వెదురు పొడి, చార్కోల్ తయారీ, వెదురు ఫర్నీచర్- అలంకరణ వస్తువుల తయారీ, వెదురు హస్తకళల తయారీ- వాటి ఉపయోగాలు, హౌసింగ్-ఇంటీరియర్ పరిశ్రమ కోసం వెదురు సరఫరా వంటి ఐదు లాభదాయకమైన పరిశ్రమలపై చర్చించారు. సమావేశంలో మహీంద్రా కమ్యూనిటీ సభ్యులు, ఔత్సాహికులు, ఎంఎస్ఎంఈ, బాంబూ సొసైటీ సభ్యులు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

ఏపీ అసెంబ్లీ ఫర్నిచర్ మాయం

తన ఇంటికే తీసుకువెళ్లానన్న టీడీపీ నేత, మాజీ స్పీకర్ కోడెల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఫర్నిచర్ మాయమైన అంశంలో తెలుగుదేశం పార్టీ ఇరకాటంలో పడింది. ఫర్నిచర్‌ను తన ఇంటికే తీసుకెళ్లానని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో తాత్కాలిక అసెంబ్లీ ఏర్పాటుచేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీలో నుంచి సామాన్లను ఏపీకి తరలిస్తుండగా విలువైన ఫర్నిచర్ మాయమైంది. ఇటీవల వైస్సార్సీపీ ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఈ విషయం బయటికి రావడంతో మంగళవారం కోడెల శివప్రసాద్‌రావు మీడియా ముందుకొచ్చి హైదరాబాద్ నుంచి సామాన్లు తరలిస్తున్నప్పుడే కొంత ఫర్నిచర్‌ను సత్తెనపల్లిలోని తన ఇంటికి తీసుకెళ్లానని అంగీకరించారు. ఆ ఫర్నిచర్ తీసుకువెళ్లాలని అధికారులను కోరారు. డబ్బులు చెల్లించాలని కోరితే. అందజేస్తానని ప్రకటించారు. ఈ పరిణామాంపై ఏపీ మంత్రి కే కన్నబాబు ఘాటుగా స్పందించారు. ప్రభుత్వ ఫర్నిచర్‌ను స్పీకర్ ఇంటికి తీసుకెళ్లడం ఏమిటని నిలదీశారు. పోలీసు విచారణ జరుగుతుందని తెలిశాక, ఫర్నిచర్ తీసుకెళ్లాలంటున్నారని మండిపడ్డారు. స్పీకర్ స్థాయిలో ఉన్న వ్యక్తి తప్పుచేస్తే ప్రజలు ఏమనుకుంటారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోడెలపై చట్టపరమైన తీసుకుంటామని స్పష్టంచేశారు.

సోయా, మినుముల కొనుగోలు నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వానకాలం సీజన్లో రాష్ట్రంలో పండించిన సోయాబీన్, మినుములను కొనుగోలుచేసేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం నియమించింది. కనీస మద్దతు ధర పథకం కింద ఈ పంటలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయనున్నది. మంగళవారం వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి ఉత్తర్వులు జారీచేశారు.

సెప్టెంబర్‌లో క్వాలిటీ మాసోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతాన్ని పెంచేందుకు ప్రస్తుతం నిర్వహిస్తున్న మాదిరిగానే సెప్టెంబర్‌లో క్వాలిటీ మాసోత్సవం (సామర్థ్యాల సాధన) చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన ప్రణాళికను మంగళవారం విడుదలచేశారు. బడి ఈడు పిల్లలందరు బడిలో ఉండటం ఎంత ముఖ్యమో వారందరికీ నాణ్యమైన విద్యనందించడం అంతే ముఖ్యమని, చాలామంది పిల్లలు చదువుతున్నప్పటికీ.. ఆ తరగతి స్థాయిని చేరుకోలేని కొందరు విద్యార్థుల్లో ఆత్మన్యూనతభావం పెరిగి బడికి దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తుండటంతో వీటిని అధిగమించి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడం కోసం కార్యాచరణ ప్రణాళికలు తయారుచేశారు.

ఉపాధ్యాయులు చేయాల్సిన కొన్ని కార్యక్రమాలు

చదువలేని విద్యార్థులను గుర్తించాలి. వారికి పునశ్చరణ తరగతులు నిర్వహించాలి. వెనుకబడిన విద్యార్థికి చదువులో సహకరించాలి. పాఠాలు చెప్పేక్రమంలో ఆసక్తి పెంచాలి. బాల సభలు, క్విజ్ పోటీలు నిర్వహించాలి. తరగతి గదిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. తాము ప్రతిరోజు కొత్త విషయాన్ని నేర్చుకున్నామన్న భావనను విద్యార్థుల్లో కలిగించాలి. చదువులో ప్రతిభ కనబరిచినవారిని తప్పకుండా ప్రోత్సహించాలి. వారికి బహుమతి ఇచ్చి అందరి ముందు ప్రశంసించాలి.

అనాథలకు సర్కారు అండ

వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం

నాంపల్లిలో భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అనాథలకు ఆశ్రయం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర

నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 21 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

ప్లస్ సైజ్ ర్యాంప్‌వాక్

లాక్మే ఫ్యాషన్ షో అంటే అందానికే ప్రాధాన్యం ఇస్తారనుకుంటారు చాలామంది. కానీ.. ఆత్మవిశ్వాసం, నమ్మకంతో ముందుకు నడువాలనుకునే మహిళలకూ లాక్మే ఫ్యాషన్ వీక్ వేదికగా మారింది.

కొంతమంది న్యూనతాభావంతో ఉంటారు. ఇప్పుడా పరిస్థితి ఉండకూడదని ఢిల్లీకి చెందిన డిజైనర్ రీనా ధాకా లాక్మే ఫ్యాషన్ వీక్‌కు హోస్ట్‌గా పనిచేస్తున్నది. ఈ ఫ్యాషన్ వీక్‌కి 21 మంది మోడల్స్‌ను ఎంచుకోవడానికి ఆడిషన్స్ మొదలుపెడుతున్నది. ఇది ప్లస్ – సైజ్ ఫ్యాషన్ షో. ఇందులో 200 మంది పాల్గొనేందుకు అవకాశం ఉన్నది. ఇక్కడ అందం (రంగు)తో పనిలేదు. ఈ ఏడాదిలో మొదలయ్యే 'లాక్మే ఫ్యాషన్ వీక్'లో ప్లస్ సైజ్ మోడల్స్ ప్రేక్షకులను ఆకట్టుకోగలగాలి. లాక్మే ఫ్యాషన్ వీక్ ఎంతోమంది కలల్ని సాకారం చేసుకోవడానికి వేదికగా మారిందని 'యూ ట్యూబ్ ఫ్యాషన్ వ్లోగర్' సాక్షి సింధ్వానీ అంటున్నది. ఐపీఎల్ యాంకర్ అర్చన విజయ జ్యూరీ ప్యానెల్‌లో బిగువైన చిరుతపులి ముద్ర ఉన్న దుస్తులను ధరించింది. ఇప్పుడు ఆమెకు ఎల్ఎఫ్‌డబ్ల్యూతో ఎల్ఎల్ ప్లస్–సైజ్ ఆడిషన్స్‌లో పాల్గొనే అవకాశం వచ్చినందుకు సంతోషిస్తున్నది. ఇలా మరికొంతమందికి అవకాశం కోసం దరఖాస్తులను కోరుతున్నది. ఎల్ఎఫ్‌డబ్ల్యూ ఇలా అవకాశం కల్పించడం మొదటిసారి కాదు. ఇంతకుముందు డిజిటల్ ప్రచారంలో ప్రసారం కోసం ఆడిషన్లు నిర్వహించారు. విజేతలకు ఏడాది పొడవునా ఐఎమ్‌జీ మోడలింగ్ ఏజెన్సీలతో ఒప్పందం కుదిరింది. ఎల్ఎఫ్‌డబ్ల్యూ 2019 వింటర్ ఫెస్టివల్‌లో నిర్వహించే ఆడిషన్స్ కోసం ఇదే ఆహ్వానం అంటున్నది.

త్రివేణి సమ్మాన్

ఆమె ఒకప్పుడు కూలీ. ఇప్పుడు.. రాష్ట్రపతి పురస్కారం అందుకోనున్నది. డిగ్రీ దూరవిద్య ద్వారా పూర్తిచేసిన ఆమెను.. భాషా పురస్కారం వరించింది. సాధించాలనే తపన.. పట్టుదల ఉంటే కూలీ కూడా ప్రొఫెసర్ కావచ్చని ఆమె నిరూపించారు. ప్రతిష్ఠాత్మక రాష్ట్రపతి పురస్కారం బాదరాయణ్ వ్యాస్ సమ్మాన్ అవార్డ్-2019కు ఎంపికై.. తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటిన తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ విభాగాధిపతి డాక్టర్ వంగరి త్రివేణి పరిచయం.

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రతీయేటా రాష్ట్రపతి పురస్కారాలు అందచేస్తున్నది. గత యాభైయేండ్లుగా సంస్కృతి, పాళి, ప్రాకృతం, అరబిక్, పర్షియన్ వంటి భాషలలో ఈ పురస్కారాలు ఇస్తున్నారు. సర్టిఫికెట్ ఆఫ్ హానర్, బాదరాయణ్ వ్యాస్ సమ్మాన్ అనే రెండు పురస్కారాలు వీటిలో ఉంటాయి. తెలుగు భాష ప్రాచీన హోదా పొందిన నేపథ్యంలో తెలుగులోకూడా ఈ పురస్కారాలు ఇస్తున్నారు. ఇంత గొప్ప పురస్కారం త్రివేణి అందుకోనుండడం అభినందనీయం.

వంగరి త్రివేణి గమ్యం ఎన్నో మలుపుల మయం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట్ మండలంలోని లాల్‌గడి మలక్‌పేట్ గ్రామం వీరి సొంతూరు. చేనేత కుటుంబం. నలుగురు అక్కా చెల్లెళ్లు, ఒక తమ్ముడు. తండ్రి టీచర్. కానీ అప్పుడు టీచర్లది బతకలేక బడిపంతులు అన్నట్లే ఉండేది కదా? పెద్ద కుటుంబం.. సంపాదన తక్కువ. గడవడానికే కష్టంగా ఉండేది. అమ్మ బీడీలు చుడుతూ.. ఇస్తరాకులు తయారు చేస్తూ ఇంటి అవసరాలకు డబ్బు సంపాదించేది. ఒకపూట ఉంటే మరో పూట పస్తులుండే పరిస్థితిని చూసింది త్రివేణి. టీచర్‌గా తండ్రి జీవితం అప్పులు కట్టడానికే సరిపోవడంతో త్రివేణి భవిష్యత్ ఆందోళనలో పడింది.

పత్తి మిల్లులో కూలీ

అప్పులు చేసి అక్కల పెండ్లిళ్లు చేశారు. ఆమె తల్లిదండ్రులు. దీంతో పిల్లల చదువు మాన్పించి ఏదైనా పనికి పంపాలనే ఆలోచన చేశారు తండ్రి. అప్పుడు త్రివేణి తొమ్మిదో తరగతి. ఇంకో తరగతి చదివితే పదన్నా పూర్తవుతుందికదా అని తల్లి అడ్డుపడటంతో పదో తరగతి గట్టెక్కింది. పదో తరగతి కాగానే ఓ పత్తి మిల్లులో రోజుకు రూ. 9 కూలీగా పనిలో కుదిరారు. ఆమె మిల్లుకు వెళ్తుంటే ఆమె తోటి స్నేహితులంతా కాలేజీకి వెళ్తుండేవారు. ఉదయం 4గంటలకల్లా లేచి మిల్లుకు వెళ్లేది. మిల్లు కూలీలందరినీ కంపెనీకి తీసుకుపోవడానికి ప్రతిరోజు ఒక ట్రాలీ వచ్చేది. ఉదయమే నిద్ర లేవాల్సి రావడం.. పనిఒత్తిడి వల్ల తిండి సరిగ్గా తినకపోవడం, యంత్రాల స్పీడ్‌కు చేతులు కోసుకుపోవడం వంటి సమస్యలెన్ని చుట్టుముట్టినా మూడేండ్ల పాటు పత్తి మిల్లులో కూలీగా చేసింది.

కూలీ పనులు చేస్తూనే చదువు

పదో తరగతి పాస్ అయ్యింది. కొంతమంది ఫెయిల్ అయినవాళ్లు కూడా మళ్లీ పరీక్షలు రాసి కాలేజ్‌కు వెళ్తున్నారు. కానీ తాను మంచి మార్కులు సంపాదించినా కుటుంబ పరిస్థితి కారణంగా పై తరగతులకు వెళ్లలేకపోయారు. ఆలోచనలో పడింది త్రివేణి. చదువును ఎలాగైనా కొనసాగించాలి అనుకున్నది. ఓవైపు ఉదయం పత్తి మిల్లులో పనిచేస్తూనే సాయంత్రం 6 నుంచి 9 గంటల దాకా ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసింది. 14 వయసులోపు బడికి వెళ్లని పిల్లలకు ఆమె పాఠాలు చెప్పాలి. అలా నాలుగేండ్ల పాటు ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేశారు.

ప్రైవేట్‌గా ఇంటర్

పదో తరగతి ఆంగ్ల ఉపాధ్యాయురాలు సుహాసిని ప్రోత్సాహంతో ఇంటర్‌మీడియట్ ప్రైవేట్‌గా హాజరై పరీక్షలు రాసింది. మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను ఒకేసారి కట్టేసి ఇంటర్మీడియెట్ పరీక్షలు పాసై అందర్నీ ఆశ్చర్యపరిచింది త్రివేణి. ఒకసారి లాల్‌గడి మలక్‌పేట్‌లోని పాఠశాలలో ప్రైవేటు టీచర్లు కావాలనే సమాచారం తెలిసింది. ఆమె చదువుకున్న స్కూల్‌కూడా అదే. వలంటీర్‌గా దరఖాస్తు చేసింది. ఎనిమిదేళ్లు అదే పాఠశాలలో విద్యావలంటీర్‌గా పనిచేసింది. సహోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి సలహాతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేసేందుకు సిద్ధమైంది. ఆదివారాలు కాలేజీకి వెళ్లి చదువుకునేది. మూడేండ్లు కష్టపడి డిస్టెన్స్‌లో బీఏ చేసింది.

కుటుంబ బాధ్యత

విద్యావలంటీర్‌గా పనిచేస్తున్న సమయంలోనే త్రివేణికి గంజి నరసింహాతో వివాహమైంది. నల్లగొండజిల్లా పలివెల మెట్టినిల్లు. భర్త పత్తి మిల్లులో దినసరి కూలీ. ఏడాదికే బిడ్డ పుట్టడంతో బాధ్యత మళ్లీ మీద పడింది. ఆమెకు పై చదువులు చదవాలనే ఆశ. వెనకడుగు వేయలేదు. తెలుగు పండిట్ ట్రైనింగ్ తీసుకుంది. అప్పుడే భర్తకు పత్తి కంపెనీలో ఉద్యోగం పోయింది. టీచర్‌గా ఆమెకు వచ్చే రూ.400 జీతంతోనే ఇల్లు గడవాల్సిన పరిస్థితి. ట్రైనింగ్ పేరుతో ఆమె ఆ ప్రైవేటు ఉద్యోగం మానేస్తే ఇంటి పరిస్థితి ఎలా అని ఆలోచించి ప్రత్యేక అనుమతి తీసుకొని ఉద్యోగం చేసింది.

ఉద్యోగం వచ్చేసింది

తెలుగు పండిట్ శిక్షణలో పరిచయమైన స్నేహితుల సలహా మేరకు ఎంఏ తెలుగు ఎంట్రెన్స్ రాసింది. మొత్తం యూనివర్సిటీలోనే 6వ ర్యాంక్ వచ్చింది. పిల్లల్ని వదిలి రోజూ కాలేజీకి వెళ్లే పరిస్థితి ఆమెకు లేదు. ఫీజు కట్టి సీటు తీసుకుంది. కాలేజీకి వెళ్లడానికి వారానికి రెండు రోజులు స్కూల్లో అనుమతి తీసుకుంది. 70 శాతం కన్నా ఎక్కువ మార్కులతో పీజీ పాసై ఉస్మానియా విశ్వవిద్యాలయం ర్యాంక్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతూనే డీఎస్సీ రాసింది. ఉద్యోగం రాలేదు. తర్వాత ప్రయత్నించింది. ఇబ్రహీంపట్నం ఎలిమినేడు ఉన్నత పాఠశాలలో ఉద్యోగం. ఉదయం 6గంటలకు వాళ్ల ఊరు నుంచి స్కూల్‌కి బయలుదేరితే మళ్లీ ఇంటికి వచ్చేసరికి రాత్రి 10 అయ్యేది.

పరిశోధనలు

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ప్రవేశం లభించింది త్రివేణికి. చిల్లరిగే స్వరాజ్య లక్ష్మి కవిత్వ పరిశీలన మీద ఎంఫిల్ పరిశోధన చేసింది. 2003లో నెట్, జేఆర్ఎఫ్ సాధించింది. ఇక ఆమె సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. తర్వాత ముదిగంటి సుజాతారెడ్డి రచనల మీద సమగ్ర పరిశీలన చేసి పీహెచ్‌డీ సాధించింది. రాత్రింబవళ్లు కష్టపడి కేవలం మూడేండ్లలో పీహెచ్‌డీ పరిశోధనను పూర్తి చేసి తెలంగాణ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం తెలంగాణ విశ్వవిద్యాలయంతోపాటు నాగార్జున విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయనశాఖకు పీహెచ్‌డీ, ఎంఫిల్ పర్యవేక్షకురాలిగా వ్యవహరిస్తున్నారు.

దేశాల్లో ఖ్యాతి

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, కర్నూలు, కడప, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి వంటి నగరాల్లోనూ సాహిత్య ప్రసంగాలు చేశారు. వారణాసిలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో తులనాత్మక సాహిత్యం మీద పునశ్చరణ తరగతుల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఇక విదేశాల్లోనూ ఆమె ప్రసంగాలు కొనసాగాయి. అమెరికాలోని చికాగోలో జూన్ –2016లో జరిగిన ఆటా –16 తెలంగాణ మహాసభల్లో సాహిత్య పత్రాలను సమర్పించారు. న్యూజెర్సీ, న్యూయార్క్, విస్కాన్‌సిన్ వంటి నగరాల్లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్, డెట్రాయిట్ తెలుగు లిటరటీ క్లబ్, ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) వంటి సంస్థలు నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని సాహిత్య పత్రాలను సమర్పించడమేకాకుండా ప్రసంగాలు కూడా చేశారు. అదేవిధంగా మలేషియా, సింగపూర్, వంటి దేశాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పత్రసమర్పణలేకాకుండా అక్కడా సాహిత్య ప్రసంగాలు చేశారు. అలాంటి త్రివేణి నేడు రాష్ట్రపతి పురస్కారంతో గౌరవాన్ని నిలబెట్టుకున్నారు.

... లోకాని గంగారామ్,
నమస్తే తెలంగాణ, డిచ్‌పల్లి
రవీందర్ నాయక్

మిస్ అమెరికా ఆఫ్ ది గన్ కమ్యూనిటీ

అమెరికాలోని గన్ కల్చర్‌తో పెరుగుతున్న హింసపై అవగాహన కల్పించేందుకు ఓ మహిళ ముందుకొచ్చింది. గన్ కమ్యూనిటీల్లో ఉన్న అపోహలను తొలిగించి వారిలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నది. ఐదుగురు పిల్లలకు తల్లి అయిన ఆమె సోషల్ మీడియా వేదికగా మారణాయుధాలపై ఉన్న దురభిప్రాయాన్ని పోగొట్టేందుకు వినూత్న ప్రచారం చేస్తున్నది.

అమెరికాలోని ఉటాకు చెందిన 27 ఏండ్ల కెసి కర్రీ అనే మహిళ యూఎస్ హింసాత్మక దేశం కాదని నిరూపించేందుకు వినూత్న ప్రచారాన్ని చేపట్టింది. కెసి కర్రీ హంటర్స్ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చింది. ఆమె నాలుగేండ్ల ప్రాయంలోనే మొదటిసారిగా తుపాకీ పేల్చింది. కెసి ఐదుగురు పిల్లలకు తల్లి. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గన్ కల్చర్‌నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నది.'గన్ కమ్యూనిటీకి మంచి పేరున్నది. కొందరు ఆ పేరుకు మచ్చతెస్తున్నారు. వారి మానసిక పరిస్థితి సరిగా లేని కారణంగానే ఇటువంటి హింసాకాండ పెరుగుతున్నదని' చెబుతున్నది. గన్ కల్చర్‌పై ఉన్న దురభిప్రాయాన్ని మార్చడంతోపాటు పలు ఆయుధాల కంపెనీలకు చెందిన గన్‌లతో ఫోజులిస్తూ వాటిని ప్రమోట్ చేస్తున్నది. హంటర్స్ ఫ్యామిలీ నుంచి వచ్చిన కెసి ఇంటినిండా పలురకాల తుపాకీలున్నాయి. 'తుపాకీలు కూడా ఇంట్లో ఉండే ఓ రకమైన వస్తువులేనని, వాటిని అవసరాన్ని బట్టే వాడాలని' ఆమె సూచిస్తున్నది. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో విద్యార్థులకు గన్ కల్చర్‌పై అవగాహన కల్పిస్తే ఎటువంటి అఘాయిత్యాలూ జరుగవని ఆమె చెబుతున్నది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దేశంలో పెరుగుతున్న గన్ కల్చర్ నేరాలపై ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాలో ఉన్న మానసిక వైద్యశాలల మూసివేతే దీనికి కారణమని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను కర్రీ కూడా సమర్థిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 3,33,000 మంది ఆమెను ఫాలో అవుతున్నారు. అందరూ కెసికర్రీని ఇప్పుడు 'మిస్ అమెరికా ఆఫ్ ది గన్ కమ్యూనిటీ'గా పిలుస్తున్నారు.

ఎక్కడ చూసినా చీమలేనా?

అసలే శ్రావణమాసం. ఇంట్లో పూజల వల్ల, స్వీట్లు పిండి వంటకాలు చేస్తుంటారు. అన్ని పనులూ సవ్యంగా జరిగాయనుకునే సరికి చీమలు ఎదురవుతుంటాయి. చేసిన స్వీట్లు ఎక్కడ దాచినా సరే చీమలు వాటిని టేస్ట్ చేయాల్సిందే. చీమలను తరిమి కొట్టడానికి సరైన మార్గాలివే.

- సాధారణంగా ఉపయోగించే వెనిగర్, నీటిని సమానంగా కలుపాలి. ఈ మిశ్రమంతో చీమలు ఎక్కువగా తిరిగే వంటగది గట్టు, అల్మారాలను శుభ్రపరుచుకోవాలి. ఇలా ఒకేరోజు నాలుగైదు సార్లు చేస్తే చీమల బెడద నుంచి తప్పించుకోవచ్చు.
- చీమలు వెనిగర్ వాసనను ఇష్టపడవు. చీమలు ఏర్పాటు చేసుకునే సువాసన బాటలను వెనిగర్ తుడిచివేస్తుంది.
- బొరాక్స్, పంచదార మిశ్రమాన్ని చీమలు తిరిగే ప్రదేశంలో పెట్టండి. బొరాక్స్ చీమల జీర్ణవ్యవసన్థ దెబ్బతీస్తుంది. చిన్నపిల్లలు ఉన్న ఇంట్లో ఈ ప్రయోగం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- చీమలు ఎక్కువగా ఉన్న చోట్లలో నిమ్మ, నారింజ తొక్కలను పెట్టాలి. ఈ పండ్ల తొక్కలలో ఉండే రసాయనాలు చీమలకు ఆహారంగా ఉపయోగపడే శిలీంధ్రాలను నాశనం చేస్తాయి. కాబట్టి చీమలు వెంటనే ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్లిపోతాయి.
- పిండి ఉన్న ప్రదేశంలో చీమలు సంచరించవు. కాబట్టి వంటగదిలో ఉండే అల్మారాల్లో, చీమలు ప్రవేశించే చోట్లలో పిండిని వెదజల్లాలి.
- చీమలు ఇంటి ద్వారాల నుంచే లోపలికి ప్రవేశిస్తాయి. కాబట్టి చీమలు ప్రవేశించే ప్రతిచోట ఉప్పును చల్లితే ఎటువంటి బాధ ఉండదు.

వంటింటి చిట్కాలు

- కాకరకాయ ముక్కలకు కొద్దిగా ఉప్పు రాసి నీళ్లు చల్లుకొని గంట పాటు అలానే ఉంచితే చేదు పోతుంది.
- పనసకాయ కోసేటప్పుడు చేతులకు నూనె రాసుకుంటే జిగురు అంటుకోదు.
- వెల్లుల్లి రెబ్బలను మెత్తగా దంచి కొద్దిగా నీటిలో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని బొద్దింకలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో ఉంచితే ఆ ప్రాంతానికి అవి రావు.
- పచ్చిమరిపకాయలకు ముచ్చికలు తీసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు పాడవకుండా ఉంటాయి.
- ఉప్పు వేసుకునే డబ్బాలకు ఎప్పుడూ మూత పెట్టాలి. లేకపోతే దానిలోని అయొడిన్ గాలిలో కలిసిపోయి లోపం వస్తుంది.
- ఇంగువ నిల్వ చేసే డబ్బాల్లో పచ్చి మిరపకాయను ఉంచితే తాజాగా ఉంటుంది.

దృఢమైన కురులకోసం..

ప్రస్తుత కాలంలో కాలుష్యం, ఒత్తిడి వల్ల చిన్న వయసులోనే జుట్టు సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ శ్రమ పడకుండానే ఇంట్లోనే జుట్టును సంరక్షించుకునే పద్ధతులు ఉన్నాయి. వీటిని పాటిస్తే సమస్య నుండి బయటపడొచ్చు.

- కొబ్బరినూనె లేదా బాదంనూనె వేడి చేసి తలకు రాయాలి. ఆ తర్వాత మునివేళ్లతో తలను బాగా మర్దన చేయాలి. దీంతో వెంట్రుకల కుదుళ్లలో రక్త ప్రసరణ మెరుగవుతుంది.
- ఉల్లిగడ్డలో ఉండే సల్ఫర్ జుట్టుకు బలాన్ని ఇస్తుంది. ఉల్లిగడ్డను జ్యూస్‌లా చేసి తలకు పట్టించాలి. మునివేళ్లతో తల మొత్తం మర్దన చేయాలి. ఉల్లిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలవల్ల తలలోని సూక్ష్మజీవులు నశిస్తాయి.
- పోషకాల లోపం వల్ల కూడా జుట్టు ఊడే అవకాశం ఉంది. రోజూ డీట్‌రూట్ రసాన్ని తాగడం వల్ల జుట్టు రాలే సమస్య తగ్గుతుంది.
- గ్రీన్ టీని తలకు కండీషనర్‌లా రాసినట్లయితే వెంట్రుకల కుదుళ్లు దృఢంగా మారుతాయి. విటమిన్ సి లోపం వల్ల కూడా జట్టు రాలిపోవచ్చు.
- జుట్టు అధికంగా రాలుతుంటే.. ఉసిరి పొడిని కలిపి తలకు రాయాలి. గంట తర్వాత గోరువెచ్చని నీటితో తల స్నానం చేయాలి.
- ఉసిరిలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ ఉంటాయి. ఇవి చుండ్రు, తలమంటను తగ్గిస్తాయి.
- వేపలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీఫంగల్ జుట్టుకు ఆరోగ్యాన్ని ఇస్తాయి. ఇది చుండ్రును నివారించడమే కాకుండా జట్టు మొదళ్లను బలోపేతం చేస్తుంది.
- షాంపూతో తలంటుకున్న తర్వాత వేపాకుల మిశ్రమాన్ని తలకు రాయాలి. ఆ తర్వాత నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే కేశాలు ఆరోగ్యంగా ఉంటాయి.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
యువ
[కరీంనగర్]
బుధవారం 21 ఆగస్టు 2019

మంచిమాట

లక్ష్యం కోసం వెళ్లే దారిలో కొంతమంది అనామకులు పరిచయం అవుతుంటారు. ఉపయోగం లేకుండా వాళ్ల దగ్గరే ఆగిపోతే నువ్వూ అలాగే మిగిలిపోతావు. కాబట్టి గమ్యం చేరేవరకూ ఎక్కడ ఆగాలో, ఎక్కడ వేగం పెంచాలో తెలుసుకోవాలి.

-విలియం గోడ్విన్

వాట్సప్ మెసేజ్

మనుషుల మధ్య ఉండాల్సింది మాటలు. వైరాలు కాదు. మాట్లాడుకుంటేనే సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. వ్యక్తిగత సమస్య, కుటుంబ సమస్య, వీధి సమస్య, దేశ సమస్య. కానీ కూర్చోరు, మాట్లాడుకోరు. వారి చుట్టూ కట్టుకున్న 'కొన్ని గోడల'ను కూల్చుకోలేరు. ఎంతటి క్లిష్టతనైనా ఎదుర్కొంటాం అంటారు కానీ సమస్యల గురించి ఎత్తితే, ఎత్తినోడిదే బాధ్యత. ఘాటుగా అడిగితే సమస్యే లేదంటారు. మాకంత అవసరం లేదంటారు. వారి కంఫర్ట్, ఇగోలే వారికి ముఖ్యం. ఏదోలే బతికేస్తున్నాం.

ఏం డైలాగ్ గురూ..



ఇక్కడ ఎవడి లైఫ్‌కు వాడే హీరో. ఎవడి బలం వాడిదే. నాకంటూ ఓ బలముంటే నీకంటూ బలముంటది. నువ్వు దేన్నయితే నమ్ముతావో దాని మీద నిలబడు. గెలుపు దానంతట అదే వచ్చి నీ కాళ్ల దగ్గర కూర్చుంటది.

(సినిమా: మహర్షి)

నవ్వుకొందాం

1. ఇంట్లో పెండ్లి చూపులు జరుగుతున్నాయి
అమ్మాయి తండ్రి: మా అమ్మాయి ఇంకా చదువుకుంటాను అంటోంది.
పెండ్లి కొడుకు : ఫర్వాలేదు.. చదుకోమనండి. మేము ఓ గంట తర్వాత వస్తాం.
2. **భార్య:** ఏమండీ! పక్కింటాయన తన భార్యని పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడట తెలుసా?
భర్త : ఆయనది పూల వ్యాపారమే.. నాది కారం పొడి వ్యాపారం.. తీసుకురమ్మంటావా?

ఫస్ట్ & బెస్ట్.. ఇంప్రెషన్

ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ద బెస్ట్ ఇంప్రెషన్ అంటారు. మొదటిసారి చూడగానే ఏర్పడిన అభిప్రాయం చాలా కాలం ఉంటుంది. అందుకే ఒక సినిమాకు ఫస్ట్ ఇంప్రెషన్ తీసుకురావడంతో సినీ దర్శకులు తమ సృజనాత్మకతకు పదును పెడుతున్నారు. ఇటీవలే విడుదలైన 'స్టోరీ ఆఫ్ భీమాల్' సినిమా ఫస్ట్ లుక్ అలాంటి ట్యాగ్‌లైన్‌తోనే బెస్ట్ ఇంప్రెషన్ కొట్టేసి చర్చకు దారితీసింది.

కంటెంట్ ఈజ్ ద కింగ్ అంటారు. కంటెంట్ ఉంటే కటౌట్ కూడా అక్కర్లేదు. విషయానికి.. విశేషణానికి ఉన్న గొప్పతనం అది. అలాంటి 'విషయం' ఉన్న సినిమాలను అంతే 'విశేషణం'గా ప్రేక్షకుల దగ్గరికి చేర్చాలి. అలాంటి ప్రయత్నం చేస్తూ అప్పుడప్పుడూ కొందరు సినీ దర్శకులు తమ సృజనాత్మకతను చాటుకుంటుంటారు. తమ తొలిసినిమా.. ఫస్ట్ లుక్ విషయంలో.. ఫస్ట్ ఇంప్రెషన్‌ను బెస్ట్ ఇంప్రెషన్‌గా మార్చుకుంటున్నారు. సినిమా కంటెంట్‌ను సిన్సియర్‌గా.. సీరియస్‌గా ఇలా ప్రజెంట్ చేస్తున్నారు.

స్టోరీ ఆఫ్ భీమాల్



ఇది సల్వాజుడుం కథాంశంతో వస్తున్న సినిమా. 'కొత్త దర్శకుడు.. కొత్త నటీనటులు.. ఇలా యూనిట్ మొత్తం కొత్త వాళ్లే. మరి సినిమాపై ప్రేక్షకుల్లో చర్చ జరగాలంటే.. సినిమాపై నమ్మకం కలిగించాలంటే ఏం చేయాలి? అని ఆలోచించి 'స్టోరీ ఆఫ్ భీమాల్' టైటిల్‌కు 'సినిమా బాలేదని ఒక్కరన్నా ఇంకోటి చేయం' అనే ట్యాగ్‌లైన్ పెట్టాం అన్నారు భీమాల్ డైరెక్టర్ నారాయణమూర్తి బల్లెడ. దీంతో ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్‌కు అనూహ్య స్పందన వచ్చింది. భీమాల్ గురించి ఆసక్తికర చర్చ జరిగింది. క్రమంగా సల్వాజుడుం గురించి తెలుసుకునే పనిలో పడ్డారు చాలామంది. 'సల్వాజుడుం కథాంశం చాలా మంచి ప్రయోగం. హానెస్ట్‌గా పనిచేస్తున్నాం. ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారు? అనే చర్చ జరుగుతున్నప్పుడు.. మన ఎఫర్ట్ ఏంటో మనకు తెలుసు. కచ్చితంగా సక్సెస్ అవుతాం. దీన్నే ప్రేక్షకులకు చెబుదాం. అంతెందుకు సినిమా బాలేదని ఒక్కరన్నా ఇంకోటి చేసేది లేదు అనే మెసేజ్ పాస్ అయ్యేట్టు చూద్దాం.. అని డిస్కస్ చేస్తుండగా ఈ ఐడియా వచ్చింది. అందుకే ఈ ట్యాగ్‌లైన్ పెట్టాం' అని చెప్పాడు దర్శకుడు.

అ!:

నాని నిర్మాతగా తీసిన సినిమా ఇది. కాజల్, నిత్యామీనన్, రెజీనా, అవసరాల శ్రీనివాస్ లాంటి వారు నటించారు. ప్రశాంత్ వర్మ దర్శకుడు. బాల్యంలో లైంగిక వేధింపులకు గురైన కాళి మానసిక క్షోభకు గురవుతుంది. మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్‌తో బాధపడుతుందామె. సూసైడ్ చేసుకోవాలనుకుంటుంది. ఇలా మానసిక క్షోభకు గురైన కాళి జీవితానికి ముగింపు ఏంటో ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు రీచ్ అవ్వాలంటే మంచి ప్రచారం కల్పించాలి. ఏం చెప్తున్నామో స్పష్టంగా తెలియజేయాలి. నానిగానీ.. డైరెక్టర్ ప్రశాంత్‌గానీ ఇదే ఆలోచించారు. హేమాహేమీలు నటించారు కదా? వారందరికన్నా ఈ సినిమాలో కథే హీరో కదా అనే చర్చ జరిగింది. ఇంకేముంది? 'కథే హీరో' అనే ట్యాగ్‌లైన్ పెట్టారు. సినీవర్గాల్లో రిలీజ్‌కు ముందు దీని గురించి మంచి చర్చ జరిగింది.

బ్రోచేవారెవరురా



మెంటల్ మదిలో ఫేమ్ వివేక్ ఆత్రేయ ఈ సినిమా దర్శకుడు. శ్రీవిష్ణు, నివేదా థామస్ నటించారు. సినిమా విడుదలకు ముందే మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. టీజర్లు.. ట్రైలర్లు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ట్యాగ్‌లైన్ కూడా కీలకంగా పనిచేసింది. 'చలనమే చిత్రము-చిత్రమే చలనము' అనే ట్యాగ్‌లైన్‌తో ప్రతీ అమ్మాయికి కనెక్ట్ అయ్యింది. ఇలాంటి కథను నమ్మడం ప్రశంసనీయం.. సినిమా టైటిల్‌గానీ.. ట్యాగ్‌లైన్‌గానీ కొత్తగా.. ఆలోచింపజేసేవిగా ఉన్నా యి అని సినీ విమర్శకులు విశ్లేషించారు.

ఐతే

చంద్రశేఖర్ యేలేటి దర్శకుడు. మధ్యతరగతి యువత నేపథ్యంలో కథ ఉంటుంది. పోలీసు ఉద్యోగం ప్రయత్నం చేసే యువకుడు.. తల్లిదండ్రుల మీద ఆధారపడి ఉండకుండా ఏదైనా చేయాలనే మరొక యువకుడు.. దుబాయ్ వెళ్లాలనే ప్రయత్నాల్లో ఉన్న ఇంకొక యువకుడు.. అనాథ కావడంతో డబ్బు కోసం తిప్పలు పడే యువకుడు.. పెయింటింగ్ ఆర్ట్‌లో మంచి టాలెంట్ ఉన్నా సరైన అవకాశాలు లేని యువతి సినిమాలో కనిపిస్తారు. ఇది అన్ని సినిమాల మాదిరి కాదు. అయినా 'అన్ని సినిమాలు ఒకేలా ఉండాలా' అనే ఆలోచనతో అదే ట్యాగ్‌లైన్ పెట్టారు. దీనికి నంది అవార్డ్ దక్కింది.

ఆనంద్

'మంచి కాఫీలాంటి సినిమా' అనే ట్యాగ్‌లైన్‌తో శేఖర్ కమ్ముల తీసిన సినిమా ఇది. 'ఆనంద్' అనే టైటిల్ కంటే.. 'మంచి కాఫీ లాంటి సినిమా' అనేది ప్రేక్షకులను ఆకర్షింపజేసింది. కాఫీ.. క్లాస్ రెండూ ఒక్కటే. అవి రెండూ కచ్చితంగా శేఖర్ కమ్ముల సినిమాలో ఉంటాయి. ఆనంద్ సినిమాతో అది ప్రేక్షకుల్లో నాటుకుపోయింది. అది కూడా 'మంచి కాఫీ లాంటి సినిమా' అనే ఉపశీర్షిక వల్లే అనేది విశ్లేషకులు అప్పట్లో బాహాటంగా ప్రకటించారు. ఒక రకంగా సినిమాపై నమ్మకాన్ని.. కథలోని కోణాన్ని చెప్పడంలో ట్యాగ్‌లైన్ ఉపయోగపడింది.

రండి! చేతులు కలుపుదాం

అందరూ కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగులే. సరిపడా జీతం. సరదాగా సాగిపోయే జీవితం. అయినా ఇంకేదో చేయాలనుకున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాద్, వివిధ ప్రాంతాల్లో తమ సామాజిక బాధ్యతను చాటుతున్నారు. 'వి మేక్ చేంజ్' ఆర్గనైజేషన్ ద్వారా ఒక్కటై 'రండి! మార్పు మనతోనే మొదలవ్వాలి' అంటున్నారు.

ఏదో ఒక ప్రత్యేకమైన దినోత్సవం సందర్భంగా అనాథలకు పండ్లు పంపిణీ చేయడం, దుప్పట్లు అందించడం సామాజిక బాధ్యత అనుకుంటే సమాజంలో పెరిగిపోయే ఎన్నో సమస్యల పట్ల ఎవరు స్పందించాలి. సమాజంలోని ప్రతి పౌరుని మీదా బాధ్యత ఉంటుంది. ఎవ్రీ బడీ షుడ్ గివ్ బ్యాక్ సమ్‌థింగ్ టు సొసైటీ. ఇది సేవ కాదు. బాధ్యత. అట్లాగే అంటున్నారు. వియ్ మేక్ చేంజ్ ఆర్గనైజేషన్ సభ్యులు. నగరంతో పాటు పలు జిల్లాలో సామాజిక అంశాల మీద శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తున్నదీ ఆర్గనైజేషన్. సొంత డబ్బులతో తన బాధ్యతను చాటుకుంటున్నది. రోడ్డుమీద గుంతలను పూడ్చడం దగ్గర నుంచి బస్టాప్‌ల, పాఠశాల భవనాల అభివృద్ధికి పాటుపడుతున్నది.

ఆర్గనైజేషన్ సభ్యులు రంగులు వేసిన ఓ బస్‌స్టాప్

ఒక్కడితో మొదలై..

కార్తీక్ పల్లం బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అక్కడి రోడ్ల మీద ఎన్నో గుంతలు, వాటివల్ల జరిగిన ప్రమాదాలు కండ్లారా చూశాడు. అప్పటి నుంచి ఇలాంటి గుంతలను పూడ్చాలనే టార్గెట్ పెట్టుకున్నాడు. ఆ సమయంలోనే అతనికి హైదరాబాద్ బదిలీ అయింది. అప్పుడు అతని ఆలోచన ఆచరణ మరింత సులభమైంది. స్థానికంగా స్నేహితులతో ఈ విషయాన్ని పంచుకున్నాడు. ముగ్గురు నలుగురు కలిసి కొన్ని గుంతలను పూడ్చారు. కొద్ది రోజులకు మిగతావారి దగ్గర నుంచి స్పందన రావడంతో 'వి మేక్ చేంజ్' ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. దీంట్లో ఇప్పుడు 50 మందికి పైగా సభ్యులు ఉన్నారు. 200 మంది వలంటరీలు ఈ సంస్థ పరిధిలో పని చేస్తున్నారు. నగరంలో గుంతలు పూడ్చడం, వెనుకబడిన పాఠశాలల అభివృద్ధికి కృషి చేయడం. పాఠశాల భవనాలకు రంగులద్ది కొత్తగా మార్చడం చేస్తుంటారు. అస్తవ్యస్థంగా ఉన్న బస్టాప్‌లను శుభ్రం చేసి, రంగుల వేసి వాటిని వినియోగంలోకి తేవడం వీరి ముఖ్యమైన పని. అట్లాగే సందర్భాన్ని బట్టి ఉపయోగపడే చాలెంజ్‌ల రూపకల్పన చేస్తారు. నగర శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో సులభంగా మొలకెత్తే చెట్ల విత్తనాలు చల్లే చాలెంజ్‌ను ఇటీవల తీసుకున్నారు. 'సీడ్ బాల్' పేరుతో ఈ చాలెంజ్ చేశారు. దీనికి చక్కటి స్పందన కూడా వచ్చింది.

ఒక్కొక్కరుగా..

రోజులు గడిచే కొద్ది వి మేక్ చేంజ్ ఆర్గనైజేషన్ కార్యక్రమాల పట్ల చాలా మంది ఆసక్తి చూపారు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో దీని గురించి అందరికీ తెలలిసింది వీటి ద్వారా ఈ సంస్థ గురించి తెలుసుకొని స్వచ్ఛందంగా చేరేందుకు ఉద్యోగులు, యువతీ, యువకులు ముందుకు వస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ ఆర్గనైజేషన్ నగరంలోని 275 ప్రమాదకర గుంతలను పూడ్చింది. నగరంలోని, వివిధ జిల్లా ప్రాంతాల్లో సుమారు 7 పాఠశాల భవనాలకు రంగులు వేసి కొత్త శోభను తెచ్చింది. అట్లాగే పాఠశాల విద్యను ప్రోత్సహించడానికి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ చేస్తారు. నగరంలో వీరి కార్యక్రమాలను చూసి ఇటు అధికారులు, నాయకులు కూడా అభినందిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు చొరవ తీసుకొని వీరికి అండగా నిలుస్తున్నారు. అవసరమైన సామగ్రి, అనుమతులు ఇస్తున్నారు.

..✍ వినోద్ మామిడాల

కేటీఆర్ అభినందన

నగరంలో చేస్తున్న వియ్ మేక్ చేంజ్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలను కేటీఆర్ అభినందించారు. రెండేండ్ల కిత్రం సిరిసిల్లలోని ఓ బస్టాప్‌ను, పాఠశాలను ఎంచుకొని దానికి రంగులు వేసి తీర్చిదిద్దారు. దీని కోసం ఆ ఏడాది స్వతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. విషయం తెలుసుకున్న కేటీఆర్ వి మేక్ చేంజ్ గురించి వివరాలు తెలుసుకొని ఈ ఆర్గనేనైజేషన్‌ను అభినందించారు. 'మై కాంప్లిమెంట్స్ టు కార్తిక్ అండ్ హీస్ ఫ్రెండ్స్.. గుడ్ జాబ్ బాయ్స్' అంటూ ట్వీట్ చేశారు కేటీఆర్.

చిన్న పనే అయినా ప్రాణాలను కాపాడుతుంది

రోడ్డుపై ఉండే గుంతలు పూడ్చడం మా ప్రధాన టాస్క్. చిన్న గుంతే అయినా ఇది ఒక్కోసారి ప్రాణాలను తీస్తుంది. ఈ గుంతల గురించి అధికారులకు సమాచారం అందకపోవచ్చు. అందుకే మాకు కనిపించిన ప్రతి గుంతనూ పూడ్చుతాం. ఇలాంటి గుంతల వల్లే ప్రమాదాలు జరుగుతాయి. ప్రభుత్వానికి ఆర్థిక నష్టం కూడా వాటిల్లుతుంది. ప్రాణాలను తీసే ఈ గుంతలను పూడ్చాలనీ, సామాజిక సమస్యలపై స్పందించాలన్నదే మా ఆశయం. మార్పు మనతోనే మొదలవ్వాలని ముందుకు సాగుతున్నాం.

– కార్తీక్, వి మేక్ చేంజ్ షాండర్

ఫ్రెండ్స్ ద్వారా తెలుసుకొని..

మాది రాజమండ్రి. హైదరాబాద్‌లో ఓ కంపెనీలో హెచ్‌ఆర్‌గా చేస్తున్నాను. వి మేక్ చాలెంజ్ గురించి మా ఫ్రెండ్ ద్వారా తెలిసింది. వివరాలు కనుకొన్నాను. బాగా అనిపించింది. అందుకే ఈ ఆర్గనైజేషన్‌లో చేరాను. ఏడాది కిందట చేరి ఇప్పటి వరకూ ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నాను. సమాజానికి మనవంతు ఏదైనా చేయాలనే నా ఆలోచన దీని ద్వారా తీరుతున్నది.

–దివ్య, మెంబర్, ఓ కంపెనీలో హెచ్‌ఆర్

చూసి నేర్చుకుంటున్నారు!

ఇప్పుడంతా ఆన్‌లైన్. యువత స్మార్ట్‌గా అన్ని పనుల చేసుకుంటున్నారు. ఎవ్వరి సాయం లేకుండానే అన్నింటినీ ఇంటర్నెట్‌లో వెతికి తెలుసుకుంటున్నారు. యూట్యూబ్, ఇతర వెబ్ సైట్లు సైతం ఆన్‌లైన్ పాఠాలు, సందేహాల నివృత్తి తదితర అంశాల్ని అందుబాటులో ఉంచుతున్నాయి.

హార్వర్డ్ బిజినెస్ రివ్యూ సంస్థ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. వంద దేశాల నుంచి సుమారు 2,700 మందిని ఈ సర్వేలో భాగస్వాములను చేశారు. 1980 నుంచి 1990లో పుట్టిన కొంత మందిని, 1990 నుంచి 2000 మధ్య పుట్టిన కొంత మందిని సర్వే చేశారు. వీరిలో 57 శాతం మంది వీడియోలు చూస్తూనే కొత్త అంశాల్ని నేర్చుకుంటున్నట్లు తెలిపారు. అయితే వీరు సోషల్ మీడియాను సైతం తమ ఎదుగుదలకు మాత్రమే ఉపయోగించుకుంటున్నట్లు వారు తెలిపారు. 40 శాతం మంది ఉద్యోగులు కమ్యూనికేషన్ స్కిల్స్, లాంగ్వేజ్ తదితర అంశాల్ని ఇంటర్నెట్ ద్వారా నేర్చుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భారత దేశంలో ఎక్కువ మంది యువత సోషల్ మీడియాను కొత్త అంశాలు నేర్చుకోవడానికే ఉపయోగిస్తున్నట్లు సర్వే వెల్లడిస్తున్నది.

కుక్కతో వివాహం

ప్రేమకు వయసుతో పనిలేదు. లింగ బేధం అవసరం లేదు. మనసు ఎక్కడ ఎవరిని ఇష్టపడుతుందో తెలియదు. ప్రేమ గుడ్డిది అని మరోసారి రుజువు చేసింది బ్రిటన్ మాజీ సుందరి. కొన్నాళ్లుగా తాను పెంచుకుంటున్న కుక్కను పెండ్లి చేసుకున్నది.

బ్రిటన్‌కు చెందిన మాజీ సుందరి ఎలిజిబెత్ హోడ్ తన పెంపుడు కుక్కను పెండ్లి చేసుకున్నది. లాగాన్ అనే శునకానికి వెడ్డింగ్ వైన్ తొడిగింది. తాను లాగాన్‌కు తోడుగా ఉంటానని, ప్రతి రోజు వాకింగ్‌కు తీసుకెళ్తానని కుక్కతోనే చెబుతూ ప్రమాణం కూడా చేసింది. ఎలిజబెత్ హోడ్‌కు తన కుక్కంటే చాలా ఇష్టం. ఆ కుక్క లాగాన్‌ను గాఢంగా ప్రేమించింది. కుక్కకు విశ్వాసం ఉంటుందని దాన్నే పెండ్లి చేసుకుంది. దీంతో పెండ్లి ఫిక్స్ చేసుకుని మరీ ఒక టీవీ చానెల్‌లో లైవ్ ఇచ్చేందుకు సిద్ధమైంది. బ్రిటన్ మాజీ సుందరి పెండ్లిని ఓ ఇంగ్లిష్ చానెల్ లైవ్ కూడా చూపించింది. రెండు గంటలపాటు జరిగిన ఆ వివాహ వేడుకలను బ్రిటన్ ప్రజలు టీవీలకు అతుక్కుపోయి మరీ చూశారట. 'లాగాన్ నాకు తోడుండం కాదు. నేనే లాగాన్‌కు తోడుంటాను. నమ్మకం లేని వ్యక్తుల కంటే విశ్వాసంగా ఉండే లాగాన్ అంటేనే నాకు చాలా ఇష్టం. ఎవ్వరేమనుకున్నా సరే నా జీవితం నా ఇష్టం' అంటూ ఎలిజబెత్ హోడ్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.

నిపుణ

విద్య ఉద్యోగ సమాచారం

అసిస్టెంట్ ఆఫీసర్లు

ముంబైలోని రాష్ట్రీయ కెమికల్స్ & ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 28 (ఆఫీసర్ ఫైనాన్స్ -12, డిప్యూటీ మేనేజర్-2, మేనేజర్ లీగల్-2, అసిస్టెంట్ ఆఫీసర్-12)
- **అర్హతలు:** సీఏ/సీఎంఏ, బీకాం+ఎంబీఏ, ఎంఎంఎస్, బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఈ/బీటెక్ లేదా బీఎస్సీ ఇంజినీరింగ్, లా, బీకాం+సీఏ ఇంటర్/ఐపీసీసీ/సీఎంఏ ఇంటర్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** ఆగస్టు 27
- **వెబ్‌సైట్:** www.rcfltd.com

నేవీలో సెయిలర్ పోస్టులు

సెయిలర్ (స్పోర్ట్స్ కోటా ఎంట్రీ-1/2019) పోస్టుల భర్తీకి అవివాహిత పురుషుల నుంచి ఇండియన్ నేవీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **స్పోర్ట్స్ విభాగాలు:** అథ్లెటిక్స్, ఆక్వాటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, క్రికెట్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, స్క్వాష్, బెస్ట్ ఫిజిక్యూ, ఫెన్సింగ్, గోల్ఫ్, టెన్నిస్, కయాకింగ్, రోయింగ్, షూటింగ్, సెయిలింగ్ & విండ్ సర్ఫింగ్
- **అర్హతలు:** డైరెక్ట్ ఎంట్రీ పెట్టీ ఆఫీసర్/సీనియర్ సెకండరీ రిక్రూట్‌మెంట్ (ఎస్ఎస్ఆర్): ఏదైనా గ్రూప్‌లో ఇంటర్ లేదా 10+2 లేదా తత్సమాన పరీక్ష, మెట్రిక్ రిక్రూట్స్ (ఎంఆర్): పదోతరగతి ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.

గమనిక: సంబంధిత క్రీడల్లో అంతర్జాతీయ/ జూనియర్/సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్, సీనియర్ స్టేట్ చాంపియన్‌షిప్, ఆల్ ఇండియా యూనివర్సిటీ చాంపియన్‌షిప్ స్థాయిలో పాల్గొన్న విశిష్ట క్రీడాకారులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

- **వయస్సు:** డైరెక్ట్ ఎంట్రీ పెట్టీ ఆఫీసర్‌కు 17 నుంచి 22 ఏండ్ల మధ్య, మిగతా పోస్టులకు 17 నుంచి 21 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పే & అలవెన్సులు:** శిక్షణలో నెలకు రూ. 14,600/- ఇస్తారు. తర్వాత రూ. 21,700-43,100 + రూ. 5,200/-ఎంఎస్‌పీ +డీఏ చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, స్పోర్ట్స్ ట్రయల్స్ ద్వారా చేస్తారు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఎన్ఏఎల్‌లో సైంటిస్టులు

బెంగళూరులోని సీఎస్ఐఆర్-నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీ (ఎన్ఏఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం పోస్టులు:** 11 (ప్రిన్సిపల్ సైంటిస్ట్-5, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్-6)
- **అర్హతలు:** మెకానికల్, ఏరోస్పేస్/ఏరోనాటికల్/కంట్రోల్, ఈసీఈ/ఎలక్ట్రికల్, ఐటీ/కంప్యూటర్ సైన్స్, ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్, మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ ఉండాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ, **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 16
- **వెబ్‌సైట్:** www.nal.res.in

బీఆర్‌వోలో ఖాళీలు

పుణెలోని బోర్డర్ రోడ్డు ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మల్టీ స్కిల్డ్ వర్కర్ తదితర టెక్నికల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 337 (జనరల్-152, ఈడబ్ల్యూఎస్-30, ఓబీసీ-85, ఎస్సీ-47, ఎస్టీ-23)
- **విభాగాలవారీగా ఖాళీలు:** డ్రాఫ్ట్స్‌మ్యాన్-40, హిందీ టైపిస్ట్-22, సూపర్‌వైజర్ స్టోర్స్-37, రేడియో మెకానిక్-2, ల్యాబొరేటరీ అసిస్టెంట్-1, వెల్డర్-15, మల్టీ స్కిల్డ్ వర్కర్ (మేసన్) -215, మల్టీ స్కిల్డ్ వర్కర్ (మెస్ వెయిటర్)-5
- **అర్హత:** పదోతరగతి, సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ, ఆర్కిటెక్చర్/డ్రాఫ్ట్స్‌మ్యాన్‌షిప్, ల్యాబొరేటరీ అసిస్టెంట్‌లో సర్టిఫికెట్, ఇంటర్+టైపింగ్ నాలెడ్జ్, బ్యాచిలర్ డిగ్రీ (మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఇన్వెంటరీ కంట్రోల్/స్టోర్స్ కీపింగ్) ఉండాలి.
- **వయస్సు:** మల్టీ స్కిల్డ్ వర్కర్‌కు 25 ఏండ్లు, మిగతా కేటగిరీలకు 27 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 50/-, ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీలకు ఫీజు లేదు
- **ఎంపిక:** ఫిజికల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్, రాతపరీక్ష
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 19
- **వెబ్‌సైట్:** www.bro.gov.in

epaper.ntnews.com

4 వేల కోట్లు ట్రస్టుకు రాసి ఆత్మహత్య



న్యూయార్క్, ఆగస్టు 20: అమెరికాకు చెందిన ఓ మిలియనీర్ రూ.4 వేల కోట్ల ఆస్తిని ఓ ట్రస్టుకు రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూయార్క్ సమీపంలో మన్‌హట్టన్ జైలులో కొన్నిరోజుల క్రితం పెట్టుబడిదారుడైన జెఫ్రీఎప్‌స్టీన్ బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. అయితే, అతడు ఉరివేసుకోవాడానికి రెండ్రోజుల ముందు వీలునామా రాసినట్టు న్యూయార్క్ పోస్టు పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. ఆగస్టు ఎనిమిదో తేదీన దాదాపు 577 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.4000 కోట్ల ఆస్తిని ఓ ట్రస్టుకు రాసిఇచ్చినట్టు తెలిసింది. మైనర్ అమ్మాయిలను లైంగికంగా వేధించిన కేసులో ఎప్‌స్టీన్‌కు జైలుశిక్ష పడింది. గత జూలై నుంచి ఆయన జైలులో ఉంటున్నాడు. ఎప్‌స్టీన్ నుంచి నష్టపరిహారం కోరేందుకు కోర్టులో పోరాడనున్నట్టు బాధితులు చెప్తున్నారు.

రెండు రూట్లలో ప్రయోగాత్మకంగా రైళ్ల ప్రైవేటీకరణ

ఐఆర్సీటీసీకి అప్పగించనున్న రైల్వే బోర్డు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: రైల్వేల ప్రైవేటీకరణ దిశగా మరో అడుగు ముందుకు పడింది. ఈ క్రమంలో రెండు మార్గాల్లో రెండు రైళ్ల నిర్వహణ బాధ్యతను భారతీయ రైల్వే బోర్డు పైలట్ ప్రాజెక్టు కింద తన అనుబంధ ఐఆర్సీటీసీకి అప్పగించనున్నట్లు సమాచారం. అహ్మదాబాద్-ముంబై సెంట్రల్ తేజాస్, ఢిల్లీ-లక్నో తేజాస్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మూడేండ్ల పాటు ఐఆర్సీటీసీ నడుపుతుంది. తొలుత ఈ రైళ్లను ఐఆర్సీటీసీకి రైల్వేబోర్డు అప్పగిస్తుంది. ఆదాయ వ్యయాలకు అనుగుణంగా టిక్కెట్ల ధర నిర్ణయాధికారం కూడా ఐఆర్సీటీసీదే. ఈ రైళ్లలో రైల్వే శాఖ టిక్కెట్ కలెక్టర్లు తనిఖీలు చేయరు. వీటిల్లో రాయితీలు, డ్యూటీ పాస్‌లు అనుమతించరు. ఈ రైళ్ల టిక్కెట్ల విక్రయం కోసం సొంత వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని ఇప్పటికే ఐఆర్సీటీసీని రైల్వేబోర్డు ఆదేశించింది. ఒక ఏడాది వరకు మాత్రం రైల్వే వెబ్ పోర్టల్‌ను టిక్కెట్ల విక్రయానికి ఉపయోగించుకునేందుకు ఐఆర్సీటీసీని అనుమతించనున్నట్లు సమాచారం. ఒక్కో రైలులో 18 బోగీలు ఉన్నా ఐఆర్సీటీసీని మాత్రం ఏడాది కాలం వరకు కనీసం 12 బోగీలతో సర్వీసులు నడిపేందుకు అనుమతించనున్నారు. వంద రోజుల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రయాణికులకు సేవలు అందించాల్సిన బాధ్యత సదరు ప్రైవేట్ సంస్థలదేనని అధికార వర్గాలు చెప్పాయి. అయితే మిగతా రైళ్ల మాదిరిగానే లోకో, పైలట్లు, గార్డులు, స్టేషన్ మాస్టర్లుగా రైల్వే సిబ్బంది ఉంటారు. శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్ల మాదిరిగానే వీటికి రైల్వేబోర్డు ప్రాధాన్యం ఇస్తుంది. బోగీల బయట, లోపల రైళ్ల బ్రాండ్‌ను ప్రచారంచేసే వాణిజ్య ప్రకటనలను జారీచేసే హక్కులు కూడా ఐఆర్సీటీసీవే. ప్రతి ట్రిప్ రవాణా చార్జీలు గణించాల్సి ఉంటుంది. ఈ రైళ్లు తన కస్టడీలో ఉన్నందుకు రైల్వే బోర్డుకు ఐఆర్సీటీసీ రుసుము చెల్లిస్తుంది. ప్రమాదాలు జరిగితే మిగతా రైలు ప్రయాణికుల మాదిరిగానే ఈ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు అన్ని రకాల క్లెయిమ్‌లు చేసుకోవచ్చు. వారానికి ఆరు రోజులు మాత్రమే నడిచే ఈ రైళ్ల మెయింటెనెన్స్ బాధ్యత మాత్రం రైల్వేలు నిర్వహిస్తాయి.

యెడ్డి క్యాబినెట్ విస్తరణ

- స్వతంత్ర సభ్యుడు నగేశ్‌తో పాటు 16 మందికి చోటు
- ఒక మహిళ సహా నలుగురికి తొలిసారి చాన్స్
- ఉభయ సభల్లో సభ్యుడుకానీ సవాదీకి మంత్రి పదవి
- 20 రోజుల తర్వాత క్యాబినెట్ విస్తరించిన యెడియూరప్ప

కర్ణాటక రాజ్‌భవన్‌లో స్వతంత్ర ఎమ్మెల్యే నగేశ్‌తో మంగళవారం మంత్రిగా ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ వాజుభాయివాలా. చిత్రంలో సీఎం యెడియూరప్ప ఉన్నారు

బెంగళూరు, ఆగస్టు 20:

కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్ప ఎట్టకేలకు తన క్యాబినెట్‌ను విస్తరించారు. గత నెల 26న సీఎంగా ప్రమాణంచేసిన యెడియూరప్ప దాదాపు మూడు వారాల తర్వాత మంగళవారం స్వతంత్ర్య ఎమ్మెల్యే హెచ్ నగేశ్‌తోపాటు 16 మందికి క్యాబినెట్‌లో చోటు కల్పించారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ వాజుభాయివాలా నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. మాజీ సీఎం జగదీశ్ షెట్టర్, మాజీ డిప్యూటీ సీఎంలు కేఎస్ ఈశ్వరప్ప, ఆర్ అశోకా, బీ శ్రీరాములుతోపాటు ఇటు అసెంబ్లీలో గానీ, శాసనమండలిలో గానీ సభ్యుడు కానీ లక్ష్మణ్ సంగప్ప సవాదీలు మంత్రులుగా ప్రమాణం చేసిన ప్రముఖుల్లో ఉన్నారు. ఏకైక మహిళా సభ్యురాలు శశికళా జొల్లో అన్నాసాహెబ్ మాత్రమే మంత్రిగా ప్రమాణం చేశారు. ఆమెతోపాటు నలుగురు మంత్రులు తొలిసారి మంత్రులుగా నియమితులయ్యారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆధిపత్యం వహిస్తున్న లింగాయత్‌ల్లో సీఎం యెడియూరప్పతోపాటు ఎనిమిది మందికి క్యాబినెట్‌లో చోటు దక్కింది. వొక్కలిగలు, ఎస్సీలు ముగ్గురు చొప్పున, ఎస్టీ, బ్రాహ్మణ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరికి మంత్రిగా అవకాశం లభించింది.

17 జిల్లాలకు దక్కని ప్రాతినిధ్యం

యెడియూరప్ప క్యాబినెట్‌లో 17 జిల్లాలకు ప్రాతినిధ్యం లభించలేదు. గత ఏడాది ఎన్నికల్లో ఓటమి పాలైన సవాదీ మినహా రాజకీయ వర్గాల అంచనాల మేరకే మిగతా వారికి క్యాబినెట్‌లో చోటుదక్కింది. మధు స్వామి మంత్రిగా కాక సీఎంగా ప్రమాణం చేయడంతో గందరగోళం నెలకొంది. అయితే ఆయన తర్వాత తాను స్వయంగా సరిచేసుకుని మళ్లీ ప్రమాణంచేశారు. ఆ వెంటనే సీఎం యెడియూరప్పతో జరిగిన తప్పిదంపై చర్చిస్తూ ఇద్దరు ఘొల్లున నవ్వేశారు. కర్ణాటకలో సీఎంతో కలిపి మొత్తం 34 మంది మంత్రులుగా చేరేందుకు అవకాశం ఉంది. మిగతా 16 పదవుల్లో కుమారస్వామి ప్రభుత్వ పతనానికి కారణమైన కాంగ్రెస్, జేడీఎస్ రెబెల్ ఎమ్మెల్యేల్లో కొందరిని తీసుకోవడం కోసం భర్తీ చేయలేదు. అనర్హత వేటు పడిన 17 మంది కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు దాఖలుచేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు తీర్పు చెప్పే వరకు వారు వేచి ఉండాల్సిందేనంటున్నారు.

20 రోజులు వన్‌మ్యాన్ క్యాబినెట్!

గత నెల 26న సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యెడియూరప్ప చేపట్టిన తొలి క్యాబినెట్ విస్తరణ ఇది. క్యాబినెట్ విస్తరణకు యెడియూరప్ప బీజేపీ అధిష్ఠానం ఆమోదం కోసం 20 రోజులు వేచి ఉండాల్సి వచ్చింది. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా నుంచి శనివారం అనుమతి లభించింది. ఇప్పటివరకు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన మాదిరిగా 'వన్‌మ్యాన్ క్యాబినెట్' నడిపారని యెడియూరప్పపై ప్రతిపక్షకాంగ్రెస్, జేడీఎస్ విమర్శలు గుప్పించాయి.

స్థానం దక్కని సీనియర్ల నిరసన

యెడియూరప్ప క్యాబినెట్ విస్తరణపై బీజేపీ కేంద్ర నాయకత్వం ముద్ర స్పష్టంగా కనిపించింది. అయితే పలువురు సీనియర్లు తమకు చోటు దక్కకపోవడంపై రగిలిపోతున్నారు. చిత్రదుర్గ ఎమ్మెల్యే జీహెచ్ తిప్పారెడ్డి తన అసంతృప్తిని బయటపెట్టారు. తన వంటి వారి సీనియారిటీని పట్టించుకోలేదని సీఎంపై ఒత్తిడి పెంచేందుకు భావసారూప్యం గల ఎమ్మెల్యేలతో భేటీ అవుతామన్నారు. ఆయన మద్దతుదారులు వాహనాల టైర్లు తగులబెట్టి మరీ నిరసన తెలిపారు. యెడియూరప్ప తన విధేయులకూ చోటు కల్పించకపోవడంపై నిరసన వ్యక్తమైంది. సుమారు 12 మంది మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అంగారా భావోద్వేగానికి గురయ్యారు. అయితే పార్టీ వ్యతిరేక, అసమ్మతి కార్యక్రమాలు చేపట్టబోనన్నారు. మరో ఎమ్మెల్యే గూలీహట్టి శేఖర్ తనకు అన్యాయం జరిగిందన్నారు. 15 ఏండ్లలో తొలిసారి జార్కిహోలి కుటుంబానికి క్యాబినెట్‌లో చోటు లభించలేదు. కుమారస్వామి ప్రభుత్వ పతనంలో జార్కిహోలీ కీలకంగా వ్యవహరించారు. డిప్యూటీ సీఎం పదవిపై ఆశలు పెట్టుకున్న అరవింద్ లింబావలిని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా నియమించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. కీలకమైన మైసూర్ ప్రాంతంలోని ఏడు జిల్లాలకు క్యాబినెట్‌లో చోటే లభించలేదు.

ఢిల్లీలో రాజీవ్ సమాధి 'వీర్‌భూమి' వద్ద నిర్వహించిన ప్రార్థనా సమావేశంలో పాల్గొన్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ తదితరులు

అసహనం, విద్వేషం వద్దు

- వాటిని నిరోధించకపోతే మన రాజ్యాంగ విధానాలకే ముప్పు
- రాజీవ్ జయంతి కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్

న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశంలో అసహనం, మతపరమైన కేంద్రీకరణ, విద్వేషపూరితమైన హింసాత్మక నేరాలు పెరిగిపోతున్నాయని, ఇలాంటి అవాంఛనీయ ధోరణుల వల్ల మన రాజ్యాంగ విధానాలకే నష్టం వాటిల్లుతుందని మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ ఆందోళన వ్యక్తంచేశారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 75వ జయంతి సందర్భంగా మంగళవారం ఢిల్లీలో రాజీవ్ యూత్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. దేశంలో శాంతిని, మతసామరస్యాన్ని పెంపొందించుకోవాలని రాజ్యాంగంలో మనం నిర్దేశించుకొన్న సమున్న లక్ష్యాలకు ఈ ధోరణులు గొడ్డలిపెట్టు లాంటివని, వీటిని నిరోధించేందుకు మనం కృషిచేయాల్సిన అవసరమున్నదని అన్నారు. 'దేశ ఐక్యత, సమగ్రత కంటే మరేదీ ముఖ్యంకాదు. దేశం అఖండమైనది. మన జాతీయతా భావానికి లౌకిక తత్వమే ప్రథమ పునాది. ఇది సహనం కంటే అతీతమైనది. సామరస్యత కోసం మనంచేసే కృషి దీనిలోనే ఇమిడి ఉన్నది' అన్న రాజీవ్‌గాంధీ మాటాలను మన్మోహన్‌సింగ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. విద్వేషాన్ని, అసహనాన్ని ఏ మతం బోధించడంలేదని, ఇంటాబయటా ఉన్న కొన్ని స్వార్థశక్తులు దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ గొప్ప దార్శనికుడే కాకుండా అంతకంటే గొప్ప ఆచరణవాది అని, అందుకే ఆయన చాలా స్వల్పకాలంలోనే ఎంతోమందికి చేరువయ్యారని కొనియాడారు. గత దశాబ్దకాలంగా సమాజానికి ఎంతో విలువైన సేవలు అందించిన ప్రముఖ వ్యక్తులు, సంస్థలకు మన్మోహన్ ఈ సందర్భంగా 'రాజీవ్‌గాంధీ జన్మ పంచ సప్తతి' పురస్కారాలను ప్రదానం చేశారు.

రాజీవ్‌కు కాంగ్రెస్ అగ్రనేతల ఘననివాళి

రాజీవ్‌గాంధీకి మన్మోహన్‌సింగ్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ తదితర అగ్రనేతలు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ 75వ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఆయన సమాధి 'వీర్‌భూమి' వద్ద మంగళవారం నిర్వహించిన ప్రార్థనా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా వాద్రా, గులాం నబీ ఆజాద్, అహ్మద్ పటేల్, భూపీందర్ హుడా తదితర ముఖ్య నేతలు కూడా పాల్గొన్నారు.

ప్రధాని మోదీ నివాళి

మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా రాజీవ్‌ను స్మరించుకున్నారు. 'మన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్నా' అని మోదీ ట్వీట్ చేశారు.

కశ్మీర్‌పై మితంగా మాట్లాడాలి

ఇమ్రాన్‌ఖాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హితబోధ
ఉభయదేశాలు సంయమనం పాటించాలని ట్విట్టర్‌లో పేర్కొన్న ట్రంప్
ఇమ్రాన్ వ్యాఖ్యలు ట్రంప్ దృష్టికి తీసుకెళ్లిన నరేంద్రమోదీ
కశ్మీర్ సమస్య పరిష్కారంలో పాత్ర పోషించండన్న ఇమ్రాన్

వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్రమోదీతో అర్ధగంట సేపు ఫోన్లో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌తోనూ సంప్రదింపులు జరిపారు. జమ్ముకశ్మీర్‌పై ఉద్రిక్తతలు తగ్గించాల్సిన అవసరాన్ని చెప్తూ.. ఆ అంశంపై మితంగా మాట్లాడాలని హితవుపలికారు. మోదీ, ఇమ్రాన్‌తో చర్చించిన అంశాలను సోమవారం సాయంత్రం ట్విట్టర్లో క్లుప్తంగా వివరించారు. భారత్, పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతోపాటు ద్వైపాక్షిక, వ్యూహాత్మక వాణిజ్య అంశాలు చర్చకు వచ్చినట్టు పేర్కొన్నారు. 'మంచి మిత్రులైన మోదీ, ఖాన్‌తో మాట్లాడాను. వాణిజ్య, ద్వైపాక్షిక, వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ జరిగింది. ముఖ్యంగా కశ్మీర్ అంశంపై ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను తగ్గించే విధంగా చర్చలు కొనసాగాయి. ఎంతో కఠినమైన పరిస్థితులు అయిన ప్పటికీ.. చక్కటి సంభాషణ కొనసాగింది' అని ట్రంప్ వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఉభయదేశాలు సంయమనం పాటించాలని, కశ్మీర్ విషయంపై మితంగా మాట్లాడాలని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఫోన్లో సంభాషించిన ట్రంప్ సూచించారని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇది జరిగిన రెండు రోజులకు ట్రంప్ భారత ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. వారం రోజుల వ్యవధిలో ఇరుదేశాల ప్రధానులతో ట్రంప్ మాట్లాడటం ఇది రెండోసారి కావడం విశేషం. జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్ రద్దు, రాష్ట్ర విభజన నేపథ్యంలో భారత్- పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే.

ఆయన వ్యాఖ్యలు అభ్యంతరకరం

భారత ప్రభుత్వంపై పాక్ ప్రధాని విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడాన్ని ట్రంప్‌తో ఫోన్లో మాట్లాడిన సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తంచేశారని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇమ్రాన్‌ఖాన్ ఉపయోగిస్తున్న పదజాలం ప్రాంతీయంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ఉన్నదని ప్రస్తావించారని పేర్కొన్నది. కశ్మీర్ అంశంలో పాక్ విషం కక్కుతున్న విషయాన్ని ట్రంప్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పింది. ఎలాంటి మినహాయింపులు లేకుండా సీమాంతర ఉగ్రవాదాన్ని పూర్తిగా నియంత్రించాలని ట్రంప్‌తో మోదీ చెప్పినట్టు వెల్లడించింది.

సమస్య పరిష్కారంలో పాత్ర పోషించండి

ట్రంప్‌తో ఫోన్ సంభాషణ సుహృద్భావ వాతావరణంలో కొనసాగిందని, కశ్మీర్ సమస్యకు పరిష్కారం చూపడంలో కీలకపాత్ర పోషించాలని తమ దేశ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ కోరినట్టు పాక్ విదేశాంగమంత్రి ఖురేషి సోమవారం రాత్రి మీడియాకు చెప్పారు. కశ్మీర్‌లో కర్ఫ్యూ ఎత్తివేసి ప్రజలు స్వేచ్ఛ వాతావరణం కల్పించేలా చూడాలన్నారన్నారు. కశ్మీర్‌లో పరిస్థితులను గమనించేందుకు మానవ హక్కుల సంస్థల ప్రతినిధులను పంపాలని ట్రంప్‌తో ఇమ్రాన్‌ఖాన్ చెప్పారని తెలిపారు.

మంగళవారం సచివాలయం నుంచి బీఆర్కే భవన్‌కు తరలివస్తున్న మైనార్టీ వెల్ఫేర్ విభాగం సామగ్రి

వాలంతరిలో మూడునెలల సర్టిఫికెట్ కోర్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమర్థమైన భూమి-నీటి యాజమాన్యంతో సుస్థిరమైన లాభసాటి వ్యవసాయ విధానం (వాలంతరి)పై మూడునెలల సర్టిఫికెట్ కోర్సును వచ్చేనెలలో ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బీ కృష్ణారావు తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా చదివిన 18-30 ఏండ్ల లోపు గ్రామీణ విద్యార్థినీ, విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులని, కోర్సు పూర్తిచేసిన వారు ఆదర్శ రైతుగా లేదా వ్యవసాయ రంగంలో కన్సల్టెంట్‌గా స్వయం ఉపాధి పొందవచ్చని చెప్పా రు. కోర్సు రుసుమును రూ.5 వేలుగా నిర్ణయించామని, శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. దరఖాస్తు రుసుమును రూ.500గా నిర్ణయించామని, డైరెక్టర్ జనరల్, వాలంతరి, హైదరాబాద్ పేరుతో తీసిన డీడీని అభ్యర్థులు తమ దరఖాస్తుకు జతచేసి డైరెక్టర్, వాలంతరి, హిమాయత్‌సాగర్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030 చిరునామాకు సెప్టెంబర్ 9 సాయంత్రం 5 గంటల్లోగా పంపాలని తెలిపారు.

కేరళ తొలి మహిళా షికారి ఇకలేరు

కన్నుమూసిన కుట్టియమ్మ

తిరువనంతపురం: కేరళ రాష్ట్రానికి చెందిన తొలి మహిళా షికారి (వేటగత్తె) కన్నుమూశారు. అడవి మృగాలకే వణుకు పుట్టేలా వేటాడిన థెరెసియా థామస్ అలియాస్ కుట్టియమ్మ(88) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం కొట్టాయంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ పోషణ కోసం వందల సంఖ్యలో అడవి జంతువులను వేటాడిన కుట్టియమ్మను కేరళలో తొలి మహిళా షికారీగా భావిస్తారు. ఇడుక్కి పరిసర ప్రాంతంలో ఆమె ధైర్య సాహసాల గురించి కథలు కథలుగా చెప్పుకొంటారు. వేటగాళ్ల కుటుంబానికి చెందిన కుట్టియమ్మకు నలుగురు తోబుట్టువులు. 1950లో తన 17వ ఏట కర్ణాటకలోని రాయచూర్‌లో చదువుతుండగానే.. కొట్టాయంలోని పలాయి నుంచి ఇడుక్కిలోని మరయూర్‌కు వలస వచ్చారు. అడవిదున్న దాడిలో కుట్టియమ్మ సోదరుడు గాయపడటంతో.. అతని వైద్య ఖర్చుల కోసం ఆమె వేటాడటం మొదలుపెట్టారు. సోదరుడికి వైద్య సేవలు అందించేందుకు ఖర్చుల కోసం డబ్బుగానీ లేదా అడవి జంతువుల మాంసంగానీ ఇవ్వాలని దవాఖానవర్గాలు కోరాయి. దీంతో తొలిసారి 800 కిలోల బరువైన అడవిదున్నను తుపాకీతో వేటాడారు. ఆ మాంసం విక్రయించారు. తుపాకీ కాల్చడాన్ని సోదరుడి నుంచి నేర్చుకున్న కుట్టియమ్మ 1950 నుంచి 1965 వరకు అంచునాడ్ (మరయూర్) కొండల్లో వందల సంఖ్యలో అడవి ఏనుగులు, దున్నలు, జింకలు తదితర జంతువులను వేటాడి, మరయూర్ మార్కెట్‌లో వాటి మాంసం అమ్మి కుటుంబ పోషణను చూసుకున్నారు. అటవీ జంతువుల సంరక్షణ చట్టం-1972 అమల్లోకి వచ్చాక కుటుంబసభ్యులతో కలిసి కుట్టియమ్మ తనకున్న ఏడు హెక్టార్ల భూమిలో కూరగాయల సాగు, వ్యవసాయం చేయడం ప్రారంభించారు. 1993లో వీరి భూమిని స్వాధీనం చేసుకున్న అటవీశాఖ.. ఇందుకు పరిహారంగా రూ.23 లక్షలు అందజేస్తామని ప్రకటించడంతో కుట్టియమ్మ కుటుంబం కొట్టాయంలో కంజిరాపల్లి సమీపంలోని అనక్కల్లుకు చేరుకున్నారు. కానీ, అటవీశాఖ పరిహారం చెల్లించకపోవడంతో ఆమె 2005లో హైకోర్టును ఆశ్రయించారు. వడ్డీతో సహా మొత్తం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. జర్నలిస్టు ఎంజే బాబు.. తాను రాసిన 'కన్నన్ దేవర్ కున్నుకుల్' పుస్తకంలో కుట్టియమ్మ ధైర్య సాహసాల గురించి ప్రస్తావించారు. అప్పట్లో వేటాడటం నేరం కాదని అందులో పేర్కొన్నారు. ఓ సారి అడవిలో నుంచి పులి పిల్లను సైతం పట్టుకొచ్చి నాలుగు నెలలు ఇంట్లో పెట్టుకొని సంరక్షించారని, అటవీ అధికారుల సూచనతో మళ్లీ అడవిలో వదిలిపెట్టారని గుర్తుచేశారు. కుట్టియమ్మకు కుమారుడు వీటీ జోసెఫ్, కోడలు షెర్లీ ఉన్నారు.

థెరెసియా థామస్ అలియాస్ కుట్టియమ్మ (ఫైల్‌ఫోటోలు)

కమల్‌నాథ్ మేనల్లుడి అరెస్టు!

రూ. 354 కోట్ల బ్యాంకు మోసం కేసులో ఈడీ అదుపులో రతుల్ పురి
అతని వ్యాపారాలతో తనకు సంబంధం లేదన్న మధ్యప్రదేశ్ సీఎం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్ నాథ్ మేనల్లుడు, వ్యాపారి రతుల్ పురిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టోరేట్(ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద సోమవారం అర్ధరాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన 354 కోట్ల రూపాయల బ్యాంకు మోసం కేసులో రతుల్ పురి, అతని తండ్రి దీపక్ పురి, తల్లి నీతా (కమల్ నాథ్ సోదరి), ఇతరులపై శనివారం సీబీఐ కేసు నమోదు చేసింది. మోసర్ బేర్ కంపెనీకి రతుల్ పురి సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న సమయంలో వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వాటిని దుర్వినియోగం చేశారని అభియోగం ఉన్నది. ఈ కేసులో ఆయనతో పాటు మోసర్ బేర్ సంస్థకు చెందిన డైరెక్టర్లపై కూడా సీబీఐ కేసులు నమోదు చేసింది. ఇదే కేసుకు సంబంధించి ఆదివారం, సోమవారం సంస్థ కార్యాలయాలున్న ఆరు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. తాజాగా, మనీలాండరింగ్ కేసులో రతుల్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, యూపీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన అగస్టా వెస్ట్ ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో రతుల్‌కు చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. సమర్థవంతమైన విచారణ జరుగడానికి ఆయన్ని నిర్బంధ విచారణ చేయాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడింది.

వారి వ్యాపారాలతో నాకు సంబంధం లేదు

బ్యాంకులను మోసం చేసిన కేసులో తన మేనల్లుడు రతుల్ పురి అరెస్టు వ్యవహారంపై మధ్యప్రదేశ్ సీఎం కమల్ నాథ్ స్పందించారు. వారి వ్యాపారాలతో తనకెలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. రతుల్ అరెస్టు వ్యవహారం తనకు దురుద్దేశపూరిత చర్యగా కనిపిస్తున్నదని పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'వాళ్లు నిర్వహిస్తున్న వ్యాపారాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. అయితే, రతుల్ అరెస్టు దురుద్దేశపూరిత చర్యగా స్పష్టమవుతున్నది. కోర్టు ఈ కేసులో సరైన తీర్పు ఇస్తుందని నేను నమ్ముతున్నాను' అని అన్నారు.

రతుల్ పురి

సరిహద్దులో పాక్ దుశ్చర్య

- జవాన్ మృతి.. నలుగురికి గాయాలు
- గ్రామాలు, భారత పోస్టులపై కాల్పులు
- కాల్పులను తిప్పికొడుతున్న బలగాలు

జమ్ము, ఆగస్టు 20: పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచింది. జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి ఉన్న గ్రామాలు, భారత పోస్టులు లక్ష్యంగా మంగళవారం కాల్పులకు తెగబడింది. ఈ కాల్పుల్లో భారత జవాన్ ఒకరు అమరుడు కాగా, మరో నలుగురు గాయపడ్డారు. పాక్ దుశ్చర్యను భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. పాక్ సైన్యానికి ఎక్కువ నష్టం వాటిల్లేలా దాయాది పోస్టులపై ఎదురుకాల్పులు జరుపుతున్నట్టు రక్షణశాఖ అధికార ప్రతినిధి తెలిపారు. మెండర్, కృష్ణఘాటి సెక్టార్‌లోని సరిహద్దులో ఉదయం 11 గంటలకు పాకిస్థాన్ చిన్న ఆయుధాలు, మోర్టార్లతో కాల్పులు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఆర్మీ జవాన్ ఒకరు మృతిచెందగా, మరో నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. అమర జవాన్‌ను బీహార్ రాష్ట్రం గయ జిల్లా గోపిబిఘాకు చెందిన రంజన్‌కుమార్‌సింగ్ (36)గా గుర్తించినట్టు తెలిపారు. 'ధైర్యవంతుడు, స్ఫూర్తిమంతమైన, నిబద్ధత కలిగిన సైనికుడు. విధి పట్ల అంకితభావంతో పనిచేసి దేశం కోసం తన ప్రాణాలను తృణప్రాయం అర్పించిన ఆయన త్యాగాన్ని దేశం సదా స్మరించుకుంటుంది. ఆయన సేవలకు రుణపడి ఉంటుంది' అని పేర్కొన్నారు. కడపటి వార్తలు అందేవరకు కూడా సరిహద్దులో ఇరువైపుల నుంచి కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి.

జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామక ప్రక్రియ కొనసాగుతున్

బాలకృష్ణ కొత్తలుక్!

బాలకృష్ణ

బాలకృష్ణ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోనాల్ చౌహాన్, వేదిక కథానాయికలు. థాయ్‌లాండ్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రంలో హీరో బాలకృష్ణ గత చిత్రాలకు భిన్నంగా కొత్త గెటప్‌లో కనిపించబోతున్నారు. మంగళవారం ఆయనకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. గెడ్డంతో స్టైలిష్ లుక్‌లో బాలకృష్ణ కనిపిస్తున్నారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'జైసింహా' వంటి విజయవంతమైన చిత్రం తరువాత బాలకృష్ణ, కె.ఎస్.రవికుమార్‌ల కలయికలో వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై అంచనాలు ఏర్పడ్డాయి. నిర్మాత మాట్లాడుతూ 'మంగళవారం నుంచి లోకల్ స్టంట్ కొరియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో సినిమాలోని కీలక ఎపిసోడ్ చిత్రీకరిస్తున్నాం. దర్శకుడు కె.ఎస్.రవికుమార్ ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కిస్తున్నారు. ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభిస్తోంది. పరుచూరి మురళి కథ అందిస్తున్న ఈ చిత్రానికి చిరంతన్‌భట్ సంగీతం అందిస్తున్నారు' అన్నారు. భూమిక, ప్రకాష్‌రాజ్, జయసుధ, షాయాజీ షిండే, నాగినీడు, సప్తగిరి, కోటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, రఘుబాబు, ధన్‌రాజ్, బండ రఘు తదితరులు నటిస్తున్నారు.

తల్లిదండ్రులకు సందేశం నచ్చింది!

కోనేరు సత్యనారాయణ, అనుపమ పరమేశ్వరన్, రమేష్‌వర్మ

''**రా**క్షసుడు' చిత్రం మూడు వారాల్ని పూర్తిచేసుకొని నాలుగో వారంలోకి అడుగుపెట్టింది. ఏ స్టూడియోస్ పతాకంపై తొలి ప్రయత్నంగా రూపొందించిన ఈ చిత్రం పెద్ద విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది' అని అన్నారు కోనేరు సత్యనారాయణ. ఆయన నిర్మించిన చిత్రం 'రాక్షసుడు'. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమపరమేశ్వరన్ జంటగా నటించారు. రమేష్‌వర్మ దర్శకుడు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించింది. నిర్మాత కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ 'పిల్లల నుంచి పెద్దల వరకు అందరిని ఈ సినిమా అలరిస్తున్నది. ఆడపిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని సందేశాత్మకంగా చూపించిన విధానం బాగుందని అంటున్నారు. మరో రెండు వారాల వరకు వసూళ్లను సాధించే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి' అని అన్నారు. తొలుత ఈ సినిమాలో నటించడానికి అనుపమ పరమేశ్వరన్ ఉత్సాహాన్ని చూపలేదని, మంచి సినిమాలో నటించే అవకాశాన్ని కోల్పోవద్దని తన తండ్రి చెప్పిన మాటకు కట్టుబడి సినిమాలో భాగమయ్యిందని రమేష్‌వర్మ చెప్పారు. అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'తమిళ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో చిత్ర విజయోత్సవ వేడుకకు హాజరుకాలేకపోయాను. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని పెద్ద హిట్ చేయడం ఆనందంగా ఉంది. మంచి సినిమా కెరీర్ ఉన్నతికి ఎప్పుడూ దోహదపడుతుంది. 'రాక్షసుడు' అలాంటి సినిమానే. ఆ ఆలోచనతోనే ఇందులో నటించాను' అని చెప్పింది.

స్వచ్ఛమైన ప్రేమకథ

వంశీ, స్టెఫీపటేల్

వంశీ, స్టెఫీ పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'నిన్ను తలచి'. అనిల్ తోట దర్శకత్వం వహిస్తున్నారు. ఓబులేష్, నేదురుమల్లి అజిత్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్‌లో విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు అనిల్ తోట మాట్లాడుతూ 'నిజాయితీతో ఈ సినిమా చేశాం. అభి, అంకిత అనే జంట కథ ఇది. స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపంగా ఉంటుంది. గీతా ఆర్ట్స్ ద్వారా ఈ సినిమాను విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'అందమైన ప్రేమకథ ఇది. అనుకున్న బడ్జెట్‌లో పక్కా ప్లానింగ్‌తో సినిమా పూర్తిచేశాం. విడుదలైన నాలుగు పాటలు, టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది' అని చెప్పారు. ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ ఇదని, కథాబలమున్న మంచి సినిమాతో హీరోగా తెలుగు చిత్రసీమకు పరిచయం కానుండటం అదృష్టంగా భావిస్తున్నానని వంశీ అన్నారు. ఎన్నో మధురమైన జ్ఞాపకాల్ని మిగిల్చిన సినిమా ఇదని హీరోయిన్ స్టెఫీపటేల్ తెలిపింది. ఈ కార్యక్రమంలో ఏలెందర్ మహవీర్, కృష్ణతేజ, కేదార్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సరదాగా..ఉత్కంఠ!

సాషాసింగ్, విజయ్‌రాజా, పూజా

'**గ**త ఐదారునెలలుగా స్టార్ హీరోలు, బడ్జెట్‌లతో సంబంధం లేకుండా కథలు బాగున్న చిత్రాలు విజయాల్ని అందుకుంటున్నాయి. ఆ కోవలో నిలిచే సినిమా ఇది' అని అన్నారు నటుడు శివాజీరాజా. ఆయన తనయుడు విజయ్‌రాజా హీరోగా నటిస్తున్న చిత్రం 'ఏదైనా జరగొచ్చు'. వెట్ బ్రెయిన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సుధర్మ ప్రొడక్షన్స్ పతాకాలపై రూపొందుతున్న ఈ చిత్రానికి కె.రమాకాంత్ దర్శకుడు. కె.ఎఫ్.సి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ విడుదల చేస్తున్నది. ఈ నెల 23న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా శివాజీరాజా మాట్లాడుతూ '35 సంవత్సరాల క్రితం కథను నమ్మి 'కళ్లు' అనే సినిమా చేశాను. ఆ సినిమా నాకు 17 పురస్కారాలను తెచ్చిపెట్టింది. అందులో నాదే ప్రధాన పాత్ర అయినా రచయిత గొల్లపూడి, దర్శకుడు రఘు సినిమాకు అసలైన హీరోలుగా నిలిచారు. దర్శకరచయితలే సినిమాకు ప్రాణం. ఆరిస్టుకు 25 మార్కులు వేస్తే దర్శకుడికి 75 మార్కులు వేస్తాను. దర్శకుడు రమాకాంత్ వినూత్నమైన పాయింట్‌తో ఈ సినిమా చేశాడు' అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'డార్క్ కామెడీ హారర్ థ్రిల్లర్ ఇది. ఏప్రిల్ ఒకటవ తేదీన పుట్టిన ముగ్గురు ఫూల్స్ సరదాగా చేసిన ఓ పని వారి జీవితాల్ని ఎలా ఇబ్బందుల్లోకి నెట్టిందన్నది ఆకట్టుకుంటుంది. తెలుగు తెరపై ఇప్పటివరకు రాని సరికొత్త ప్రేమకథతో ఈ సినిమా చేశాం. ప్రతినాయకుడిగా బాబీసింహా నటన చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది'అని అన్నారు. కథాగమనం, మలుపులు తనలో ఉత్సుకతను రేకెత్తించడంతో ఈ సినిమాలో నటించడానికి అంగీకరించానని బాబీసింహా చెప్పారు. విజయ్‌రాజా మాట్లాడుతూ 'తొలి సినిమాతోనే బాబీసింహా వంటి ప్రతిభావంతుడైన నటుడితో కలిసి పనిచేసే అవకాశం నాకు దొరికింది. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అనిచెప్పారు. ఈ కార్యక్రమంలో పూజా సోలంకీ, సాషాసింగ్, రచ్చరవి, జాషువా తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌డీఎక్స్ లవ్' చిత్రంలో పాయల్‌రాజ్‌పుత్

నివాసి ప్రయాణం

శేఖర్‌వర్మ

'**త**న మూలాల్ని అన్వేషిస్తూ ఓ ఎన్ఆర్ఐ యువకుడు సాగించే ప్రయాణమే ఈ చిత్ర ఇతివృత్తం' అని అన్నారు శేఖర్ వర్మ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'నివాసి'. సతీష్ రేగళ్ల దర్శకుడు. కె.ఎన్.రావు నిర్మిస్తున్నారు. వివియా, విద్య కథానాయికలు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో శేఖర్‌వర్మ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ధనవంతుల కుటుంబంలో పుట్టిన ఓ యువకుడు డబ్బు విలువను ఎలా తెలుసుకున్నాడు? తండ్రి మాటకు కట్టుబడి తాను పుట్టిన ఊరును వెతుక్కుంటూ విదేశాల నుంచి ఇండియా వచ్చిన అతడిలో ఎలా పరివర్తన వచ్చిందనే అంశంతో హృద్యంగా సాగుతుంది. తండ్రీ కొడుకుల అనుబంధం ప్రధానంగా సాగే ఈ చిత్రంలో ప్రేమ, సందేశం, వినోదం సమపాళ్లలో ఉంటాయి. వివిన్ ఆదిత్య అనే యువకుడిగా నా పాత్ర నవ్యరీతిలో ఉంటుంది. దర్శకుడిగా, కథకుడిగా సతీష్ రేగళ్ళ ప్రతిభను చాటిచెప్పే చిత్రమిది. హీరోగా తొలి సినిమా 'శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట'తో నటుడిగా భావోద్వేగాల్ని బాగా పండిస్తాననే పేరొచ్చింది. ఆ గుర్తింపును దృష్టిలో పెట్టుకొని నా శైలికి తగ్గ కథల్ని ఎంచుకుంటున్నాను. నటుడిగా రజనీకాంత్ నాకు స్ఫూర్తి. ప్రస్తుతం హీరోగా అంగుళీక, యుగన్ సినిమాలు చేస్తున్నాను. బాలకృష్ణ హీరోగా నటించిన 'జైసింహా'లో కీలక పాత్ర పోషించాను. ఆయన నటిస్తున్న తాజా చిత్రంలో పోలీస్ అధికారిగా కనిపించబోతున్నాను' అని తెలిపారు.

రామ్‌చరణ్, తమన్నా, చిరంజీవి, సురేందర్‌రెడ్డి

18వ శతాబ్దంలో బ్రిటీష్‌వారిపై ధిక్కారస్వరం వినిపించి తిరుగుబాటు జెండా ఎగరేసిన తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న 'సైరా నరసింహారెడ్డి' చిత్రం దేశవ్యాప్తంగా అందరిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. చిరంజీవి కథానాయకుడిగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను మంగళ వారం ముంబయిలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, రామ్‌చరణ్, తమన్నా, విజయ్‌సేతుపతి, సుదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మీడియాతో ముచ్చటించారు. అక్టోబర్ 2న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడం, మలయాళ భాషల్లో ప్రేక్షకులముందుకురానుంది.

'సైరా'తో స్వప్నం ఫలించింది!

'సైరా' కథాంశంలో మిమ్మల్ని ఉత్తేజపరచిన అంశాలేమిటి?

చరిత్రపుటల్లో విస్మృతిలోకి నెట్టివేయబడిన ఓ యోధుడి కథ ఇది. నేటితరం వారందరూ తెలుసుకోవాల్సిన చరిత్ర అని భావించాను. ఆ ఆలోచనతోనే దేశవ్యాప్తంగా సినిమాను ప్రేక్షకులకు అందించాలనుకున్నాం. ఈ చారిత్రక కథాంశంతో 15ఏళ్లుగా నేను ప్రయాణం చేస్తున్నాను. బడ్జెట్ పరిమితుల దృష్ట్యా సినిమాను ఆ సమయంలో కార్యరూపంలోకి తీసుకురాలేకపోయాం. నా తనయుడు రామ్‌చరణ్, దర్శకుడు సురేందర్‌రెడ్డి పట్టుదలతో ఈ సినిమా తెరపైకివచ్చింది. 'సైరా'తో నా చిరకాల స్వప్నం ఫలించినట్లయింది.

ఈ సినిమా ద్వారా సుదీర్ఘ విరామం తర్వాత మీరు హిందీ చిత్రసీమలో పునరాగమం చేయడం ఎలా అనిపిస్తున్నది?

స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంలో భారతీయులందరికి కనెక్ట్ అయ్యే కథ ఇది. స్క్రిప్ట్ కూడా బాగా కుదిరింది. దాంతో బాలీవుడ్ ప్రేక్షకుల్ని తిరిగి పలకరించడానికి ఇదే మంచి తరుణం అనిపించింది.

'ఆజ్‌కా గూండారాజ్' తర్వాత మీరు హిందీలో చేసిన చిత్రమిది. ఇంత విరామం తీసుకోవడానికి కారణమేమిటి?

ఖచ్చితమైన కారణాలు ఏమిటో చెప్పలేను. బహుశా మంచి కథలు కుదరక హిందీలో సినిమా చేయలేకపోయానేమో. రాజకీయాల్లో పదేళ్లు క్రియాశీలకంగా ఉండటం వల్ల చిత్రసీమకు దూరంగా ఉండాల్సి వచ్చింది. 2016లో తిరిగి నేను సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చాను. ఏదిఏమైనా చాలాఏళ్ల విరామం తర్వాత బాలీవుడ్ ప్రేక్షకులముందుకురావడం ఆనందంగా ఉంది.

ఈ సినిమాలో అమితాబ్‌గారితో కలిసి పనిచేయడం ఎలాంటి అనుభూతిని చ్చింది?

అమితాబ్‌బచ్చన్ నాకు రియల్‌లైఫ్‌లో గురువులాంటివారు. యాదృచ్ఛికంగా సినిమాలో కూడా గురువుగా నటించారు. నా దృష్టిలో మెగాస్టార్ అంటే అమితాబ్ బచ్చనే. ఆయన సమీపంలోకి ఎవరూ రాలేరు. అమితాబ్‌గారితో కలిసి పనిచేయడం మరచిపోలేని అనుభూతిని చ్చింది. ఈ సినిమా విషయంలో ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను. ఈ కథలో రాజగురువు పాత్రకు అమితాబ్‌బచ్చన్ అయితేనే బాగుంటుందని దర్శకుడు సురేందర్‌రెడ్డి నాతో చెప్పాడు. నేను అమితాబ్‌గారికి ఫోన్ చేసి 'మా అబ్బాయి రామ్‌చరణ్ సినిమా ప్రొడ్యూస్ చేస్తున్నాడు. అద్భుతమైన కథ. మీరు నా గురువు పాత్రను చేయాలి. వారం రోజులు డేట్స్ కేటాయిస్తే సరిపోతుంది' అని అడిగాను. 'నాకు సినిమా గురించి ఎక్కువ సమాచారం అవసరం లేదు. నువ్వు అడిగావు కదా..సినిమా చేద్దాం' అని అమితాబ్‌గారు బదులిచ్చారు. ఆ తర్వాత కథ మొత్తం చెప్పడానికి మా టీమ్‌ని ముంబయికి పంపించాను.

రాజకీయాల్లోకి వెళ్లడం వల్ల సినిమాలకు దాదాపు పదేళ్ల విరామం తీసుకున్నారు. ఈ సమయంలో పరిశ్రమలో ఎలాంటి మార్పుల్ని గమనించారు?

ఆ దశాబ్దకాలంలో పరిశ్రమలో గణనీయమైన మార్పులొచ్చాయి. ముఖ్యంగా సాంకేతికంగా సినిమా ముఖచిత్రం మారిపోయింది. అంతా డిజిటల్‌మయం అయిపోయింది. 'ఖైదీ నెంబర్ 150' షూటింగ్ లో పాల్గొంటున్నప్పుడు అది నా తొలి సినిమాలా అనిపించింది. అయితే సాంకేతికంగా ఎంత పురోగమించినా.. సినిమా ఆత్మ మాత్రం అస్సలు మారలేదు. సినిమా తొలినాళ్ల నుంచి కంటెంట్, సెంటిమెంట్, ఎమోషన్స్‌కు ప్రేక్షకులు పెద్దపీట వేస్తూనే ఉన్నారు.

ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఎలాంటి వర్క్ చేశారు?

ఈ వయసులో యాక్షన్ ఘట్టాల్లో నటించాలంటే చాలా శ్రద్ధ తీసుకోవాలి. యాక్షన్ సీక్వెన్స్ కోసం తప్పకుండా కష్టపడాల్సిందేనని రామ్‌చరణ్, సురేందర్‌రెడ్డి కోరారు. దాంతో గుర్రపు స్వారీ, కత్తిసాము వంటి యాక్షన్ సీక్వెన్స్‌లో ఎలాంటి డూప్‌లేకుండా నటించాను. ఈ వయసులో రిస్క్ తీసుకోవడం కొంచెం కష్టమే అయినా హార్డ్‌వర్క్‌ని నేను ఎప్పుడూ ఇష్టపడతాను. అందులో ఆనందం దొరుకుతుంది. ఈ సినిమాలోని ఆరంభ సన్నివేశాలకు మోహన్‌లాల్ (మలయాళ వెర్షన్), కమల్‌హాసన్ (తమిళ వెర్షన్) వాయిస్ ఓవర్ ఇస్తామని మాటిచ్చారు.

'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో చిరంజీవి

చరిత్ర మనతోనే మొదలవ్వాలి!

'చరిత్ర స్మరించుకుంటుంది ఝాన్సీలక్ష్మీ బాయి, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ లాంటి ఎందరో మహనీయుల ప్రాణత్యాగాల్ని..కానీ ఆ చరిత్రపుటల్లో కనుమరుగయ్యాడు ఒక వీరుడు..ఆంగ్లేయులపై తొలిసారి యుద్ధభేరిమోగించిన రేనాటి సూర్యుడు..' అంటూ పవన్‌కల్యాణ్ అందించిన వాయిస్‌ఓవర్‌తో విడుదలైన 'సైరా' టీజర్ భావోద్వేగభరితంగా ఆకట్టుకుంటున్నది. చిరంజీవి కథానాయకుడిగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రామ్‌చరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నయనతార, తమన్నా కథానాయికలు. అమితాబ్‌బచ్చన్, విజయ్‌సేతుపతి, సుదీప్, జగపతిబాబు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. టీజర్ ఆద్యంతం ఎమోషనల్‌గా సాగింది. పోరాటఘట్టాలు భారీ గ్రాఫిక్ హంగులతో రొమాంచితంగా సాగాయి. సాంకేతికంగా అత్యున్నత ప్రమాణాలు కనిపించాయి. నరసింహారెడ్డిగా చిరంజీవి ఆహార్యం, శక్తివంతంగా సంభాషణలు చెప్పిన తీరు అభిమానుల్ని మెప్పిస్తున్నది. 'హూ ఈజ్‌దిస్ నరసింహారెడ్డి' అంటూ ఓ ఆంగ్లేయుడు ప్రశ్నించగా 'సింహంలాంటోడు దొర..అతడే వాళ్లధైర్యం దొర' అంటూ ఓ వ్యక్తి బదులివ్వడం.. చివరగా 'రేనాటి వీరులారా..చరిత్రలో మనం ఉండకపోవచ్చు..కానీ చరిత్ర ఈరోజు మనతోనే మొదవ్వాలి' అంటూ చిరంజీవి ఉద్వేగపూరితంగా చెప్పే సంభాషణల టీజర్‌లో హైలైట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి.

థ్రిల్లర్ 'దర్పణం'

ఎలక్సియస్, తనిష్కరెడ్డి

తనిష్కరెడ్డి, ఎలక్సియస్ జంటగా నటిస్తున్న చిత్రం 'దర్పణం'. రామకృష్ణ వెంప దర్శకుడు. శ్రీనంద ఆర్ట్స్ పతాకంపై క్రాంతి కిరణ్ వెల్లంకి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రాలన్నీ మంచి విజయాన్ని సాధించాయి. అదే కోవలో క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. చివరి నిమిషం వరకు ఏం జరుగుతుందా? అని ఉత్కంఠతో ఎదురు చూసేలా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకముంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'సెన్సార్ పూర్తయింది. చిత్రాన్ని సెప్టెంబర్ 6న రిలీజ్ చేయాలని సన్నాహాలు చేస్తున్నాం. అనుక్షణం ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే చిత్రమిది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, ఎడిటింగ్: సత్య గిడుతూరి.